ఇంద్రవెల్లి
పోలీసు
కాల్పుల్లో
రక్తంలో
తడిసి
పొలాల్లో
పడిపోయిన
గోండు
వస్త్రం,
గోండులు
మీటింగుకు
పట్టుకవచ్చిన
'ఆయుధం'
(కర్ర)



115/116
మే - జూన్
1981

సృజన

అమానుష పోలీసు హత్యాకాండవల్ల ఆపదలోకి నెట్టబడిన ఆదిలాబాదు ఆదివాసులకు సంఘీభావం ప్రకటించండి!

ఇంద్రవెల్లిలో ఏప్రిల్ 20న ప్రభుత్వం జరిపిన దురంతంతో ఆదిలాబాదు జిల్లా గిరిజనులు తల్లడిల్లిపోతున్నారు. ప్రభుత్వం పదముగ్గురే చచ్చారని ప్రకటించి, ఆ శవాలను బంధువులకైనా చూపకుండా బూడిదచేసి, తన నెత్తుటి చేతులు కడిగేసుకున్నా ఇంద్రవెల్లి ఇరుగు పొరుగు పరిసరాల్లో పొలాల్లో, పొదల్లో, మారుమూల గూడాల్లో గోండుల గుండెల్లో పొదవుకున్న రహస్యాల్లో మృతుల సంఖ్య పదులు దాటి వందలోకి పాకుతూనే వున్నది. గాయపడి, నాగరిక వైద్యాన్ని, ప్రభుత్వ అనుమానపు ఆపరేషన్ చూపును తప్పించుకొని ఆకులు, పసర్లు ఆసరాగా మూలుగుతూ మూల్గుతూ ప్రభుత్వం ఇచ్చే తుపాకి మందు వైద్యంకన్నా మందులేని, వైద్యంలేని అజ్ఞానపు చీకటి బతుకు కనీసం ప్రాణాలను హరించదు అని బతుకుతున్న గిరిజనులు వందల సంఖ్యలో వున్నారు.

అనేక కుటుంబాలు జీవనాధారమైన యువకుల్ని, పెద్దల్ని కోల్పోయి బతుకులు ఎలా వెళ్ళదీయాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నాయి. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు, గాయపడినవారూ, వారి కుటుంబాలూ ఒకవంక పోలీసుల కిరాతకాల భయానికి యింకొకవంక దుర్భర దారిద్ర్యానికీ మధ్య నలుగుతూ చెట్టుకొకరు పుట్టకొకరుగా కుములుతున్నారు. ప్రభుత్వం దృష్టిలో, ప్రకటించిన మృతుల సంఖ్య• ఆసుపత్రిలో చేర్చిన గాయపడిన వారి సంఖ్య తప్ప అడవి మారుమూలల్లో ప్రతిధ్వ నిస్తున్న మరణాల, గాయాల బాధలుపడవు. ప్రభుత్వమూ అడవిలో దాగిన భయంకర సత్యాలను అంగీకరించడానికి సంసిద్ధంగా లేదు.

పోనీ వాళ్ళకైనా ఎక్స్‌గ్రేషియా బిచ్చపు ఎంగిలి మెతుకులు చేరతాయా అంటే మధ్యన తినిపోయేరకరకాల ప్రభుత్వశాఖల కాకులు, గద్దలు ఎన్నెన్నో. ఒక కోటో, రెండువందల డెబ్బైలక్షలో సంక్షేమనిధి అడవి మారుమూలలకు రోడ్లువేసి వైర్‌లెస్ వాహనాలు నడిపించడానికీ, పోలీసుబలగాన్ని పెంచడానికీ, చైతన్యవంతమవుతున్న గిరిజనుల నుంచి ప్రభుత్వ తుపాకికి "భద్రత"ను కూర్చడానికే తప్ప గిరిజనుల జీవితాలను మెరుగుపరచడానికి ఏమాత్రం కాదు.

ఈ దారుణ విపత్తునుంచి తేరుకొని గిరిజనులు తిరిగి మామూలు మనుషులు కావడానికీ, పోలీసు కాల్పులనుంచి, మోసాల ప్రకటనల నుంచి బయటపడి, భయ

(మిగత 3వ కవర్ పేజీలో)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

115/116 మాసపత్రిక మే/జూన్ 1981

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 3

ఇంద్రవెల్లి కార్చిచ్చు

ఒక నిప్పురవ్వ మహాజ్వాలగా రగుల్కొంటుంది. ఆదిలాబాదు ఆదివాసుల మారుమూల గూడాల్లోకి నక్సల్బరీ సంతాల్ రైతాంగం, శ్రీకాకుళసవర, జాతాపు రైతాంగం ఉప్పందించారు, నిప్పందించారు. పొరుగునవున్న జగిత్యాలజనం జవసత్తు వలిచ్చారు. ఉట్నూరు చైతన్యపు ఊటలూరింది.

బాధరగిలిందిరా జంబాయిరే ఆదిలాబాద కదిలిందిరా జంబాయిరే— చికాగోలో పనిగంటల నియమంకోరిన కార్మికులను కాల్చివేసి కార్మికవర్గ పోరాటాల పతాకగా ఎర్రజెండా ఎగరడానికి కారణమైంది పెట్టుబడిదారీ వ్యవస్థ. పెట్టుబడిదారీ గర్భంనుంచే దానికి గోరీకట్టే కార్మికవర్గం పుట్టుకవస్తుందని మార్క్స్ చెప్పినమాట ఆయనకు ముందూవెనకా ఎన్నిమార్లు మనముందు రుజువవుతున్నదో.

బందగీని, దొడ్డి కొమురయ్యనుచంపి రైతాంగాన్ని సాయుధ పోరాటానికి రెచ్చగొట్టింది నైజాం జమీందారీ జాగీర్దారీ నిరంకుశవ్యవస్థ. కోరన్న, మంగన్నలపై దొంగచాటున కాల్పులుజరిపి శ్రీకాకుళ గిరిజనరైతాంగం దెబ్బతిన్న బెబ్బులిలా గర్జించడానికి కారణమైంది ఇందిరా వెంగళరావు అర్థవలస అర్ధభూస్వామ్య వ్యవస్థ.

ఇవ్వాళ ఇంద్రవెల్లిలో జలియన్ వాలాబాగ్, మిలాయ్ దురంతాలను తలపింపచేసి ఇందిరా ఫాసిస్టు ప్రభుత్వం తనగోయి తవ్వడానికి గోండులను కోరి, గోకి, పుండు రేపి రెచ్చగొడుతున్నది. అందుకే ఇంద్రవెల్లిలో రగిలినజ్వాలలు ఇందిర రాజ్యం పగిలేజాడలు.. జలియన్ వాలాబాగ్ భారత రాజకీయాల్లోకి భగత్ సింగ్ పంథాను తెచ్చింది. సంతాల్ లపై, సవరలపై, జాతాపులపై. జోతేదార్ల, భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, వారికి అండగావచ్చిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సాయుధ దమనకాండ నక్సల్ బరీ, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాట కార్యక్రమాన్ని భారత ప్రజాస్వామిక విప్లవానికి వ్యవసాయవిప్లవం ఇరుసుగా అందించింది.

నక్సల్బరీ నాగేటిచాళ్ళల్లో పదకొండుమంది సంతాల్ల రక్తంచిందింది— సంతాల్ లకు సామ్రాజ్యవాదంతో, భూస్వామ్యంతో పోరాటం కొత్తకాదు— ప్రాణాలర్పించడమూ కొత్తకాదు.. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని విల్లమ్ములతో గడగడలాడించిన పేజగాట్ల సంతాల్ లు— కాని పోరాటమంటే నూతన వ్యవస్థకు పుట్టుకనిచ్చే వసంత మేఘగర్జనమని సంతాల్ లకు నక్సల్బరీయే దారిచూపింది.

రంపపితూరీలో, మన్నెప్రజల పోరాటంలో, అల్లూరి సీతారామరాజు, మార్పు పద్మనాభం, గుండమ్మల నాయకత్వంలో గోదావరీతీర ఏజెన్సీ ఏరియా మొదలుకొని శ్రీకాకుళందాకా గిరిజనుల పోరాటచరిత్ర వీరోచితమైంది, గగుర్పాటు కలిగించేదీ. కాని కోరన్న మంగన్నల త్యాగంతో మొదలైన శ్రీకాకుళచరిత్ర గుణాత్మకమైన

మార్పుకు సంబంధించింది. శ్రీకాకుళంలోన చిందిన రక్తము కొండలెరుపెక్కినాయి పోరాడ బండలే కదిలినాయి. పోరాడ కండలే కదిలినాయి పోరాడ గుండెలే కదిలినాయి- అన్నిటికీమించి పోరాడ ఎర్రజెండాలు కదిలినాయి. గిరిజన రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించే కార్మికవర్గపార్టీ భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) ఏర్పడింది- చారుమజుందార్ లు, వెంపటాపుసత్యాలు నక్సల్బరీ, శ్రీకాకుళాలు ననలేసి చిగురించి, వికసించిన విప్లవ చైతన్యంలో కాకలుతీరిన పోరాటానికి, త్యాగానికి మారుపేర్లు.

ఆదిలాబాదు ఆదివాసులుకూడ పిరికివాళ్ళేమీకాదు- ఇతరులను దోపిడీచేయడ మెరుగని అమాయకులేకాని దోపిడీని ధైర్యంగా ఎదుర్కొనే విషయంలో అమాయకులు కాదు. బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలోనూ, నైజాంరాజ్యంలోనూ గోండ్వానా రాజ్యం ఏలుకున్న స్వాతంత్ర్య ప్రియులు, ఈనాటికీ గోండురాజ్యంకోసం కలలు కంటున్న రగల్ జెండాలు, బాబేఝరీలో కొమురంభీం, కొమ్ముద్ది, తుడుంవాయించి నైజాంసైన్యాన్ని ఎదిరించిననాడుకానీ, నిజమైన ప్రేమతో, సానుభూతితో గోండుల జీవితాలను మెరుగుపరచాలని వచ్చిన హేమన్ డార్ఫ్ కు తమసమస్యలు పరిష్కరింపబడకపోతే బడితెపూజ జరుగుతుందని వృద్ధగోండు హెచ్చరించిననాడుకానీ, తుపాకులకు ఎదురునిల్చి, తూటాల దెబ్బలను లక్ష్యపెట్టకుండా చైతన్యం పొందిన పొరకలు కదిలినట్లుగా జనం కదిలినపుడుగానీ వ్యక్తమయ్యేది ఆదివాసుల ఆరాటం మాత్రమే కాదు, వాళ్ళ పోరాటశీలంకూడా పొదల పొగల గట్లనడుమ పొడిచిన చందమామలాగా తొంగిచూస్తున్నది- అయితే ఆదివాసుల ఆరాటం అడవిగాచినవెన్నెల కాకూడదనే చైతన్యమే రగల్ జెండాపై చంద్రవంకస్థానంలో సుత్తె - కొడవలిని హత్తుకొన్నది.

అడవిమాది, గోదావరినది నిడివిమాది
పోడుచేసి సాగుచేసె పొలంమాది
కోనమాది, కొండమాది, అడవిగుండె తేనెమాది
కొండ్రమాది. కొప్పుమాది, అడవిగుండె నిప్పుమాది

అని భూస్వామిఏంది, వడ్డీవ్యాపారిఏంది, ఫారెస్టు అధికారిఏంది, వాళ్ళకు అండగావచ్చే పోలీసు తదితర ప్రభుత్వ బలగాలేంది అని ప్రశ్నించడంమాత్రం వాళ్ళు పొరకలపార్టీ నాయకత్వంలో నేర్చుకున్నారు- అందుకే కొమురంభీంతోపాటు పదకొండుమందిని కాల్చిచంపి నైజాం పాఠంచెప్పాలనుకుంటే అంతకు పదిరెట్లుచంపి గోండులకు పాఠం చెప్పాలనుకున్నది ఇందిరా అంజయ్య ప్రభుత్వం. కాని ఇప్పుడు ఆదిలాబాదు గిరిజనులు

రగల్ జెండానిండ రక్తమేమనిఅడుగ

పుడమితల్లికి పురిటినొప్పులని చెప్పాలి అనే చైతన్యాన్ని పొందారు.

శ్రీకాకుళ గిరిజన రైతాంగపోరాటం కేవలం గిరిజన తిరుగుబాటు కానట్లే అది కమ్యూనిస్టుపార్టీ (మా-లె) నాయకత్వంలో నిర్వహించబడిన రైతాంగ సాయుధ పోరాటమైనట్లే ఈనాడు ఆదిలాబాదులోది కేవలం గోండుల తిరుగుబాటుకాదు. ప్రభుత్వం, బూర్జువా పత్రికలు చిత్రించడానికి ప్రయత్నిస్తున్నట్లు గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్యన ఘర్షణకాదు- రగల్ జెండాయే రాడికల్ జెండాగా మారి పొరకల పార్టీ నాయకత్వాన భూమి కోసం, భుక్తి కోసం సాగుతున్న పోరాటమది- గిరిజనులను కూడగట్టడానికి సంప్రదాయికంగా ఊదేకొమ్ము బూరలు, మోగే తుడుంలు ఇవ్వాళ సుత్తి కొడవలి- జెండా నీడలోనినదిస్తున్నాయి- 1857 భారత స్వాతంత్ర్య ప్రథమ సంగ్రామంలో రొట్టెలు, పువ్వులు ఏ సంకేతాలు అయ్యాయో ఆనాడు మొదలై ఇంకా పరిపూర్తి కాని ప్రజాస్వామిక విప్లవంలో ప్రజాపంథాను చేపట్టిన ఈనాటి ఆదిలాబాదు గిరిజన రైతాంగ పోరాటంలో వాళ్ళ సంప్రదాయపు ఆయుధాలు, వాయిద్యాలు, పండుగలు, జెండాలు, వాళ్ళదే అయిన ఆటవికశక్తి అడవిసంపద తమదే అనే చైతన్యానికి అలాంటి సంకేతాలయ్యాయి.

ఇవ్వాళ వాళ్ళు పొరకలదొర పులిమీద వస్తాడని నమ్మడం లేదు- ప్రజల్లోంచి పుట్టుకొస్తాడని తెలుసుకున్నారు- ఇవ్వాళ వాళ్ళకు పొరకల దొర ఒక పేరుకాదు- పార్టీ వ్యక్తి కాదు, నాయకత్వం వహించే శక్తి- పొరకల దొరనైనా, గోండులనైనా తుపాకి రవ్వలు గాయపరుస్తాయని వాళ్ళు తెలుసుకున్నారు- తుపాకి గొట్టంద్వారా పొగ మాత్రమే వస్తుందనుకొనే 'మార్క్సిస్టు' మహా మేధావులు మనకుంటే ఉన్నారేమో కాని తుపాకి గొట్టంద్వారా రాజ్యాధికారం వస్తుందని పొరకలపార్టీ నాయకత్వంలో ఆదిలాబాదు ఆదివాసులు తెలుసుకున్నారు- తూటాలు పువ్వులుగా మారవు పువ్వులను కాల్చి చీల్చి చిదిమి రక్తాన్ని చిందిస్తాయని ఇంద్రవెల్లి మరోమారు వాళ్ళ అనుభవానికి తెచ్చింది. వాళ్ళు ప్రేమగా పిలుచుకొనే అడవి (పొరకలు చెట్లు) పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) పీపుల్స్ వార్ అని మైదాన ప్రాంతాల్లో భారతదేశంలో ఇతర ప్రదేశాల్లో పిలుస్తారని వాళ్ళకు తెలియకపోవచ్చు- కాని బయటకూడా పొరకలపార్టీవుందని వాళ్ళకుతెలుసు- తాము ఏర్పాటుచేసుకున్న గిరిజన రైతుకూలీ మహాసభలో పొరకలసార్లు వచ్చి మాట్లాడుతారనీ అది కరీంనగర్ - ఆదిలాబాద్ రైతాంగ పోరాటానికీ, గిరిజనరైతాంగ పోరాటానికీ, మైదానానికీ- అడవికీ ముడివేసే మైత్రియాత్ర అవుతుందనీ, జైత్రయాత్ర అవుతుందని వాళ్ళకుతెలుసు. అందుకే ఇప్పటికీ గాయంమానగానే పొరకలపార్టీసభకే నేరుగా పోవడానికే వాళ్ళు కృతనిశ్చయులై వున్నారు. ఈనిశ్చయంపై నివురుకప్పితే కప్పవచ్చునేమోగానీ నిప్పుమాత్రం ఇంకెప్పుడూ చల్లారదు.

16-5-81

— సంపాదకుడు

పుస్తక పరిచయం:

రగులుకొనే రాక్షసి బొగ్గు

(ఈశాన్య భారత్ రాజకీయార్థిక పరిచయం)

'అంతానికి ఆరంభం'

"బుధవారం, పద్దెనిమిది మార్చి, 1956 చీకటిపడేవేళ, చిరుతపులులు పశువుల్ని నోటకరుచుకొని పోయేవేళ, చికెమా గ్రామసరిహద్దులలో పొద్దంతా పనిచేసి అడవినుండి తిరిగివస్తున్న ఇద్దరు గిరిజనులను సాయుధసైన్యాలు నిర్బంధించాయి. సైనికులు వాళ్ళిద్దరి చేతులు వెనక్కి విరిచికట్టివేశారు. ఆఇద్దరి చేతులకుకలిపి ఒకకర్ర, ఆకర్రకు వేలాడుతున్న ఒకశవం. తుపాకులు దారితీస్తే ఆగ్రామస్తులు తమ గ్రామానికి తిరిగివచ్చారు. వాళ్ళిద్దరినీ చెట్టుకు కట్టివేశారు. గ్రామంలోఉన్న గిరిజనులంతా భయం భయంగా ఆ ఇద్దరికేసిచూస్తూ నిస్సహాయులుగా ఉండిపోయారు. అప్పుడు నెమ్మదిగా, గురిగా ఆఇద్దర్ని సైనికులు కాల్చివేసారు. వాళ్ళు భారతసైనికులు,- అదినాగాలాండ్" (105వ పేజి)

"బ్రహ్మపుత్రనదీ దక్షిణతీరంలో మంగళోదయ్ ఒకచిన్న పట్టణం- ఆ పట్టణంనుండి 1977 పార్లమెంటు ఎన్నికలలో జనతాఅభ్యర్థి హీరాలాల్ పట్వార్ గెలిచారు. ఆయన ఆకస్మిక మరణంతో 1979 మేలో అక్కడ ఉపఎన్నికలు జరపడానికి ఎలక్షన్ కమీషన్ నిర్ణయించింది- కొత్త ఓటర్ల జాబితాను తయారుచేసింది.... ఆజాబితాలో 46 వేలమంది విదేశీయులున్నట్లు ఎన్నికల కమీషన్ ప్రకటించింది- సంవత్సరకాలం పాటు భారత రాజకీయ జీవితంలో సంక్షోభం సృష్టించిన అస్సాం ఉద్యమం అక్కడనుండి ప్రారంభ మయింది.... విశ్వవిద్యాలయ మేధావుల నుంచి సామాన్య ప్రజానీకం దాకా, యవ్వనంలో ప్రవేశిస్తున్న యువతీ యువకుల నుండి వయసు మళ్ళిన స్త్రీ పురుషుల దాకా బ్రహ్మపుత్ర లోయనిండా ప్రజాప్రవాహాలు వెల్లువలై సాగాయి.... ప్రభుత్వ పాలనాయంత్రాంగం స్తంభించిపోయింది. దేశరాజకీయ పార్టీలన్నీ ఒడ్డునపడి నిస్సహాయులుగా మిగిలిపోయాయి. ఒకవైపు బెంగాలీల మీదా ముస్లింల మీదా, వామపక్షీయుల మీదా దాడులు జరిగాయి. సాంఘిక ఐక్యత ప్రమాదాన్ని ఎదుర్కొంది. మరోవైపు విశాల ప్రజానీకం దశాబ్దాల నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ బలమైన ఉద్యమాన్ని నిర్వర్తించారు. కేంద్ర ప్రభుత్వం కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి వేలాది సాయుధ సైన్యాలతో ప్రజా జీవితాన్ని బందిఖానాలోకి నెట్టింది. ఈ ఉద్యమబలంతో ఈశాన్యప్రాంత అప్రకటిత యుద్ధాలు అనకట్టలు

తెంచుకొని ప్రవహించాయి. తరతరాల తెరచాటులు చీల్చుకొని చరిత్ర చిక్కుముడులు వర్తమాన ప్రపంచాన్ని ప్రశ్నించాయి—" (112 పే)

ఆ ప్రశ్నలకు సమాధానాలు వెదకటంలో శ్రీసు రాపడిన శ్రమ ఫలితమే రగులు కొనే రాక్షసి బొగ్గు.

ఈశాన్య భారతంలో మొత్తం ఏడుప్రాంతాలున్నాయి (ఏడుగురు అక్కచెల్లెళ్ళు) 1) అస్సాం 2) త్రిపుర 3) మణిపూర్ 4) నాగాలాండ్ 5) మిజోరమ్ 6) మేఘాలయ 7) అరుణాచలప్రదేశ్.

ఈ ఏడు ప్రాంతాలలో ప్రభుత్వం అమలుచేస్తున్నదమననీతి, అమెరికన్లు వియత్నాంలో, దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి దురహంకారులు నల్లజాతీయులపై సాగించిన హింసాకాండను మించిపోతుంది. నాగాలాండ్ మొత్తమూ, మిజోరం మొత్తమూ, మణిపూర్‌లో ఇంఫాల, మణిపూర్‌లోయ, నాగాలప్రాంతం, త్రిపురలో దక్షిణ పశ్చిమకొండ ప్రాంతాలు, కొంతకాలం అస్సాం మొత్తమూ కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి. "ఈ చట్టాలు జారీచేయబడడంలోను అమలుపరచడంలోను, న్యాయస్థానాలకు పార్లమెంటు అసెంబ్లీలకు ఏ విధమైన పాత్రలేదు. కేవలం అధికారంలో ఉన్నవారు ఏ ప్రాంతమైనా కల్లోలంగా ఉందని అభిప్రాయపడితేచాలు. ఆ ప్రాంతం కల్లోలితప్రాంతం అవుతుంది. నామమాత్రపు పార్లమెంటు అనుమతికూడా దీనికి అవసరం లేదు. ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన వెంటనే ఆ ప్రాంతంలో సాయుధ సైన్యాలకు విశేషాధికారాలు వస్తాయి. అయితే వాటిచర్యలను న్యాయస్థానాలలో ప్రశ్నించే హక్కు ప్రజలకులేదు తుదకు రాష్ట్రప్రభుత్వాలకు కూడా వాటిపై ఏ అధికారం ఉండదు."

"నాగాలాండ్‌లో 1956 నుండి పౌరజీవితంపై సైన్యానికి సంపూర్ణాధికారం ఏర్పడింది. నాగా తిరుగుబాటుదార్లకు సహాయం చేస్తున్నారనే అనుమానంతో అనేక మంది చిత్రహింసలకు గురయ్యారు. మూకఉమ్మడిగా గిరిజన స్త్రీలను చెరచడం, కాళ్ళుచేతులు నరికివేయడం, కళ్ళు పొడిచివేయడం, పొగతోనింపిన గదులలో గిరిజనులను నిర్బంధించడం, గ్రామాలను తగులబెట్టడం ధాన్యాలను లూటీచేయడం, రహస్యాంగాలను కోసివేయడం బహిరంగంగా చెట్టుకుకట్టి ఊపిరితీయడం, మొదలైన ఎన్నో పద్ధతులద్వారా సైన్యాలు తిరుగుబాటును అణచివేయడానికి ప్రయత్నించాయి. నాగా పౌరహక్కుల సంఘనివేదిక ప్రకారం ఇవ్వాళ నాగాలాండ్‌లో ప్రతికుటుంబంలోను, సైనిక అత్యాచారాలకు గురయినవ్యక్తి కనీసం ఒక్కరయినా ఉంటాడు" నాగా

లాండ్‌లో నేర్చుకొన్న ఈ చిత్రహింస పద్ధతులను సైన్యాలు మిజోరంలో మరింతగా ఆచరణలో పెట్టాయి.

ఒక అంచనాప్రకారం సైన్యాలు 535 గ్రామాలలోని 23 వేల కుటుంబాలకు చెందిన లక్షయాభయివేల ప్రజలను దశాబ్దకాలంలో 110 కొత్తగ్రామాలకు తరలించాయి. "ఇటీవల కాలందాకా నాగా మిజోలపై ప్రభుత్వం సాగిస్తున్న ఈ రహస్య యుద్ధాలగురించి మిగతా ప్రాంతాలలో మేధావులకుకూడా తెలియదు. సమస్య తీవ్ర రూపం దాల్చినప్పుడల్లా విదేశీ శక్తులప్రోద్బలం అని, అల్పసంఖ్యాకుల కుట్రలనీ ప్రభుత్వం వీటిని చిత్రీకరించింది" (పే 108, 109)

మూడు దశాబ్దాలపాటు సాగిన యీ అప్రకటిత అంతర్‌యుద్ధాలు ఇవ్వాళ ఇనుప గోడల్ని చీల్చుకొని బయట పడ్తున్నాయి. అవి 'అల్పసంఖ్యాకుల కుట్ర' కాకపోవడమే దానికి కారణం. నిజానికి అల్పసంఖ్యాకుల కుట్ర అంటూ ఏమన్నా జరిగితే అదిప్రభుత్వం వైపునుండే జరిగింది. దేశభద్రత పేరుతో ప్రజానీకంపై సాగిన యీదారుణకాండను నిశ్శబ్దంగా సమర్థించిన అన్నిరాజకీయ పక్షాలు ఈ కుట్రలో భాగం. అణగారిన ప్రజల పేరుతో గొంతుచించుకొనే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఈ కుట్రలో భాగం. భావ ప్రకటన స్వేచ్ఛకోసం, కేకలువేసే పత్రికలు, ప్రచారసాధనాలు ఈ కుట్రలో భాగం. యీ నిశ్శబ్దపు కుట్ర తెరవెనుక నుండి నడిపించిన వాళ్ళు అల్పసంఖ్యాకులు. ఈశాన్య భారత పోరాటాల మార్పుకోసం సంఘర్షించిన వేలాది గిరిజనుల తీరని అన్వేషణలు."

అక్కడ రాక్షసిబొగ్గు రగులుకుంటోంది. ఆ నిప్పు ఆరిపోకుండా చూడడం భారతీయుల కర్తవ్యం. దానిని ఊది ఊది ఈ రాక్షసవ్యవస్థ మొత్తం బూడిదయ్యే దాకా దేశమంతా దానిని పాకేలా చేయడం మేధావుల బాధ్యత, అందుకు ఆ ప్రాంతం గురించి క్షుణ్ణంగా కాకపోయినా క్లుప్తంగానైనా తెలుసుకోవాలి. ఆ మేరకు శ్రీ సు. రా ఈ పుస్తకంలో కృతకృత్యులయినట్లే.

రాజకీయ, ఆర్థిక విషయాలు రాయడంలో - పాఠకులకు విషయం అందించడం విసుగుకలిగించకుండా ఉండటం- ఈరెండిటికీ సమన్వయం సాధించడం కష్టం. కాని ఈ పుస్తకంలో విషయం శాస్త్రీయంగా వివరింపబడుతూనే ఇంటరెస్టు పోగొట్టనిరీతిలో చెప్పబడింది- ఈ ఏడుప్రాంతాలకుఉన్న 125 సం॥ల పోరాటచరిత్ర, భౌగోళిక చారిత్రిక పరిచయంలో క్లుప్తంగాచెప్పబడింది.

జాతుల సమస్యగురించి భారతదేశపరంగా ఇప్పటివరకు జరిగినచర్చ చాలకొద్ది మాత్రమే. దానివిషయమై ఈపుస్తకంలో జరిగినచర్చ నిశితంగాఉంది "జాతీయతా

భావాలకీ, ఆర్థిక పోరాటాలకు పంతెనవేయటంలో భారత కమ్యూనిస్టు ఉద్యమం నిర్దిష్టమైన వైఖరి తీసుకోలేకపోయింది" ఆ లోపం ఇప్పుడు పూరించబడాలి- నేటి భారతదేశంలో జాతులకలయికను పిరమిడితో పోల్చారు రచయిత. అట్టడుగున ఉన్నది- దోపిడికీ సాంస్కృతిక నిర్బంధానికీ గురవుతున్న జాతులు- గిరిజన-తెగలు ఆపైన ప్రధానజాతులుగా రూపొందిన జాతులు (హిందీ, బెంగాలీ, తమిళ, తెలుగు మొ॥వి). వాటిపైన ఆంగ్ల భాషాధిపత్యం. ఈవిశ్లేషణ చారిత్రిక పరిశీలనతో వివరించ బడింది- జాతులవిషయం ఇంత ప్రధానంగా వివరించడానికికూడా ఒకముఖ్య కారణంఉంది- ఈశాన్యభారత అస్పష్టమైన విభిన్నజాతుల కలయిక. మరొక ప్రత్యేకత ఈప్రాంతం బ్రిటిష్‌పాలకుల దురాక్రమణతోనే భారతదేశంలో ఒక భాగమయింది- భారతదేశానికి ఈశాన్య ప్రాంతాలకీ యుద్ధమే ప్రధానంగా సంబంధాలు నడిచాయి. ఈ ప్రాంతంలో రాజ్యాంగయంత్రం అమలుజరిపిన ఆర్థికనీతి ఒకవ్యక్తిని మరొకవ్యక్తి, ఒకజాతిని వేరొకజాతి పీడించే సాంఘికధర్మం"-

ఆర్థికచిత్రణలో ఇక్కడి విజాతీయుల సమస్య వెనుకగల ఆర్థికకారణాలు స్పష్టంగా వివరించబడ్డాయి- ఈప్రాంతంలో సహజవనరులకు కొదువలేదు- కాని వెనుకబాటుతనంలో ముందడుగువేసిన ప్రాంతంఇది- తేయాకుతోటలు, పెట్రోలియం బొగ్గు- లక్షలాది విజాతీయులను ఇక్కడికి ఆకర్షించాయి- సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన తేయాకుతోటలు, ఇక్కడి ఆర్థికవ్యవస్థలో ప్రధానమైన మార్పును తెచ్చాయి- ఈతోటల విస్తరణలో చాల ప్రాంతాలనుంచి కార్మికులు తరలివచ్చారు- విజాతి కార్మికులు చవకగా లభించటమేగాక సంఘటితపడే అవకాశాలు తక్కువ. అందుకే బ్రిటిష్ వాళ్ళు ఈ వలసను ప్రోత్సహించారు- 1859లో 10 వేల సంఖ్యలోఉన్న కార్మికులు 1901లో 653 6 వేలసంఖ్యకు పెరిగారు- తేయాకుతోటలతో, రైల్వేలు, బొగ్గుగనులు, పెట్రోలియం పరిశ్రమలుకూడా పెరిగాయి- ఆహారధాన్యాలకి కొరత ఏర్పడింది సాగులేని భూముల్లో పంటలువేయడానికి జనం అవసరంవచ్చింది- తూర్పుబెంగాల్ నుంచి లక్షలసంఖ్యలో ముస్లిం రైతాంగం వలస ప్రారంభమయింది. పశువుల్ని తోలుకుంటూ- నేపాలీయులు వేలసంఖ్యలో వచ్చారు- దశలవారీగా విజాతీయులవలస ఎలాసాగింది- లెక్కలతోసహా వివరించబడింది.

3 దశాబ్దాలుగా న్యూఢిల్లీ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆర్థిక నీతి ఈప్రాంతం నుండి లాభాలార్జించి మిగతా ప్రాంతాలను అభివృద్ధిచేసుకున్న సామ్రాజ్యవాదుల విధానంలాగే కొనసాగింది- అస్సాం పారిశ్రామిక సంఘం అంచనాప్రకారం పెట్రోలియం

ప్రతి టన్నుకు ప్రభుత్వానికి 1600 రూ॥ లభిస్తే అందులో రూ॥ 42/- మాత్రమే అస్సాంకు రాయితీగా చెల్లిస్తున్నారు- అస్సాంలోగల 40 కలప ఫ్యాక్టరీలలో ఒక్కటి గూడా అస్సామీయులది కాదు- ముడిపట్టు ఉత్పత్తిలో 59 శాతంకన్నా ఎక్కువ పంచుకొనే అస్సాంలో చెప్పుకోదగ్గ పట్టుబట్టల ఫ్యాక్టరీ లేదు- గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ ఆర్థిక రాజకీయ విధానాలను సమర్థించడానికి ఒక బలమైన వర్గం ఏదీలేకుండా పోయింది- భారతదేశంలో పెట్టుబడిదారుల ఆర్థికాభివృద్ధికి కీలకమైన ముడిసరుకులు కావటంతో ఇక్కడి పరిశ్రమల ప్రాముఖ్యత పెరిగింది- సాయుధసైన్యం ప్రక్కన ఉండి రక్షణకల్పిస్తేగాని తప్ప ఉత్పత్తి జరగని పరిస్థితి ఏర్పడింది- ఆధునిక సాంఘిక సాంస్కృతిక మార్పులతో ఒక మధ్య తరగతి వర్గం అనివార్యంగానే పెరుగుతూ వచ్చింది- వీళ్ళని ఇముడ్చుకొనే శక్తి ఈ ఆర్థిక వ్యవస్థకు లేనప్పుడు ఈ వర్గం యువ తరం ప్రాథమిక రూపంలో పోరాట స్వభావాన్ని సంతరించు కొంటోంది.

కొన్ని మౌలికాంశాలలో సారూప్యం ఉన్నా ఈశాన్య ప్రాంత ఉద్యమాలన్నీ ఒకేరకమైనవి కావు- ఈ తేడాలు, వీటికిగల పునాదులు, ఈ ప్రాంతాలపై అగ్రరాజ్యాలకు గల ఆసక్తి చాలటూకీగా చెప్పబడ్డాయి.

'అంతానికి ఆరంభం' యివి రచయిత మాటల్లో- నడుస్తున్న చరిత్రను అర్థం చేసుకోవడానికి అవసరమయినంత మేరకు సమాచారాన్నివ్వడం ఈ పుస్తకం పరిధి.... గత సంక్షోభ సంవత్సరం ఒక రకంగా ఈశాన్య భారత్‌లో ప్రజల అణచివేత అంతానికి ఆరంభం- వారి గురించి మన అజ్ఞానపు టంతానికి కూడా ఆరంభం కావాలని ఈ పుస్తకం కోరిక".

రగులుకొనే రాక్షసిబొగ్గు

ఈశాన్యభారత రాజకీయార్థిక పరిచయం- సురా.

యుగ ప్రచురణలు, హైదరాబాద్, అక్టోబర్ 1980, పేజీలు 136

వెల రు. 5-00

ప్రతులకు : సృజన, హనుమకొండ, 506 001

పల్లె పాట :

రైతు పాట

ఉద్రిజ్వాల

ఎంతాజేస్తివె పొడుగుపత్తే - సుష్వా
ఎంతాజేస్తివె పొడుగుపత్తే ॥ఎంతా॥

1 గొడ్డూ, గోద మేతకే
కడుపున కలిపిచ్చినావు
కవ్వాలకు కాళ్లుగట్టి
కుంటినడక జేసినావు
పల్లె పెజల తిండికే
పీకులాట బెట్టినావు
బాదలు తీరుత్తవనీ బాగా మమునమ్మిచ్చీ
బిచ్చగాడికే పిడికెడు బిచ్చం లేదనిపిస్తివి
॥ఎంతా॥

2 గాలీ, నేల మందుల్తో
గరలంగా మార్చినావు
పచ్చన్నా మంచినీల్లు
ముట్టకుండ జేసినావు
రైతుచూపు, గుండెలోను
బలయీసత నాటినావు
దొడ్డి, దోవ, పొలం, పుట్రి కడుకు
కంపతో నింపి
ఇల్లంతా పాడుపొగతో వుక్కిరి
బిక్కిరి జేస్తివె ॥ఎంతా॥

3 పిల్లిమిసర సల్దమంటే
వాళ్లొండలె రావనీ
జొన్నపైరు వేద్దామంటె
అరొందలు తేలవనీ
పెసగను వేద్దమంటే
సగం కర్చు రాదనీ
పెద్దగ అకర్సిచ్చీ పెద్దప్పులు పేయిచ్చీ
మమ్ము పెట్టుబడిదారుని
పాదంబట్టిచ్చినావె ॥ఎంతా॥

4 ఒహటి రెండేడాదులు
బురుబురు మోటర్లిచ్చీ
పైనిపంటె జారేటట్టు
పిల్లగాల్లో తేలిచ్చీ
పక్కాదే వుస్తెగూడ
పట్నంలో అమ్మిస్తివి
బ్యాంకీ తాకట్టు కొరకు
పొలం, యిల్లు నడిపిస్తివి
మిల్లోల్లతో సెయ్యిగలిపి
మిల్లులు గోడేస్లుపెంచి
మాయా మోహినిలా మము కిందు
మీదు జేస్తివే ॥ఎంతా)

5 పెరికాటన్, పెరీనుకా
పొగులిచ్చు పెపిన్, సుపిన్
మేలి మేలి దారమిచ్చు
సి. బి. యస్, వరలక్ష్మి
హైబ్రిడూ, యం. సీ. యూ,
జువారీ, హంపి, కిష్ణ,
భూసారం వొట్టిపోంగ
బేళ్లు, బేళ్లు పండిత్తే
మఫత్‌లాల్, బిన్నికొఠారి, ఎన్నో
కంపెనీల్లో దూరి
మాకె బట్టలోటు జేసి బురిడీ
గొట్టిస్తివే ॥ఎంతా॥

ధిక్కారం

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

ఎండ తీవ్రంగా వుంది- బయట అడుగుపెడితే వేడిసర్రున నెత్తికెక్కుతోంది- పొద్దు కొంచెం వాలింది- ఎండకు బయపడ్తూ నెత్తిమీద పాత గుడ్డొకటి వేసుకొని, గుడిశెలోంచి రోడ్డు మీదకు వచ్చింది రాయమల్లి.

"ఎండబాగానే కొడ్తాంది- ఎండింట్లపీనుగెల్ల" అని కాస్త బయటకేఅనుకుని దృష్టిని కొంత దూరంలోవున్న మామిడిచెట్టు కిందికి సారించింది- ఆ హరిజనులకి ఎండ కాలంలో అదొక కల్పవృక్షం- బాలడు వాని కొడుకు తాళ్ళు పేనుతున్నారు- గూనిరామి ఈతకమ్మ నులక పేనుకుంటోంది- ఇంకా కొంత మంది పోరగాండ్లు అల్లరి చిల్లరి ఆటలు ఆడుతున్నారు- రాయమల్లి వాలిన పొద్దుకు కుడిచేయి అడ్డంగా పెట్టుకొని రోడ్డు దిక్కుచూసింది- ఆ చివర్నుంచి దున్నపోతుల బండి ఒకటి రావడం కన్పించింది- బండిని పరకాయించి చూస్తూ....

"బండి రాజెల్లందే ఉన్నట్టున్నది" అని అనుకుంది- చూస్తుండగానే, దున్నపోతుల కొమ్ములు 'కాడి'కి తగుల్తొంటె 'కట కట' చప్పుడు చేస్తూ.... సొట్ట గీరెల పాతబండి రాయమల్లి ఇంటి ముందుకు రానేవచ్చింది....

"బండి ఊళ్ళెకేనా ? బిడ్డా !" అంటూ నుదుటికి ఆనించిన చేయి తియ్యకుండానే అడిగింది రాయమల్లి.

"అఁ.... ఊళ్ళెకేనే పెద్దవ్వా...." అన్నడు రాజెల్లడు.

"నీ బాంచెన్.... కస బండాప్తు- మాయి గిన్ని వడ్లిత్తులున్నయ్ బండ్లేత్త దొర సానికి పెట్టాలె" అంది రాయమల్లి.

---

6 ట్రాక్టరు యజమాన్లకే
టానుటీకు పెంచునిన్న
జిన్నర్లా, స్పిన్నర్లా
జల్సాల్లో తేలునిన్న
భూస్వామికి, బోకర్లకు
బ్యాంకీల్లో మోగునిన్న
బారుబారు గుడకొల్ల
బీరువాల్లో దొర్లునిన్న
నిన్నిట్లా ఆడిచ్చే కిలాడీ పాలకులను
పోరులోన గెలిచి - నిన్ను
ప్రజల పరం జేస్తనే
మంచీజేస్తనె పొడుగుపత్తే- నీకూ
వన్నెదెత్తనె పొడుగుపత్తే

"సరె ఎయ్యవే.... జెప్పన పోవాలె- కమ్మలు మంచిగలెవ్వు"- అన్నడు రాజెల్లడు.

"ఎన్ని బిడ్డా! రెండు గిద్దెలేకాదు- పండినయా గివ్వి, ఆ మెకు పెట్టేటియా గవ్వి- కస బండిదిగి రారాదు బాంచెన్, ఇంట్ల సమ్మదొక్కడే ఉన్నడు- ముల్లెలు మా ఇద్దరికి లేవయి-" అంటూ బతిమిలాడింది- రాయమల్లి.

"సరె పాయె...." అంటు పగ్గాలు గట్టిగ గుంజి గుజ్జుకు కట్టి బండి మీదినుంచి దిగిండు- ఎండకు దున్నపోతులు 'గస్....గస్....' మంటూ ఒగరుస్తున్నాయి.

"రాజెల్లన్న బండి ఊళ్ళెకేనట పోతాంది- జెరలేర 'సమ్మ' వాడుకూడ అచ్చిండు బండాపి, ఇద్దరుగల్సి బండ్లేత్తురుగని" ఇంట్లోకి వచ్చి గడంచెల ఒరిగిన కొడుకును లేపింది రాయమల్లి.

"ఆకిట్లనే ఆగిందానే- అవ్వా- బండి?" మోసుకుపోవుడు తప్పినందుకు సంతోషంతో తొందరగ లేచిండు సమ్మడు.

"అఁ ఆకిట్లనే అగింది" అని దర్వాజబయటనే ఉన్న రాజెల్లన్ని ఉద్దేశించి "రా-రా-దు బిడ్డా లోపల్కి-- గిన్నే వున్నయ్ నాలుగు ముల్లెలు" అంది- రాజెల్లడు వంగి గుడిశెలకు వస్తూ....

"ఎక్కడున్నయే పెద్దవ్వా.... ముల్లెలు.." అన్నడు ఎండలోంచి చీకటింట్లోకి రావడం మూలంగా ఏమి కన్పించలేదు రాజెల్లనికి.

"కండ్లు కనిపిత్తలేవుర?" అంటూ పరాశికమాడిండు సమ్మడు.

"ఎట్ల కనిపిత్తయిరా....? కొత్తపసేల్దొరకె" చురిక అంటించినట్టు అన్నడు రాజెల్లడు.

"అఁ.... ఏం కొత్తపసేలు...." ఏ మొగనికి పొయినా పొయ్యి ఊదుడు తప్పనట్టు ఎవలకున్నా సేసుడు తప్పుద్దాబిడ్డా?" అన్నది రాయమల్లి ఇద్దరికి కలిపి మూట ఎత్తటంలో సాయం చేస్తూ.

"సూర్యాపాలు ఎక్కువిత్తనన్నడటకద! పెట్టువడి కింద నిజఁవేనా? పెద్దవ్వా." అని అడిగిండు మూట బండ్లోవేసి వస్తూ.

"అఁ.... బిడ్డా దొర్సానికి గందుకనే కోపం- సమ్మని వంతుకు పాలేరెవలు దొరుకలేదట!" అంది రాయమల్లి.

"ఎట్ల దొరకుతరే పెద్దవ్వా! నీబాంచెనైతె, దొర్సానంటె ధర్మతల్లాయె, కొడుకంటె ధర్మరాజాయె, దొరకదు మరి-" అన్నడు రాజెల్లడు.

"ఏడబోతె మనకేంది బిడ్డా" అంటూ తలుపేసి గొళ్ళెంపెడ్తూ "నేను దొర్సానింటికి వడ్లువెట్లవోతాన- కోడిపిల్లలు పదిలం, పొద్దున్నే బంగారఁవ్వనోంటి పిల్లను గద్దొన్నుకుపెయింది, దానింట్ల పీనుగెల్ల, సాది....సాది దాని బొందఁమీద పెట్టుడైతాంది", అంటూ యోరపాకల చెప్పులు ముడుసుకుంటున్న మొగనుద్దేశించి చెప్పింది రాయమల్లి- అరిగిన తోలుచెప్పులు వేసుకుని బండివెనుక బయల్దేరింది రాయమల్లి- సమ్మడు, రాజెల్లడు ఏవో-ముచ్చట్లాడుతూ.... బండిమీద వెల్తున్నారు- 'కట-కట-' కొమ్ములచప్పుడుతో బండి నెమ్మదిగా కదుల్తోంది- రాయమల్లి మాఁవిడిచెట్టు కింద ఆడుకునే పోరగాండ్లకేసి బయం, బయంగ చూసింది చిన్నకొడుకు సారడు వెంట బడ్తడేమోనని- వాడు చూడనే చూసిండు- "అవ్వ నేనత్త.... నేనత్త...." నంటూ మొలకు వున్న ఇత్తడిగజ్జెలు 'ఘల్.... ఘల్....' మంటుంటే.... రాయమల్లి దగ్గరికి పరుగెత్తుకొచ్చిండు.

"అద్దు బాంచెన్ ఎండ బాగకొడ్తంది- కాళ్ళకాల్తయ్ ముడ్డికి లాగుపేగన్న లేదు. 'సిడిఁవెల' రాను....?" అంటూ మురిపెంగా కొడుకు గదువ పట్టుకుని బుజ్జగించ చూసింది- వాడు కాళ్ళుచేతులు 'తప-తప' లాడిస్తూ భూపాల రాగం అందుకునేసరికి 'ఇగ లాభం లేద'నుకొని.

"బండాపురా.... సమ్మవ్వా- పీడత్తనని లొల్లివెడ్తాండు" అంది రాయమల్లి. అనుకుంటనే వాన్ని చంకనేసుకుని బండి దగ్గరికి పరుగెత్తుతూ.

"వాడెందుకే మల్ల?" అంగిలేదు లాగులేదు కసిరిండు సమ్మడు- మూతి ముడుసుకున్నడు 'సారడు' కారిన చీమిడిని 'సర్....స' ఎగబీల్చి వడ్లముల్లెల మీద బండి చాటువ తాళ్ళ పట్టుకొని కూర్చున్నడు.

"పడ్తవు బిడ్డో! గట్టిగపట్టుకో" అన్నది వెనుకనడుస్తూ రాయమల్లి.

బాకీగా తెచ్చుకున్న వడ్లు, వాటికి పెచ్చులు కలిపి ఎంత అవుద్దో మరోసారి లెక్కపెట్టుకుని 'పంటలు నిరుడు లేకనేపాయె పెచ్చుకడుతాదా నిరుటికి? ఏమో....? పాలేరు ఉండలేదన్న కోపం- 'నలుగురితోటి నారాయణా, ఆమె ఒక్కతే ఏరంటె కలుత్తదా?'- అనుకుంటూ వచ్చేసరికి ముల్లెలు దొరసాని ఇంటిముందు దించి బండ్లి వెళ్ళిపోతోంది.

"కచ్చీరు ఇంటిముందల, పందిరికింద వెట్టిన్నే అవ్వా ముల్లెలు- నేనువోతాన- రామిరెడ్డి దొర కోప్పడుతడు, పొద్దువోతె- దొరసానికి కన్పిస్తె పాలేరు ఉండలేదని ఏమేమి అంటదో అని వానిబయం వానిది."

సరెపో- బిడ్డా- పో- నేనే కొలిసి 'గరిశెల వోసిఅత్త' అని 'సారని' చేతిని ఒక చేత్తోపట్టుకుని పాటకులు దాటి ఇంటి పెద్దదర్వాజ ముందుకు వచ్చింది- బాగా అల్లుకుపోయిన సన్నజాజిపందిరి నీడ ఇంటిముందు చల్లగా ఉంది- పక్కన రేకుల షెడ్డు చూరుకింద షంకరో దొకడు కునికిపాట్లు పడ్తున్నాడు- మోకాళ్ళమీద తల ఆనించుకుని. రాయమల్లి హృదయం 'ఝుళ్ళు' మంది కుక్కగాని ఉన్నదో ఏమోనని, ఎక్కడా.... కుక్క లేదని నిశ్చయం చేసుకున్నాక, తలుపులు చేరవేసి ఉన్న పెద్ద దర్వాజ దగ్గరికి మెల్లగావెళ్ళి- అంతకంటె మెల్లగా లోపలికి తొంగిచూసింది- 'పెద్ద షెగేదారు' నర్సింహరామయ్య కింద చాపవేసుక్కూర్చుని ఏవో లెక్కలు రాస్తూఉన్నడు-

వీనింట్ల పీనుగెల్ల అన్ని దొంగ లెక్కలేచేసేది కసిగాఅనుకున్నది రాయమల్లి. ఇంటిదగ్గర కోడిపిల్లలు జ్ఞాపకం వచ్చినయ్.

అయ్యా- అని నర్సింహరామయ్యను ఉద్దేశించి పిలిచింది. ముక్కుమీదకి జారిన కళ్ళద్దాల్ని ఎడమచేతి చూపుడు వ్రేలితో పైకి ఎగదోసుకుని

ఎవరే....? అన్నాడు కొంచెం నుదురుచిట్లించి ప్రశ్నార్థకంగా.

ఆఁ....ఆఁ అట్ల నిలబడవే దొర్సానికి చెప్పివత్త- అనుకుంటు లేచి గోచి దులుపుకుంటూ ఇంట్లోకి వెళ్ళిండు నర్సింహరామయ్య- పెద్దర్వాజ దగ్గర్నించి కొంచెం వెనక్కిజరిగి ఓమారు వీధిలోకి తల తిప్పిచూసి పందిరి గుంజకానుకుని, దర్వాజ కభి ముఖంగా నిలబడింది రాయమల్లి- పల్లముల్లెల మీద సారడు కూర్చున్నడు. రాయమల్లి చూపు దర్వాజపైని ఆనింది.

లతలు చెక్కి ఇత్తడి పువ్వులు తాపడంచేసి అందంగా రంగులు వేసిన పాత కాలపు దర్వాజ అది.

'ఈ దర్వాజను అమ్మకుంటె మా అసోంటోళ్లకు ఓ ఇల్లైద్ది- అయినా ఏం ? కష్టపడి సంపాయించినారి ఏంది ? జెర్రికి సీమలు తలిగినట్టు 'కొట్టరారి.... కొట్టరారి' అంటే వందల మంది 'కైకిలి' లేక పనేశిండ్రు- గిప్పుడైతెనా ? ఎహే.... ఒక పురుగ్గూడ పోకపోదురు- పెయినా సంఘపోళ్ళు ఊకోకపోదురు- బరాబరి కైకిలి తీసుకోని యాళ్ళప్రకారం పనేత్తురు- అంత ఎమకటికాలం, ఎర్రికాలం, ఎడ్డికాలం,

గనుక సెప్పినట్టు సాగింది- 'గుర్రాన్ని వట్టుకుని గాడిద అంటె, గాడిదే అన్నరు, గుర్రింరా అంటె గడే బాంచెన్' అన్నరు- ఇప్పుడు కూడ మాలావుపోకడ పోవన్నని సూత్తరుగని గవన్ని గిప్పుడేం సాగుతయి- ఆ రోజులు ఎన్నడో పెయినయ్- అదేందో 'ముచ్చట సంబురాన దొంగతిండి మర్సినట్టు'- కోడిపిల్ల లుండెనో పాయెనో ? ఈ దొర్సాని ఎంతకు రాదేంది ? పగటినిద్ర పెయిందా ? ఏంది ? లేసి మొఖం కడుక్కోని మల్లేం తింటదో ? ఏం తాగుద్దో ? తినుడు తాగుడు మంది కొంపల్దీసుడు, ఇంకేంపని అని అనుకుంటున్న రాయమల్లి ధోరణి కిర్రు....మన్న తలుపు చప్పుడుతో ఆగింది- వంటమనిషి గురవయ్య బయటికివచ్చి "వస్తోంది" అన్నట్టు ఓమారు రాయమల్లికేసి తల తిప్పి పక్క కచ్చేరింట్లో ఉన్న పట్టెమంచం వాల్చి లోపలికెల్లాడు.

"ఏం తేదావెడ్తదో ? ఎన్నివెట్టన్నంటదో ?" అని రాయమల్లి అనుకునేలోగానే చేతికర్ర 'టక టక' లాడిస్తూ.... పీతనడక నడుస్తూ.... ద్వేషపూరిత చూపుల్తో రాయ మల్లిని చూస్తూ కచ్చేర్లోకి వెళ్ళి మంచంలో కూర్చుంది దొర్సాని- దొర్సాన్ని చూడ గానే గుంజకు వరిగినిలబడ్డ రాయమల్లి, సుంకరి వాడిలాగే చక్కగా నిలబడ్డది, కాస్త భయంగ,

"లెక్కల్జూసుకొనేరోజు మొన్ననేనని ఎరికేలేనమ్మా ?" అంది దొర్సాని వ్యంగ్యంగ

"ఎరికే బాంచన్.... మొన్న పండుగనిరాలేదు," నసిగింది రాయమల్లి.

"నిన్నేంవైంది ?"

"నిన్నగీపోరడు ఈతకు బోయిన పోరగాండ్ల తోటి ఈతకుబోయి బాయిల వడ్డడు బాంచన్. ఇగ ఆ గంద్రిగోళంలవడి రాలేదు" కొడుకు తల నిముర్తూ సంజా యిషీ ఇస్తున్నట్లు అంది రాయమల్లి.

"ఊం.... మొన్నపండుగ, నిన్న పోరడు బాయిలవడ్డడు, బాగనే ఉన్నది- ఇయ్యాల ఎండబాగున్నదని ఇంట్లనే ఉండకపెయినవా ? అం....ఇచ్చినోడు సావాలె.... కాయిదాలు కాలాలె.... అవునే ! అంది దొర్సాని చేతికర్ర రెండు చేతుల్తో ఊపుకుంట.

"గట్లెందు కనుకుంటం బాంచెన్ ఇయ్యాలగాపోతె రేపు గంతేకని, నెల్లు గడుత్తయా....? ఏండ్లు గడుత్తయా ?...." అంది రాయమల్లి.

అంతట్లోకే లెక్కకాగితం పట్టుకుని నర్సింహరామయ్య- కుంచం అంచెలు పట్టుకుని గురవయ్య వచ్చారు- చెద్దర్లలోపటి వడ్లముల్లెలువిప్పి, వడ్లు కుప్పగాపోసింది

రాయమల్లి- కచ్చేరింట్ల మంచంలోకూర్చున్న దొర్సాని కింద వాకిట్ల కుప్పగాపోసిన వడ్లను చూస్తూ....

"ఏందే రాయమల్లి.... కళ్ళాలపొంట ఊడ్సుకచ్చినయ్, ఆడీడ అడుక్కచ్చు కున్నయి, కైకిల్లు, అన్నికలిపి కులానికోఇత్తు కలిపి పట్టుకరాకపెయినవ్ !" అంది.

గవ్వి మాకెక్కడియి బాంచెన్, దొయ్యల పండినయోగవ్వి ఆడికాడికి తఁవరి మందమైనయి- కల్లి లేక. కసాబు లేక రాజనాల్లెక్క ఉన్నయ్ వడ్లు" అంటూ కుడి చేత్తో కొన్నివడ్లు పట్టుకుని సుంకరికి చూపిస్తూ "లెవ్వే బాలన్నా....?" అని అంది- 'అవునో, కాదో ఏదీ అర్థం కాకుండ వాడు తలకాయ ఊపేసిండు కుంచం పట్టుకుని దొర్సాని వంక చూసిండు గురవయ్య- కొలవమన్నట్లు కళ్ళతోనే అనుమతించింది దొర్సాని. సుంకరి అంచెతో వడ్లు కుంచంల పోస్తుంటె గురవయ్య ఆ వడ్లని అదిమి అదిమి కొలుస్తూ అంచెలో పోస్తున్నాడు- రాయమల్లిని కుంచాన్ని పరీక్షగా చూస్తూ.... "ఈ కుంచంతో నాకియ్యలేదు దొర్సానీ, ఇయ్యంగ-" అంటూ దొర్సానివంక పిర్యాదిగా చూసింది.

"కండ్లు తిర్గినాయె ? అఁ.... ఇచ్చెటప్పుడో కుంచం, తీసుకునేటప్పుడో కుంచం పెట్ట ఇదేఁవన్న కోఁవటొల్లను కున్నవా ? లేక నువ్వుపెట్టే వెయ్యినూరుపుట్ల వడ్లబాకీకి పెద్దకుంచం బెట్టిన్ననుకున్నవా ? ఏంది ?" ఉరిమింది దొర్సాని ముఖం ముడుసుకుంది రాయమల్లి- అంబెలునిండినయ్ అంచె రాయమల్లి కెత్తిండు సుంకరి.

"పీల్లింట్ల మన్నువడ- పిల్లపీనుగులెల్ల గిట్లజేసి గిట్లజేసే సంపాయించిన్రు" అనుకుంటూ గరిశెలో పోసివచ్చింది- కొలత కొలిచిన గురవయ్య లేస్తూ....

"ఇరుస తక్కువ రెండుగిద్దెలు దొర్సానీ" అని కిందింది వడ్లిత్తులు నాలుగుతీసి కుంచంలవేస్తూ అన్నాడు గురవయ్య.

"నర్సింహరాఁవయ్యా లెక్కెంతున్నదో సూడు...."

సూసిన్నమ్మా మొత్తం నాలుగు గిద్దెలు, ఇంక రెండుగిద్దెల రెండు కుంచాలు రావాలె" అన్నడు కాగితం చూస్తూ.

ఇంటికాడ కొల్సుకొచ్చిన కాదు బాంచెన్- ఇటిత్తు అటువడకుంట రెండు గిద్దెలు అయినయ్ ఈడ ఇరుస తక్కువంటె ఎట్ల దొర్సానీ ?" అంది రాయమల్లి.

పెద్ద కుంచం బెట్టిచ్చిన్నా, లేక లెక్కతప్పువెట్టిచ్చినా.... అఁ.... నువ్వీన్నే వున్నవ్‌గదనే ముండా.... అంది దొర్సాని ముఖం చిట్లించి.

ఆఁ.... కొలిసినంక పోరగాండ్లు కోఁవటింటికో, మొగడు గౌండ్లింటికో పోసుక పొయ్యి ఉంటరు అందుకే తక్కువచ్చినయ్ కీటుకు కనిపెట్టినట్టు తేల్చిపారేశాడు నర్సింహరామయ్య.

ఎల్లైతే మూంకేదిగని కడమ మూడుగిద్దెలిరుసపెట్టి ఈఁన్నుంచి కదులు- దొర్సాని. రాయమల్లికేం అర్థంకాలేదు- భయం మాత్రంవేసింది- ఇంక మూడుగిద్దెలిరుసా.... గవన్నెక్కడియి దొర్సానీ అంది రాయమల్లి.

ముందటేడు గిద్దెడు వడ్లు కొంచబోయినవు- గిద్దెకు గిద్దెడు పెచ్చు కడితె లెండు గిద్దెలు, ఈఁ ఏటికి ఆరెండు గిద్దెలకి మరో రెండుగిద్దెల పెచ్చు కడితె నాలుగుగిద్దెలు.... సరెనా.... అంటూ నాలుగువేళ్ళు చూపిస్తూఅన్నాడు నర్సింహరామయ్య, పళ్ళుబిగించి అవునన్నట్టు తల ఊపి దొర్సాని అంది.

కొడుకు పెండ్లంటె గిద్దెడు ఇచ్చిన అవి ఇండ్లక్ణుపుకుంటెనే.... మొత్తం మూడుగిద్దెల ఇరుస అంటూ తల నిలువుగా ఊఁపింది తలమీది గుమ్మడికాయంతసిగ గమ్మత్తుగ ఊఁగుతుంటె చూసిన సోరడు, రాయమల్లి తలకేసి చూస్తె చింపిరితల్లో ఎక్కడో వెల్లుల్లిపాయంత సిగ కన్పించింది వాడికి- మార్చి మార్చి చూడ సాగాడు.

పెండ్లంటె గిద్దెడు వట్టిగనే ఇత్తిరి పల్ల వెట్టుమంటె ఎట్ల బాంచెన్ అంది రాయమల్లి.

కంచంల పోసినయ్ తప్పుతయ్గని, కుంచంలపోసిన తప్పుతాయె అన్నాదు నర్సింహరామయ్య- 'సరే'నన్నట్టు తలవూపింది దొర్సాని.

పెచ్చుకు కొంచవోయిన యాడాది పంటలు లేనేలెవ్వాయె పెచ్చెట్లకడుతరు దొర్సానీ.... రామిరెడ్డి దొర వారి పాతపాలేర్లకు కట్టలేదట అంది రాయమల్లి.

హయ్యో....రాత ఇయ్యాల రామిరెడ్డి దొర మంచి మొగడయ్యిండే- జీతాలుఎక్కువిత్తడు పెట్టువడీ ఎక్కువిత్తడు ఆఖరికి గు....మీద ఎక్కువే తంతడు- అన్నిట్ల మాకంటె ఎక్కువేనే అందుకే కొడుకును కొంచవోయి ఆయన కుంచినవా? గడ్డబోటువెడితె కుక్కన్న తోకాడిత్తదిగని, గంతకంటె కూడ నమ్మకం లేనోల్లు అయిండ్రే- పాతసీరలిచ్చింది పెయింది- పచ్చళ్ళు పెట్టింది పెయింది- పూటకు లెవ్వంటె తవ్వెడు మానెడు ఇచ్చింది పెయింది గంగలకల్సి- ఇయ్యాల రామిరెడ్డి దొర మంచి మొగడయిండంటే కాదుమరి? దొర్సాని సాధింపు.

బాయిల పనికి-పోతనని, వాడేపొయ్యి అయిదువందలు అడుక్కచ్చుకోని గోదా

వరిఖన్లె వాళ్ళ సిన్నయ్యకీచ్చి అచ్చిండట బాయిల పనికోసం ఎవలకైన అంచమియ్య మని- తనదేం తప్పులేనట్టు అంది. రాయమల్లి.

బాయిల పని.... బాయిల పని ఎవలకెరుకలేందే? అడ మాతమ్ముడు ఓర్మెస్గె పన్జేయ్యనేవట్టె- మడుగుల దున్నపోతుకంటె అధ్వాన్నంగ మసిలదొర్లిచ్చి నెలకు అయిదారువందలు మాఇత్తాండు- అంది దొర్సాని.

ఏమో! నాగ్గవన్ని తెలువయ్ బాంచెన్.... నేనెంత అర్దన్న నామాట ఇనలేదు. నా సేతులున్నడా! వానిట్టం వానిది.

సంసారివైతివి గివన్ని సీకెందుకెరుక వాన్ని మాకుండ కుంట చేసింది నువ్వె కాదెలంజె- అంది దొర్సాని- రాయమల్లికి కోపంవచ్చింది.

అచ్చినప్పట్నుంచి సూత్తాన.... బాంచెనైదు- లంజె, లొక, ముండ. గిండ అని తిడ్తానవు సెవులు పిండి నియ్యనువ్వ పసూళ్జేసుకోగని తిట్టకు- అంది రాయమల్లి.

"నర్సింహరామయ్యా ఇనూ.... ఆ దొంగ లంజె బలుపు మాటలు" అంది దొర్సాని- ఏంటున్నానన్నట్టు తలూపాడు- నర్సింహరామయ్య.

"పనీ పాట లేకుంట రోజుకు మూడుసార్ల తిండాయె బాంచెన్ అదీ మందిని ముంచేనాయె ఇగ బలుపురాకేం జేత్త." అంది రాయమల్లి-

దొర్సాని ముఖం నల్లబడింది అప్పుడే పగటి నిద్రలేచి బయటకువస్తున్న దొర్సానికొడుకు జగదీశ్వర్రావుకు, చెట్టంత తన తల్లిని పట్టుకొని ఓమాదిగ ముండ అంతేసి మాటలనడం విన్పించేసరికి 'సర్రున' కోపం వచ్చింది- వచ్చిందే తడవు రాయమల్లి వీపీమీద ఎడాపెడా దెబ్బలు వేశాడు- దొర్సాని కొద్దిగా ఆశ్చర్యపడినా 'మంచిపనే' అని చప్పుడు చెయ్యకుండా ఊరుకుంది- దెబ్బలుతిన్న రాయమల్లి శరీరం మంటచేసింది హృదయం కుత కుత ఉడికింది కోపం ఆపలేకపోయింది- భయం గియం రాయమల్లిని చూసి బయపడి పారిపోయింది.

"నీయింట్ల పీనుగెల్లగదరో.... నీచేతులు పడిపోనుగదరో అన్యాలంగ నన్ను కొడితివి గదరా గాడిదికొడుకా" అంటూ తిట్టుకుంటు ఏడుస్తోంది- తల్లికాలు పట్టుకొని సారడు ఏడుస్తున్నాడు- జగదీశ్వర్రావుకి, ఆ తిట్లకి మరింత కోపం వచ్చింది- నానా బూతులు తిడ్తూ మళ్ళీ చెయ్యెత్తాడు- నర్సింహరామయ్య అడ్డుపడబోతె ఆ దెబ్బ ఉన్న పళంగ నర్సింహరామయ్య దవడకు అంటింది- అసలే బోసి నోరు- దవడపట్టుకొని పక్కకు జరిగాడు- రాయమల్లి తిడ్తూఏడుస్తూ.... ఏడుస్తున్న కొడుకును ఏడ్వకురా ఏడ్వకు....అంటూ ఓచేత్తో వాన్ని పట్టుకుని 'బర బర' లాక్కెల్తూ 'పాటకు'లుదాటింది.

పోనియ్యకురా.... లంజెన్- పట్టుకోరా సుంకరోడా- గుంజకు కట్టెయ్- 'బాంచత్' ఎవడన్డం అత్తడో సూత్త.... అక్షరాల్ని వత్తిపలుకుతూ కోపంగాఅన్నడు జగదీశ్వర్రావు- సుంకరోడు అలాగే నిలబడకుండ నాలుగడుగులు వేశాడు- పాటకులు దాటి వెల్తున్న రాయమల్లి ఆగి,

"కట్టెయించుతవురా గాడిదకొడకా....కట్టేయించుతవ్- ఏపాటి కట్టేయించుతవో. అత్తరు- కట్టేయించురా గప్పుడు నీమొగతనం తెలుత్తది. ఆడిముండను నన్ను ముట్టుకున్న వుగని ముట్టుకున్నందుకు, ముట్టుకోని తన్నినందుకు సువ్వ వడ్లకు పెచ్చులుగట్టి నట్టుకట్టి తన్నిత్తరా కుక్కలకొడ్కా, అఁ....ఏఁవనుకున్నవో- ఇంకా ఏమేమో....తిడ్తూ వెల్తోంది పెద్ద పెద్ద అంగలేస్తూ, వెనుక సారడు గజ్జెల గప్పు మంటుంటె 'తిరిగి చూస్తూ చూస్తూ.

ఎవరో రాయమల్లికి ఎదురై "ఏమిటం'ని ప్రశ్నించారు. ఏడుస్తూ ఆపెద్దమనిషికి చెప్తోంది మధ్యమధ్యతిడ్తూ. దొర్సాని జగదీశ్వరరావు, గురవయ్య, నర్సింహరామయ్య, సుంకరోడు అందరూ రాయమల్లి కేసే చూస్తున్నారు. గాలివాటానికి రాయమల్లి అట్టెతిట్లన్ని వింటూనే ఉన్నారు. వినవలసిన వారి ముఖాలు కంద గడ్డల్లా అవుతూనే ఉన్నయ్. క్షణం ముందు జరిగిన గలటా విని జగదీశ్వర్రావు భార్య ఏదో అల్లిక పని చేసుకుంటూ బయటకు వచ్చి జరిగింది తెలుసుకుని వెంటనే కోపంతో. "రామిరెడ్డి మొన్న పాలేర్ని ఏదోమాట అన్నందుకే సిల్లర జనమంత ఏకమై పని పాటలు నెల రోజుల్దాక బందు వెట్టిచ్చిండ్రు. కొట్టెటోళ్ళకు బుద్ధి లేకున్న చూసెటోళ్ళ కన్న వుండద్దా?" అంటూ ([illegible]గారి వంక చూసింది ఈసడింపుగా, ఇంకా ఆ పెద్ద మనిషితో చేతులు తిప్పుతూ ఏదోఏదో చెప్తోంది రాయమల్లి. దొరసాని ఇంటికి ఎదురుగా తల్లి పక్క నిలబడ్డ సారడు, విల్లులా వెనక్కి వంగి, వంకరగా చిమ్మే ఫౌంటెన్ లాగ మూత్రం పొయ్యడం దొరసానితోపాటు అందరూ చూస్తున్నారు. 'రంకుల గాడ్దికొడుకు కసిగా అనుకుంది దొర్సాని. సారడు మూత్రం పోసి కసిగా కోపంగ ఓమారు చూసి వెల్తున్న తల్లి వెనుక పరుగెత్త సాగిండు ...

కథలు శీర్షిక కింద ఈ సంచికలో వేయదల్చుకొన్న

అల్లం రాజయ్య

కథ

మార్పు

వచ్చే సంచికలో వస్తుంది.

పుస్తక సమీక్ష :

' ఏడుతరాలు '

అలెక్స్ హేలీ అమెరికా వాస్తవ్యుడు, నల్లజాతికి చెందినవాడు ఆఫ్రికానుండి బానిసలగా అమెరికా వచ్చిన తన పూర్వీకుల కథను పరిశోధించి, "విజేతలే చరిత్ర విరచించే ఆనవాయితీని బద్దలుకొట్టడానికి" అతను రాసిన పుస్తకం ఇది. ఈ కథ, యాదృచ్ఛికంగా తెల్లవాళ్ల చేజిక్కి బానిసగా మారిన గాంబియా వాస్తవ్యుడు కుంటా కించేతో మొదలయి, హేలీ వరకు నడుస్తుంది.

అన్యాయానికి పీడనకు గురయినవాళ్ల దృక్పథంలో అనివార్యంగా హేతువాదం, వాస్తవవాదం, భౌతికవాదం, ఎంతోకొంత చోటు చేసుకుంటాయి. భావవాదం, అధ్యాత్మికం, పీడకులకు, ఇటూ చెందక అటూ చెందక తప్పించుకు తిరిగే మధ్యరకపు ధన్యులకూ మాత్రమే సహజం. ఈ కారణం చేత నల్లవాడయిన హేలీ తన జాతికి జరిగిన అన్యాయాన్ని శ్వేతజాతి మానసిక రుగ్మతగానో, అస్తిత్వవాదం ఫక్కీలో మానవాళికి సాధారణమయిన సందిగ్ధతగానో ('human predicament') కాకుండ చారిత్రికంగా చూస్తాడు. అయితే మౌలికమయిన శ్రమదోపిడీ జాతిపీడనగా రూపాంతరం చెందినప్పుడు సహజంగా ఉత్పన్నమయ్యే తప్పుడు చైతన్యం ప్రభావం వదిలించుకోనంత వరకు ఈ వాస్తవవాద దృక్పథం శాస్త్రీయత సంతరించుకోదు. హేలీతో అదేచిక్కు. ఆఫ్రికన్ల గురించి తెల్లవాళ్లు చేసిన దుష్ప్రచారాన్ని వ్యతిరేకించే తపనతో తన ఆఫ్రికా పూర్వీకుల సమాజాన్ని, సాంకేతికంగా ఎంత వెనుకబడ్డదయినా, సామాజిక మానవ సంబంధాల వరకు చాల వున్నత మయినదని చూపించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది చెప్పుకోవలసిన విషయమేగాని, మనకు మధ్యయుగపు ఆఫ్రికా సమాజం గురించి తెలిసిన విషయాల దృష్ట్యాచూస్తే పూర్తిగా అతిశయోక్తి గూడకాదు. ఆఫ్రికాలో భూస్వామ్య విధానం అంతగా విస్తరించలేదు. దోపిడీవర్గం పల్లెప్రాంతాల భూస్వామ్యవర్గంగాకుండ, రాజాస్థానాన్ని ఆశ్రయించి శిస్తుల ద్వారా అదనపు వుత్పత్తిని చేజిక్కించుకొనే వర్గంగావుండేది. పనిముట్లలో స్వంతఆస్తివున్నా, భూమిమాత్రం అధికంగా గ్రామసభల అధీనంలో వుండేది. ఆ సభలు రైతులకు 'పట్టా' లిచ్చేవి. గ్రామీణ ప్రాంతాలలో ఈ సభాధికారులు, మతాధికారులు, తెగ పెద్దలు, ఇతర పెత్తందార్లు పాలకవర్గ ప్రతినిధులుగా వుండేవారు. (ఇలాగంటే భూస్వామ్యం, బానిస అర్థబానిస సంబంధాలు, పెత్తందార్లకు వెట్టిచాకిరి చేసేపద్ధతి, లేనేలేవనికాదు. ఇక్కడ ప్రధానమయిన దోపిడీ సంబంధాల గురించి చెప్పుకుంటున్నాం)

అమీన్ 'శిస్తుదారీ ఉత్పత్తి విధానం' (tribute - paying mode of production) అంటాడు.

ఇటువంటి సమాజంలో హేలీ చెప్పేటంతటి సామూహికత, సమానత లేక పోవచ్చుగానీ, శ్రమజీవికి యూరప్ భూస్వామ్య సమాజంలోని ప్రత్యక్ష అర్థబానిస సంబంధాలలోను, మనదేశ వర్ణవ్యవస్థలోని పరోక్ష అర్థబానిసత్వంలోను, లేనటువంటి స్వతంత్రత, గౌరవం, లభిస్తాయి. అటువంటి సామాజిక సంబంధాలమధ్య పెరిగినవాడు కుంటాకింటే. దానికి తగ్గట్టే అతడు స్వతంత్రుడు, అభిమాని, దాస్యాన్ని అసహ్యించుకునేవాడు.

నల్లబానిసలకథ అర్థంచేసుకోవాలంటే ఆ బానిస విధానానికి ప్రోద్బలం యేమిటో చూడాలి. యూరప్‌నుండి వలసవచ్చి విశాలమయిన అమెరికాఖండపు మైదానాలనుండి అక్కడి వాస్తవ్యులయిన 'ఎర్రఇండియన్ల'ను హతమార్చి, తరిమివేసిన తరువాత తెల్లవాళ్లకు తామాక్రమించుకున్న భూములను సాగుచేయడానికి, ముఖ్యంగా అధిక శ్రమశక్తి కావలసిన ప్రత్తిపంట పండించడానికి, అదనంగా శ్రామికుల అవసరం వచ్చింది. ఆ అవసరం ఆఫ్రికన్ల దిగుమతి తీర్చింది. దిగుమతిఅయిన ఆఫ్రికన్లు స్వతంత్ర శ్రామికులుగాగాక బానిసలుగారావడం చవుకగా ప్రత్తిపండించడానికి, వస్త్ర ఉత్పత్తి సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరువాత బ్రిటన్‌కుచేసే ప్రత్తిఎగుమతి మీద గుత్తాధిపత్యం సంపాదించడానికి, తోడ్పడింది.

ఈ చారిత్రిక శక్తులు కుంటాకింటేను బానిసగామార్చి గాంబియానుండి అమెరికా తీసుకపోతాయి. అమానుషమయిన ఈ సరఫరాకు వ్యతిరేకంగా ఓడలోనే కుంటా, అతని తోటిబానిసలు, తిరగబడడానికి ప్రయత్నంచేస్తారు. కాని సంకెళ్లను, తెల్లవాళ్ల తుపాకీలను ఓడించలేకపోతారు.

అమెరికాచేరిన కుంటాకు చాల ఆశ్చర్యకరమయిన విషయం కనబడుతుంది. అక్కడ తనవంటి నల్లవాళ్లను చాలమందిని చూస్తాడు. అయితే వాళ్లు తప్పించుకు పోవడానికి ప్రయత్నంచేయడం, తనవంటివారికి ఆ ప్రయత్నంలో సాయంచేయడం అటుంచి, తమ యజమాన్లకు గులాంలుగా వ్యవహరిస్తూ, కుంటావంటి ఆఫ్రికన్లను తెల్లవాళ్లలాగే హేళనచేస్తూవుంటారు. దాస్యం కేవలం భౌతికహింసమీదే నడవదని, అంతకంటె బలవంతమయిన భావజాలాన్ని ఉత్పత్తి చేసుకుంటుందని కుంటా గ్రహించడానికి చాలాకాలం పడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే నల్లవాళ్లు తక్కువరకం మనుషులని, బానిసత్వం వారికి ప్రకృతిసహజం అని, చెబుతుంది ఈ భావజాలం.

అయితే ఇదంతా శ్వేతజాతి శ్వేతత్వంనుండి పుట్టిన అహంకారంగా అనుకోకూడదు. నలుపు తెలుపులమధ్య ఘర్షణగా చూడకూడదు. విజాతీయులను శ్రమదోపిడీకి గురిచేయాలంటే మొదట వారిని సాంస్కృతికంగా అణచాలి. వారి ఆచారాలు అనాగరికమయినవని, వారిమతం 'సాతాను' (SATAN) మతమని వారిభాష భాషకాదని వారిచేతనే ఒప్పించాలి. అలాచేస్తేనే దోపిడీ సంబంధాలకు వాళ్లులొంగుతారు. అందుకే నల్లవాళ్ల తమ ఆచారాలు పాటించడం, తమ భాష మాట్లాడుకోవడం, పాటలు పాడుకోవడం, ఇదంతా నిషిద్ధం. ఈ "ఆఫ్రికాచెత్త" వదిలిపెట్టమని కుంటాకు యిద్దరు నల్లవాళ్ళే చెబుతారు, తెల్లవాళ్లుకాదు. కుంటా ముస్లిం మతస్థుడు కాని అమెరికాలోని నల్లబానిసలంతా క్రిస్టియన్లు. రోమన్ సామ్రాజ్యంలో బానిసలకు ఇహలోకవిముక్తికి మారుగా పరలోకములో ముక్తిని సాధించడానికి ఒక ఉపశమనంగా ముందుకొచ్చిన క్రిస్టియన్‌మతం ఈ బానిస సంబంధాలను పదిలం చేయడానికి చక్కగా సరిపోయింది. ఈ కథలోనే ఒక నల్లబానిస "మనం ఎన్నిప్రార్థనలుచేసినా ఈ తెల్లవాళ్ళ గుండెలు కరుగుతయా ?" అనడిగితే మతంపిచ్చిన మరొకబానిస "బైబిల్లో ఏంరాసుందో తెలుసా? జోసఫ్ ఈజిప్టువాళ్ళకి బానిసగా అమ్ముడయ్యాడు. కాని భగవంతుడు జోసఫ్‌యందు మాత్రమే ఉన్నాడు" అని సమాధానం యిస్తుంది.

అయితే కుంటామాత్రం లొంగడు. మొదటితరంవాడు కావడంచేత తన "ఆఫ్రికాచెత్త" వదిలిపెట్టడు. తన చుట్టూవున్న నల్లవాళ్ళను నిరసిస్తాడు. వాళ్లు క్రిస్మస్‌రోజున యజమానికి కానుకలర్పిస్తున్న దృశ్యంచూసి సహించలేక "ఛీ-చచ్చిపోతే బావుణ్ణు" అనుకుంటాడు. రెండుమూడుసార్లు తప్పించుకోవడానికి ప్రయత్నించి చివరి ప్రయత్నంలో ఒకపాదం సగానికి నరకబడ్డ తరువాతే ఆ ప్రయత్నం విరమించుకుంటాడు. చేలలో పనిచేస్తున్నవాడికి యజమాని బగ్గీతోలే డ్రైవర్‌గా ప్రమోషన్ వచ్చినప్పుడు బానిసవాడలోని మిగిలిన బానిసలంతా అభినందిస్తారు గాని తానుమాత్రం అదొక గొప్ప విషయం అనుకోడు. "తెల్లవాడికోసం తెల్లవాడు చేయమన్న చాకిరీ చెయ్యడంలో అతనికి ఏఘనతా అవుపించలేదు" తనకుమార్తెకు ఆఫ్రికాపేరే పెడతాడు. ఆఫ్రికాలోని ఒకప్పటి మాలీ సామ్రాజ్యకాలంలోని తన పూర్వీకుల గురించి తన కుమార్తెకు చెబుతాడు. బానిసవాడల్లో పుట్టిపెరిగిన తనభార్య భయపడ్డా వినకుండ తన కుమార్తెకు తన మాతృభాష అయిన మాండింకాభాష కొంచెం నేర్పిస్తాడు. ఆ అమ్మాయి చిన్నయజమానురాలికి ప్రియమయిన చెలికత్తెగా మారిందని తనభార్యలాగా సంతోషించడు. తనకూతురు "యజమానురాలి ఒళ్లోకూర్చోబెట్టుకుని ఆడుకునే కుక్కపిల్ల" మాత్రమేనని అసహ్యించు కుంటాడు.

నిజంగా కుంటాది చాల ఆకర్షణీయమయిన వ్యక్తిత్వం. అయితే అందులో ఆకర్షణ వుందేగాని అది చారిత్రికంగా నిరర్థకం. వర్తమానంలో వేళ్లూనని స్వేచ్ఛా కాంక్ష, వర్తమానాన్ని అసహ్యించుకునే స్వేచ్ఛాకాంక్ష, అందులో నిక్షిప్తమయిన భవిష్యత్తును గుర్తించదు కాబట్టి అది సాధించేది ఏమీవుండదు. గతం తాలూకు స్మృతు లలో పుట్టి గతంమీద చూపులు నిలిపిన స్వేచ్ఛాపిపాస ఆ గతాన్ని మరచిపోయి వర్త మానంలో జీవిస్తూ, వర్తమానంలోని వైరుధ్యాలకు స్పందించి, భవిష్యత్తు మీద దృష్టి నిలిపినప్పుడే చారిత్రికంగా అర్థవంతమవుతుంది. అయితే ఈ మార్పు గతితార్కి-కంగానే రావాలి. బానిసలయిన ఆఫ్రికన్లు గతం తాలూకు ఆలోచనకు స్వస్తిచెప్పాలంటే ఆ జ్ఞాపకాలలోనే పుట్టిన స్వేచ్ఛాకాంక్షను గూడ వదిలిపెట్టి పూర్తిగా బానిస వ్యవస్థలో భాగం కావాలి. స్వతంత్రత ఈ విధంగా తద్విరుద్ధమయిన బానిసత్వంగా మారి ఆ బానిస సంబంధాలలోని వైరుధ్యాల్ని పురస్కరించుకొని మళ్లీస్వతంత్రతగా-అయితే ఈసారి సైస్థాయిలో- రూపొందాలి.

కాని ఈ మార్పు కుంటాలో రావడం అసాధ్యం. తరువాతి తరాలలోనే అది సాధ్యమవుతుంది. అందుకనే ఈ మార్పు మొదటి మెట్టుదగ్గరే ఈ కథకు కుంటా అవసరం తీరిపోతుంది. తన కుమార్తె కిజ్జీ ఒక బానిసకు పారిపోవడానికి సాయం చేసిందన్న నెపంతో చాల "మంచి" వాడయిన తమ యజమాని దోపిడీ సంబంధాల మధ్య "మంచి" తనానికి పరిమితులేమిటో స్పష్టంగా చూపిస్తూ అమ్మివేసిన రోజున కుంటా తాను మిగుల్చుకున్న ఆఖరి ఆఫ్రికా ఆచారానికి స్వస్తిచెబుతాడు. దానితో రంగం నుండి కుంటా తప్పుకుంటాడు.

కిజ్జీలోనే గతంనుండి వర్తమానానికి జరిగిన మార్పు మనకు కొంతవరకు కనిపిస్తుంది. కిజ్జీపేరు ఆఫ్రికా పేరు. మతం క్రిస్టియన్ మతం. తండ్రి తన పూర్వీకుల గురించి చెప్పిన కథలు వింటుంది, గుర్తుంచుకుంటుంది, తరువాతి తరాలకు చెబుతుంది. కాని చిన్న యజమానురాలు తన్ను చెలికత్తెగా స్వీకరిస్తే తండ్రిలాగ కాకుండ తాను సంతోషిస్తుంది. ఆమె తనను కష్టాలలో ఆదుకుంటుందని గూడ నమ్ముతుంది. తన కుమారుడు జార్జి తన కొడలికి తమ పూర్వీకుల కథలు చెప్పలేదని బాధపడుతుంది. మనవళ్లకి మాండింకా భాషలో కొన్ని పదాలయినా నేర్పాలని ఆశిస్తుంది, కాని లేక లేక తనకు మనవరాలు పుట్టిన రోజున కృతజ్ఞతలు జీసస్‌కే చెప్పుకుంటుంది-అల్లాకుకాదు.

స్వతంత్రత నుండి బానిసత్వానికి పరిపూర్ణమయిన పరిణామం మూడవ తరం వాడయిన జార్జిలో కనిపిస్తుంది. అది అతని పుట్టుకలోనేవుంది. బానిసల శ్రమశక్తే

కాకుండ, స్త్రీ బానిసల శరీరం గూడ యజమాన్ల అస్తి అయిన వ్యవస్థకు చిహ్నంగా కిజ్జీ యజమానికి కిజ్జీకి పుట్టిన 'సంకరజాతి' వాడు జార్జి. చిన్నతనం నుండి జార్జికి యజమానిని మెప్పించాలనే తపనజాస్తి, అయిదేళ్ల వయస్సులో యజమాని సమక్షంలో మిగిలిన బానిసలకు బానిస తత్వోపదేశం చేసి యజమాని మన్ననలు అందుకుంటాడు. యజమాని దయజూస్తే తన తాతయ్యలాగ ఛీదరించుకోకుండ వుప్పొంగిపోతాడు. కోళ్ళపందేలంటే యజమానికున్న పిచ్చిని పురస్కరించుకొని, కోళ్ల తర్ఫీదులో నైపుణ్యం సంపాదించి యజమానికి చేరువవుతాడు.

అయితే బానిసత్వానికి పరిణామంచెందడం అంటే పూర్తిగా బానిసభావాలు కలిగిఉండడం అనికాదు- అలా అనుకోవడం యాంత్రికంగా ఆలోచించడంఅవుతుంది- గతితార్కికంగా చూస్తే ప్రతివిషయంలోను దాన్ని నిరోధించి అధిగమించే అంశం దానిగర్భంలోనే వుంటుంది. బానిసత్వంలోనే బానిసత్వంపట్ల నిరసన, యజమాని అంటే ద్వేషం, స్వేచ్ఛాకాంక్ష వుంటాయి- అయితే ఆ బానిస సంబంధాల వాస్తవ స్వరూపం నుండి పుట్టినవే గాని మాలీ సామ్రాజ్యంలోని తన పూర్వీకుల ఘనతతాలూకు జ్ఞాపకాలనుండికాదు- జార్జిలోనూ ఈ నిరసన, ద్వేషం,ఆకాంక్ష వున్నాయి,

అయితే ఇక్కడే జార్జికీ అతని తాతఅయిన కుంటాకు చాలతేడావుంది- ఇక్కడే హేలీ తనబూర్జువా దృక్పథాన్ని, సంస్కరణ వాదతత్వాన్ని స్పష్టంగా చూపిస్తాడు. జార్జికి వర్గదృక్పథం లేకపోవడం అర్థంచేసుకోవచ్చు- కాని అతనికి కనీసం జాతి దృక్పథంకూడలేదు. తనయజమానిని మెప్పించి కోళ్ళపందేంలలో నాలుగు రాళ్లు కూడ బెట్టి తన స్వాతంత్ర్యం తన భార్యాబిడ్డల స్వాతంత్ర్యం కొనుక్కుందామన్న ధ్యాసే తప్ప 'కోళ్ళజార్జి'కి వేరే ఆలోచనలేదు. ఇంతకంటె మెరుగైన చైతన్యం అతనికి అలవడ్డానికి అవకాశం లేదనలేం, నిజానికి అమెరికా బానిస సమాజం చరిత్ర మొదటి నుండి గూడ బానిసల తిరుగుబాట్లు జరుగుతూనే వచ్చాయి. అందులో ఒక తిరుగు బాటుకు నాయకుడయిన ఫ్రెడరిక్ డగ్లస్‌ను గురించిన వార్త జార్జి కొడుకు టామ్ స్వయంగా బానిసవాడకు తెస్తాడు. అయితే తెల్లవాళ్ళతో "మీ ప్రార్థనలు, మీ బైబిల్ ప్రవచనాలు, మీ కృతజ్ఞతార్పణం, మీ మతవిన్యాసాలు- అంతా మోసం, దగా, నటన, కుళ్లు" అని చెప్పిన డగ్లస్ ప్రభావం జార్జిమీదగాని, నాలుగవ తరంవాడయిన టామ్ మీదగాని వున్నట్లు కనబడదు. జార్జి తన కోళ్ళపందేల ద్వారా, టామ్ తన కమ్మరి పనిద్వారా డబ్బు కూడబెట్టి తమ కుటుంబం స్వేచ్ఛ కొనుక్కుందామని మాత్రమే పథకం వేసుకుంటారు.

కాని జార్జి యింతగా ప్రయాస పడవలసిన అవసరం లేదు. ఏ చారిత్రిక శక్తులయితే కుంటాను బానిసగా మార్చాయో, ఆ శక్తులే యిప్పుడు అతని మనవడిని విముక్తుడ్ని చేయడానికి ఉద్యుక్తమయ్యాయి. గతశతాబ్దం మధ్య భాగానికి బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం ఒక స్థాయికి చేరుకుంది. అమెరికాలోను అది బలంపుంజుకోనుంది. కోళ్లపందేల కోసం ఊరూరా తిరుగుతూ ప్రపంచపు వార్తలు బానిస వాడకు మోసుకొచ్చే జార్జి ఈ విషయాన్ని గమనిస్తాడు. చార్లస్టన్ పట్టణం నుండి తిరిగివచ్చి, అక్కడ నల్లవాళ్లు "కాలువలు తవ్వుతున్నారు, రోడ్లువేస్తున్నారు, కంకర పోస్తున్నారు, రైలుమార్గాలువేస్తున్నారు, తమ కండలు కరిగించి దేశాన్ని గొప్పగా చేస్తున్నారు" అంటాడు. ఈ పరిణామానికి స్వతంత్రులయిన శ్రామికులు అధికంగా కావాలి– భూస్వాముల బానిసలయిన నల్లవాళ్ల శ్రమశక్తిని విముక్తిచేయాలి. అయితే పెట్టుబడిదార్లు అధికంగా ఉత్తరరాష్ట్రాలవారు, బానిస యజమానులయిన భూస్వాములు దక్షిణరాష్ట్రాలవారు కావడంచేత, యిది ఉత్తరదక్షిణ రాష్ట్రాలమధ్య అంతర్యుద్ధంగా పరిణమించింది– కాని వర్గసమాజాలు తమ అవసరాల్ని గూడ తిన్నగా గ్రహించవు, డొంకతిరుగుడుగానే గుర్తిస్తాయి– కాబట్టి మార్క్స్ చెప్పినట్లు ఈ అమెరికా అంతర్యుద్ధం "స్వతంత్ర శ్రామిక విధానానికి బానిస విధానానికి మధ్యతగవే అయినా ఇది వాస్తవంలో ముందుకొచ్చింది వేరేరూపంలో, దక్షిణాదిరాష్ట్రాల భూస్వాములు తాము ఉత్తరాది పెట్టుబడిదార్ల మిల్లులకోసం, విదేశీ మారకంకోసం పత్తి పండించిపెట్టే వలససంబంధాన్ని నిరసించి. 'మితిమీరిపోయి', రాజ్యాధికారంలో భాగంకావాలని ముందుకు రావడానికి కోపగించుకొని వారికి 'గుణపాఠం' నేర్పించడంకోసం ఆ ఉత్తరాది పెట్టుబడిదార్లు తమ ప్రతినిధి అయిన అబ్రహాంలింకన్‌ద్వారా బానిసల్ని విముక్తిచేసారు– (ఇలాగనడం లింకన్‌మీద బురదజల్లడంకాదు– చరిత్రలో ఔన్నత్యమయినా సంకుచితత్వమయినా ఏదోఒక చారిత్రికశక్తికి ప్రాతినిధ్యం వహించేవి మాత్రమేనని చెప్పడం).

అయితే ఈవిధంగా విముక్తులయిన బానిసలు వెనువెంటనే పారిశ్రామిక ఆర్థిక రంగంలోకి ప్రవేశించలేదు. నిజానికి ఆమార్పు ఈశతాబ్దం మొదటిభాగంవరకు గణనీయంగా జరగలేదు. అంతవరకు ఒకప్పటి బానిసలు తమ ఒకప్పటి యజమానుల భూముల్లోనే కూలీలుగా, కౌలురైతులుగా, పాలేర్లుగా మారారు. కొంతమంది గ్రామీణ ప్రాంతాలలోనే చిన్న వుత్పత్తిదార్లుగా స్థిరపడ్డారు. జార్జి కుటుంబానికీ యిదే జరుగుతుంది. కొంతడబ్బు కూడబెట్టుకున్నాడు కాబట్టి భూమికొనుక్కుంటాడు– స్వతంత్రుడయిన రైతుగా మారతాడు. కొడుకు టామ్ తనకమ్మరివృత్తిని కొనసాగిస్తాడు.

క్రమంగా, ఈశతాబ్దం మొదటిభాగంనుండి నల్లవాళ్లు పట్టణప్రాంత పారిశ్రామిక రంగంలోకి కార్మికులుగాను 'వైట్‌కాలర్' శ్రామికులుగాను ప్రవేశించారు. 1910లో నల్లజాతి జనాభాలో 75 శాతం గ్రామీణులుకాగా, 1970 నాటికి అది 25కు దిగింది- ఈ క్రమంలోనే టామ్ మనవరాలు ఉపాధ్యాయిని అవుతుంది, ఆమెకొడుకు అలెక్స్‌హేలీ రచయిత అవుతాడు.

నిజానికి ఇది ఏడుతరాలకథకాదు, నాలుగుతరాలకథే- బానిసగావచ్చి బానిసత్వాన్ని నిరసించినతరం, బానిసత్వానికి లొంగుబాటుకు నాందిపలికినతరం, బానిసత్వానికి పూర్తిగాలొంగి ఆ బానిసత్వంనుండే స్వేచ్ఛను కాంక్షించి విముక్తి సాధించిన తరం, తరువాత క్రమంగా అమెరికా ఆర్థికవ్యవస్థక్రింది సాగు సంపూర్ణంగా- పల్లెలనుండి పట్టణాలదాక- వ్యాపించిన 'తరం' ఇక జరగబోయేకథ వూహించడానికి హేలీ దృక్పథం చాలదుగాని, ఈ నాలుగుతరాలకథ మాత్రం తన పూర్వీకుల కథలో చక్కగా చూపించాడు. వర్గసమాజం, పీడన, అన్యాయం ఉన్నంతకాలం ఈకథ ప్రపంచ సాహిత్యంలో తనస్థానాన్ని నిలుపుకుంటుంది. ఆ స్థానమేమిటో తెలుసుకునే అవకాశం ఈ అనువాదంద్వారా తెలుగు ప్రజలకిచ్చినందుకు 'సహవాసి'ని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్‌ని అభినందించాలి.

సంక్షిప్తీకరణ చివర మరీటూకీగా సాగింది- ఇది కొంతవరకు కథలోనిలోపమే (పైనచెప్పినట్లు ఇదినిజంగా నాలుగుతరాలకథే), అయినా మరొక ముప్పై పేజీలు పెంచివుంటే (ధర రెండురూపాయలు పెరిగినా) బావుండేది. 47వ అధ్యాయం మొదటిపంక్తిలో సంవత్సరం 1855కు బదులు 1885 అని పడింది- ఈ రెండు సంవత్సరాలమధ్య బానిసవిముక్తి జరిగింది కాబట్టి ఈ అచ్చుపొరపాటు పాఠకుడిని తికమకపెట్టే అవకాశంవుంది.

— కె.బి.

ఏడుతరాలు - ఎలెక్స్‌హేలీ అను : సహవాసి, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, నవంబర్ 1980, పేజీలు 248 + VIII, వెల రు. 10-00, ప్రతులకు హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3-6-694, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500 029.

ఈ సంచిక 5వ పేజి :

రగులుకొనే రాకసి బొగ్గు "హపక పరిచయం" చేసినవారు

నవల - సీరియల్

చౌ లి-పో

రెండవ భాగం

(గత సంచిక తరువాయి)



18

గ్రేడింగ్ మొదలెట్టిన నాలుగోనాటి రాత్రి గాడిదిలి. వాంగ్‌భార్య, గుపాడు కాళ్ళ హాల గురించి చర్చసాగింది- ముగ్గురూ పేదవాళ్ళే కాని వాళ్ళసంగతి ఎంతకీ ఎటూతేలలేదు- గాడిదలి, వాంగ్ భార్యల గురించి తీవ్రమైన విమర్శలొచ్చేయి, కాని వాళ్ళ గ్రేడింగ్ తేలలేదు- అందుకని సియావో అది తర్వాత నిర్ణయించమని ప్రస్తుతానికి వాయిదావేయించేడు. పొడుగుకాళ్ళ హా మీదకూడా చర్చసాగింది.

హా పేదవాడే, మంచివాడే కూడాను- కాని అతను దుష్టత్రయపు తాంగ్ మేనగోడలిని పెళ్ళిచేసుకున్న విషయం ఎవరో పైకితీసేరు- అందరూ తలా ఒక విధంగా మాటాడేరు- జనం 'తు' ఆస్తి జప్తుచేసుకున్న విధానం చూసి మిగతా భూస్వాములు హడలిపోయి తమకు తోచిన పద్ధతిలో రక్షణ తీసుకున్నారు- తాంగ్ మేనగోడలు విధవరాలు- ఓ రాత్రి ఆమె దుప్పటితోసహా హా గదిలోకి వచ్చేసింది- ఆమెకి ముప్పైఏళ్ళు, హాకి నలభైఆరు- తాననుకున్నది సాధించగలననే ధీమాతో వచ్చింది.

హాకి కాంవందులందరిమీద కసి- తాంగ్ అంటే మరీను- తనక్కడ పనిచేసినపుడు తాంగ్ ఇంట్లో ఆడ మగ తనవేపుచూసే నిర్దాక్షిణ్యపు చూపులు అతను మర్చిపోలేడు- ఓ ఏడాది అతనికి కళ్ళజబ్బొచ్చి జీతమంతా మందులకే ఖర్చుచేసేడు- చివరికి సంవత్సరాది పండక్కి- బియ్యంలేక, కొనుక్కోడాను డబ్బులేక తాంగ్‌ని బియ్యం అరువడిగేడు- తాంగ్ గుడ్లురిమి "బియ్యమివ్వాలా?" అంటే, లోపలి నుండి ఓ ఆడగొంతు "వాణ్ణి తన్ని తగిలెయ్యండి!" అని కసరడం హా మర్చిపోలేడు.

గోడకి అంటుకిపోయిన తీరుచూసి చెయ్యెదించి "నీకేటికావాలి? మమ్మల్ని సూత్తేనే పాపమనే దానివి, పిలవకుండానే వచ్చేవేటికత? పోతావా, బాదమంటావా?" అని కేకలేసేడు, ఎదురుచూడని సంఘటనకి బెదిరిపోయి ఆవిడ పారిపోయింది. కాని ఓ పరుపుచుట్ట, అద్దం, పన్ని, రుమాలు ఇంకావివో చిన్నచిన్నవి కాంగ్ మీద వదిలేసి ఆ సలపై ఆరేళ్ళ బ్రిహ్మచారి ఆరాత్రి సరిగా నిద్రిపోలేదు. కాంగ్‌మీద వస్తువులు అతన్ని కలవరపెట్టేయి- తెల్లవారేక ఆమెని తిట్టుకున్నాడు, "దొంగముండా! పిలకుండా ఎందుకొచ్చేవే!" అంటూ,

మర్నాటిరాత్రి అతను సంఘం ఆఫీసు నుంచి ఇంటికొచ్చేక దీపంవెలిగించగానే ఆమె వస్తువులు మళ్ళీ కనిపించేయి- "ఆవిడ అన్న పేదరైతేనట", అయితే నాకేటి?" "సామానుకోసంవొత్తాది"- అలా అతనిలో ఆశ మోసులేసింది.

మూడోనాటిరాత్రి అతను సంఘం ఆఫీసునుంచి తిరిగొస్తూ, తనులేనపుడు ఇంటికొచ్చి సామానుతీసుకుపోయి వుంటుందనుకున్నాడు. కాని ఇంట్లోదీపం వెలిగించే సరికి పరుపుతోపాటు ఆడమనిషికూడా దీపంవెలుగులో కనిపించింది- ఊహించని సంఘటన కాకపోయినా హౌ కోపగించుకున్నాడు.

"ఏటికావాలే దొంగసంజా?"

ఆవిడ లేచికూచుని నవ్వి "నా పరుపుకోసమొచ్చేను" అంది "అయితే తీసుకుపో"

"నీకు అన్నం వుడకేసిపెడతా- రోజూ యింటికొచ్చేసరికి వేడివేడి అన్నం తినాలని వుండదా?" అన్నిబతిమాలింది.

కాని హే బింకంగానే "నాకేటీసెప్పక, పో" అన్నాడే గాని అతని గొంతులో మెతకదనం స్పష్టమయింది.

ఆమె యింకాసవ్వుతూ, పట్టుదలగా, "కాంపందుల ఆడోళ్ళంతా చెడ్డోళ్ళలాగవు తారు? వాళ్ళలో కూడ మంచోళ్ళుంటారు- వాళ్ళకి పేదోళ్ళంటే ఇష్టం- మా బాబు ఓ రైతు, మాఅన్న రైతుకూలీ- మానాన్న అప్పుతీర్చలేక నన్ను కాంగ్‌కి అమ్మేసేడు" అని చెప్పింది.

"అంతా నాటకం, మీవోల్లంగా పెద్దరైతులని నాకుతెల్దేటి? నువ్వూ వున్నోళ్ల పిల్లలే"

"అవును, నేను కలవాళ్ళమ్మాయినే- ఇక్కడుండిపోతే పేదరాలినైపోతా"

"ఏసాలు మాని ఇంటికిపో, సీకటడిపోనాది"

అతని గొంతు మార్దవంగా మారింది— లీలాన్-యింగ్ నవ్వుతూ, "నేనుపోను, నాకు భయం" అంది.

"ఎందుకు బయ్యం?"

"తోడేళ్ళుంటాయి"

"ఎన్నేట్టో ఏటి బయ్యం?

"ఎలాగూనేనుపోను, నువ్వేంచేస్తావో చేసుకో— నన్ను కాంగ్‌మీద పడుకో నీకపోతే నేలమీద పడుకుంటా— నీకది బాగుంటుందా?" తన నిర్ణయం మారదన్నట్టు మాట్లాడింది.

హౌ మాట్లాడలేదు. అతనికి ఆవిడమీద జాలేసింది. నేలమీదన్నా పడుకుంటుంది గానివెళ్ళదు— చల్లటినేలమీద ఎలా పడుకోనివ్వడం? ఆమెమీద జాలితో కౌవందులమీద కసి కరిగిపోయింది— ఆమె పాతగొను, ఆమె నవ్వుమొఖంచూసి అతనికో సామెత గుర్తొచ్చింది— "బుద్ధున్న మగాడెవడు ఆడదానితో తగువాడడు; నవ్వు మొగాన్ని కొట్టిఏడిపించడు".

"నువ్వినాగుంతే నన్నేటి సేయమంటావ్?"

"దానిదేముంది? చాలాతేలిక కాంగ్ చాలాపెద్దది— నువ్వోమూలకి నేనోమూలకి పడుకుందాం— నూతిలోనీరు, ఏట్లోనీరు ఎలాగూకలవదు— తెల్లవారగానే నేను వెళ్ళిపోతా— నీకేంపీ నష్టంలేదుగదా?"

తెల్లవారిందికాని ఆమెవెళ్ళలేదు— ఈసంగతి జనానికితెలిసి అతన్ని తిట్టేరు— మధ్యతరగతి రైతులుకూడా అతన్ని నిందించేరు— కొందరతన్ని రైతుసంఘంనుంచి బహిష్కరించాలన్నారు— మరి కొందరతన్ని యాంగ్‌తో పోల్చేరు— ఇప్పుడు మీటింగులో కూడా అందరూ అతన్ని నానామాటలు అని హడావుడిచేసేరు— గ్రేడింగ్ సభ్యులు వాళ్ళ చీదరింపులను ఆపలేకపోయేరు— మాటలతో హౌనితూట్లుపొడిచేరు.

"ఏయ్ హౌ! నువ్వు పేదోడివా, వున్నోడివా?" అని చాలా గొంతులు ప్రశ్నించేయి.

అతను సమాధానం చెప్పేలోపు, "పేదోడేగాని, వున్నోడి గుండె తగిలించుకున్నాడు కదా" అన్నాడు ఒకడు.

"కౌవందులకు లొంగిపోనావట!"

"పేదోడి బతుకు యిసుగెత్తిపోనాది కావాల!"

"నీవోల్లకి, పైటల్లకి తేడానేదా?.... మొగుడుపెల్లం అన్నాక నువ్ దానికన్నీ పెప్తావ్- నిన్నిక మీటింగులకెలా పిలుత్తాం? నీ యింటో కాంవందుల పిల్లనెట్టుకుంటే నిన్ను మావాడుగా ఎలాసూసుకుంతాం?" అనడిగేడు చాంగ్ చింగ్-షీ.

"నీ కొంగ్‌మీద తోడేలున్నాది- నీకుతోడేలు పిల్లల్నే పెడతాది" అన్నాడు చు.

ఓల్డ్‌సన్ ముందుకి తోసుకొచ్చి,

"ఇన్నాల్లు పెల్లిపెటాకులు నేకండా వున్నోడివి, వుప్పుడేటి తొందరొచ్చినాదిరా? దాని మాయలోపడిపోనావేటి?" అన్నాడు.

హాకి ఓల్డ్‌సన్ అంటే భయంలేదు, అందుకని వెంటనే జవాబిచ్చేడు; "అదే ఒచ్చినాది నాను దాని మాయలోపడిపోనానంతావేటి?"

"అదే ఒచ్చినాదా? మరైతే దానిగుండి నీగుండి ఒకటేనేటి? అదినీకు పిల్లల్ని కంటే ఆల్లేటవుతారు? పేదరైతులా, కాంవందులా? నీకొడుకు పెద్దయి కాంవందుని సంపుతానంటాడు, నీపెల్లం ఎదురుతగుల్తాది, అప్పుడేతంతవ్?"

"ఓల్డ్‌సన్! అప్పటికి కాంవందులే వుండరు" అన్నాడు చాంగ్ చింగ్‌షీ.

"కాంవందులునేపోతే అమెరికా-చియాంగ్ తొత్తులుంతారు" అన్నాడు ఓల్డ్‌సన్.

"ఆల్లూవుండరు" అని జవాబిచ్చేడు చు.

కాని ఓల్డ్‌సన్ వదల్లేదు. "సరే ఆల్లునేపోతే యిాల్లే కొట్టాడుకుంతారు. ఒకడు పులుపుకావాలంతే మరోడు కారంకావాలంతాడు. ఒకడికి కొంగ్ ఏడీగుంతే, వుంకోడికి సల్లగుంతాది ఒకడు బండిల ఎల్లాలంతే, మరోడు పడవల ఎల్లాలంతాడు. ఆల్లెప్పుడు రాజీపడరు, నానేహాన్నైతే సవ్వానైనా సచ్చుందునుగాని దాన్ని పెల్లాడకపోను".

"అంతానాటకం. నీకు పెల్లాంనేపోతే దాన్ని కల్లకద్దుకు పెల్లిసేసుకునివుందువ్" అన్నాడు చాంగ్ చింగ్-షీ.

"మొగోడివాయితే దాన్ని పైకితోలెయ్. నేపోతే నువ్వూ కాంవందువైపోగలవ్" అని సలహా యిచ్చేడు చు.

హా గుండెలమీద చేతులానించుకుని, "లీలాన్-యింగ్ దానంతటదే నాయింటి కొచ్చినాది- కూడుడకేసిపెడతాది, గడ్డికోత్తాది, పందుల్ని మేపుతాది- మొగాడిలో సగం పని పెకపెకసేత్తాది- అందుకే దాన్నుంచీసుకున్నా" పన్నాడు.

"ఆ వూసింకసెప్పకు- దాన్నెల్లగొడతావా, నేదా?" అనడిగేడు చు.

"అతన్ని మాటాడనివ్వండి, చెప్పు హా" అని హెచ్చరించేడు పియ్యాన్.

"నీకింకా వొయసున్నాది, ఇంకా ఆగనేకపోనావా ? ఉప్పుడునాకు ఏబైఒకటి- వచ్చేఏటికి ఏబైరొండు- నానుసూడింకా బండినాగుతున్నా"నన్నాడు ఓల్డ్‌సన్.

"ఓల్డ్‌సన్! నువ్వు కాసేపాగు- అతన్ని చెప్పనీ" అని వారించేడు సియావో.

హౌ నిట్టూర్చి తలెత్తి మాట్లాడసాగేడు.

"నాను కుటుంబంగా పనిలోసేరి ఇరవై ఆరేల్లవుతాది- సచ్చేనాగ పన్జేసినా పెల్లం దొరకనేదు- మాఅమ్మ బాబుండగా పెతేపూ నాకుపిల్లనెతికేవోరు- కాని దొరకనేదు- ఏడాదిపొడుగునా శాకిరిసేసినా నాకుతిండి, బట్టవుండేదికాదు- ఈపేదోన్ని పెల్లాడి కట్టాలు పడాలని ఏఆడదాయికీ వుండేదికాదు- మొట్టమొదాట పిల్లలెతికేసరికి నాకు ఇరవై ఏల్లు- ఉప్పుడు? నలబై ఆరు- ఒక్కపాలిమాత్తరం పెల్లికానా దగ్గరకొచ్చినాది- పిల్ల ఓచాంగ్ కుటుమానంలోది- ఆచాంగ్ పేదరైతు- పుద్దెవొర్తి కాడ చాంగ్‌నన్ను మెచ్చుకోని, "పిల్లకీ పెల్లిగుడ్డలెడితే శాన"అన్నాడు. మాబాబు పొంగిపోయి సొమ్ము కోసం 'తు' కాడికెల్లేడు- 'తు'నవ్వి "నీ కొడుకుపెల్లికి నాకు డబ్బివ్వాలనే వుందిగాని అంగుళం గుడ్డముక్క కొనేందుకైనా నాకాడ పైసానేదు-" అన్నాడు- మాబాబు ఆడిని బతిమాలేడు: "బాబ్బాబు నీకాడబ్బు గడ్డిపరకతో సమానం, దాన్నెంగిలిజతో సమానం, దయుంచి యీసాయం సెయ్యిబాబూ, నాకొడుకు నీకు రునపడుంతాడు- దీపంపెట్టుకుని నీపేరు తల్చుకుంతాం'' అంటూ- కాని సెంవిటోడిముందు శంకమూదినట్టయింది. కాల్ల కాడి కొచ్చినపెల్లి ఆగిపోనాది- పిల్లబాబుదీ తప్పునేదు- ఆడేటి బంగారంపడిగేడా? పిల్లకి లాగునొక్కా అడిగేడు. మరి పెల్లిలో సిరుగులబొంత తొడుక్కుంతాదేటి? మునుపు పేదోడిపెల్లి సెందురుడికాడికి ఎల్లిరాడంతో సమానం- పేదోన్ని పేదపిల్ల కూడా పెల్లాడేదికాదు".

హౌ ఆగి, కళ్ళుతుడుచుకున్నాడు- లీకీ-లాన్‌కూడా ఏడ్చింది. అప్పుతీర్చలేక తనని తండ్రి 'తు'కి అమ్మేసేడు- హౌమీద జాలితోనూ, తన కష్టంగుర్తొచ్చీ ఆమె కంటతడిపెట్టింది- ఆమె పక్కనే కూర్చున్న చావో భార్యకూడా కళ్ళొత్తుకుంది- హౌ మళ్ళీ చెప్పసాగేడు.

"ఏడకండి, బెమ్మచారి కట్టాలు ఏడిత్తే తీరేవికాదు- గుడ్డలు సినిగిపోతే కుట్టే వోల్లుండరు- మంచుకరుగుతున్నా జోల్లుండవు"

ఇంతలో మరోబ్రిహ్మచారి అందుకుని,

"పొలంపన్జేసి ఇంటికొత్తే ఏటుంతాది? అడే ఒండుకోవాల- అలిసిపోయి సద్దికూడే తింతాడు- సల్లటి కొంగమీదే తొంగుంతాడు- సివరికి ఆడిగుండెకూడా సలికి గడకట్టుకుపోతాది" అన్నాడు.

హా మళ్ళీ మొదలెట్టేడు;

"బెమ్మశారిగానే సవ్వాలనుకున్నాగాని నాను సచ్చిపోనాక, నా అమ్మాబాబుల్ని పూడ్సిపెట్టినసోట తుడవడం, నైవేద్దవెట్టడం పదుండదు- అప్పుడు మీరు నన్ను తప్పుపట్టరా?"

"బూజుపట్టిన మాటలు- సచ్చినోల్లు సత్తారు, నువ్వాల్లకీ నైవేద్దెం ఎట్టినా ఎట్టకున్నా ఒకటే" నన్నాడు చాంగ్ చింగ్-షీ.

"ఉప్పుడు పేదోల్లదే రాజ్జెం, నాకు పెల్లికిడబ్బున్నాదిగాని నా తలపండిపోనది" అంటూ టోపీతీసి తన తెల్లజుట్టు చూపేడు హా- మళ్ళీ టోపీపెట్టుకుంటూ.

"కాని నానే పిల్లనిసూడాల? పేదోల్ల కుటమానాలు సిన్నవి- ఆడ గుంటలు తక్కువ- నన్నేగుంటన్నా పెల్లాడతానన్నా నానొప్పను, నావొయిసులో తొంగుడుంటే మల్లలేత్తానన్న నమ్మకం నేదు- సిన్నగుంటని పెల్లాడి దాన్నెదవముండని సెయ్యనా?" అన్నాడు.

"శానాదూరం ఆలోసించేవే!" అన్నాడు ఓల్డుసన్.

"నిజంసెప్పాలంటే నాను పెల్లిపాసేమానుకున్నా- కాని ఆరేతిరి లీలాన్-యింగ్ ఒచ్చీసినాది- పోనంటే పోనన్నాది- నల్లటి నేలమీదయినా తొంగుంతానన్నది. నానేటిసేద్దును? బాదేద్దును కాని ఆడదానిమీద సెయ్యిసేసుకునే మొగోడు మొగోడే కాదని యాదస్తొచ్చినాది" అని ఆగేడు హా ఎవరూ ఏంవీఅనలేదు- అతను మళ్ళీ చెప్పసాగేడు.

"ఇయేల మీ అందరి మాటలు యిన్నాను- మీరంతా కాంవందుల్ని మట్టుపెడతారంటే నాను కాంవందు మేనగోడల్ని వుంచీసుకోడం శానాతప్పు- కాని అంతా అయిపోయేక ఉప్పుడేటిసేద్దును?"

అంతా నిశ్శబ్దం.

"దాన్ని గెంటీద్దునా? కాని పొద్దత్తామాను కాంగ్ మీద తొంగుంతాదీ. దాని జబ్బేంపిటో నాకుతెల్నేదు- పొరుగుముసిల్ది సెప్పినాది- దానికీ నెలసరి తప్పినాదని- మరుప్పుడేటి సెయ్యమంతారు?

ఇంకా ఎవరూమాటాడలేదు- సియావో గేర్డింగ్ సభ్యులతో చర్చించి లేచి నిల్చున్నాడు- అతనేంవి చెప్తాదోనని అందరూ అతని చుట్టూచేరేరు.

"జరిగిందేదోజరిగిపోయిందీ- నువ్వాంవెని వుంచుకోవచ్చు-"నన్నాడు సియావో,

ఆడవాళ్ళంతా ఓ పెద్దబరువుదిగిపోయినట్టు నిట్టూర్చి, నవ్వేరు– మగాళ్ళు రకరకాలుగా అనుకున్నారు.

"సరే పోనీ"

"అదుప్పుడు పేదరాలై పోతాది గాఁవాల"

"పేదోల్ల మనసు మెతక– కానిప్పుడు కాఁవందులు మన్నేఁవీ చేయనేరులే" అన్నాడు చాంగ్ చింగ్-షి.

"ఎనిఁవిదోదల పైన్నెపోల్లు అందరినీ సల్లగా దింపేత్తారు" అన్నాడు ఓల్డుసన్.

"లొంగిపోయిన శత్రువుల్ని సానుభూతితో చూస్తాం" అని కలిపేడు సియావో. హావైపు తిరిగి "ఏఁవైనా నువ్ జాగ్రత్తగా వుండాలి– అఁవెకవసరంలేని విషయాలు నువ్ చెప్పకు."

"నీకు తెలివివుంటే సంగంరగస్సాలు దానికి సెప్పకు" అన్నాడు చాంగ్ చింగ్-షి.

"నానుగాని సెప్తే మొగోడినేకాను" అని భరోసా యిచ్చేడు హా.

సియావో మరికొన్ని విషయాలు చెప్పేడు:

"ఆవిడ ఎలా ఆలోచిస్తోందో నువ్ కనిపెట్టి చూడాలి– ఇంకా ఆమె మనసు కాఁవందుల వేపుందో, పేదోళ్ళవేపు మారిందో చూడు– ఆమె మాటలబట్టి నిర్ణయించుకోకు, నిజాయితీగా పనిచేస్తోందో లేదోచూడు– మీరు కలిసివుంటున్నారు గనక నీకు ఆమె గురించి అన్నీ తెలిసుండాలి– కష్టపడి పనిచేస్తే మనిషి మారతాడు. ప్రపంచమే మారిపోతోంది. ఆమె అయిదేళ్ళు కష్టపడి పనిచేస్తే ఆమెని కాఁవందుల ఆడబడుచుగా చూడరని చెప్పు– నువ్వువూరికే జాగ్రత్తపడ్డంకన్నా ఆమెని ముందుకు తీసుకుపోవడానికి ప్రయత్నించు– ఆవిడ నిన్ను తప్పుదారిపట్టించకుండా చూసుకో."

సియావో, గ్రేడింగ్ సభ్యులు చెప్పిన మాటకి జనం ఒప్పుకున్నారు– పొడుగుకాళ్ళ హా లీ లాన్-యింగ్‌ని వుంచుకోవచ్చునుగాని ఆమె ఆలోచనను మార్చి, ఆమె చేత పనిచేయించాలి– హాది గ్రేడింగ్‌లో నంబరు మూటఇరవై. దాని ప్రకారం అతనికి కొంతభూఁవి, కొన్ని వస్తువులువస్తాయి– లీ లాన్-యింగ్‌కి మాత్రం కొంత భూమి మాత్రమే యిస్తారు.

మీటింగయిపోయేక సియావోని తన ఇంటికి ఆహ్వానించేడు హా– అతని భార్యని చూడాలన్న కుతూహలంతో సియావో వెంటనే ఒప్పుకున్నాడు– హా ఇల్లుసమీపిస్తుండగా నీలంగౌను వేసుకున్నావిడ పందులను మేపుతూ దూరంగా కనిపించింది– హా తలాడించి "అదుగోటి అదే" నన్నాడు.

లీ లాన్-యింగ్ తలెత్తి సియావోనిచూసి పనిలో మునిగిపోయింది. సియావో హౌతోపాటు గదిలోకి నడిచేడు. కాంగ్‌మీద అటుఇటూ పడిలేసిన పాతజాకెట్టుంది. గదంతా శుభ్రంగావుంది. కాంగ్‌మీద రెండుదొంతలు పడివున్నాయి. కిటికీ అద్దం మీద ఓఎర్రిబొమ్మ అంటించివుంది. లీ లాన్-యింగ్ అగ్గిపెట్టెకోసం గదిలోకొచ్చి సియావోని భయంభయంగా చూసింది. కాని అతను నవ్విన స్వచ్ఛమైననవ్వుకి ఆమెకి ధైర్యమొచ్చింది. ఆమె పొయ్యి వెలిగించబోతుంటే,

"నేనుపోవాలి ఇప్పుడు నీవు వేడిచేయనమ్మా" అని వారించేడు సియావో.

"'చాంతరు పండగ' తర్వాత పొలాలకు ఎరువులేయడానికి ఇంకా టైముంటుంది. నువ్వంతవరకు ఏవన్నా చిన్నచిన్నపనులు చేయగూడదూ! ఆవిడేవి చేయగలదు?" అని హౌని అడిగేడు సియావో.

లీ లాన్-యింగ్ బైటనుంచి అంతా వింటోందిగాని మాటపలకలేదు.

"గడ్డితోపీలల్లుతాది. మంచుకరిగేక ఏటొడ్డుకెల్లి రెల్లుగడ్డి కోసుకొత్తానుబాబూ" అన్నాడు హౌ.

సియావోతో పొలం పనులగురించి మాటాడుతూ హౌకూడా బయటికొచ్చేడు. సియావో మరోసారి అతన్ని హెచ్చరించేడు

"ఆవిడ పనిచేస్తే మంచిదే. కాని నీజాగ్రత్తలో నువ్వుండాలి. అంతా సద్దుమణిగేక మళ్ళీ పాతజీవితంమీద కోరికపుట్టి నిన్ను వదిలేయగలదు. కాంపందుల ఆడవాళ్ళకి పనిపాటల అలవాటుండదు".

దానికంత దమ్ములేదబాబూ. నాను చెప్పినపని సేయకుంటే దానితోలు ఒలిచేత్తా, అప్పటికీ నామాటినకపోతే దాన్ని పైకితోలేత్తా.

"ఆవిడని కొట్టకు. నిజాయితీపరురాలిలాగే కనిపిస్తోంది. నువ్వే ఆమెని మంచి పనులవేపు తిప్పుకోవాలి. ఇప్పుడు నీకుభార్య, మంచిజీవితం వున్నాయి గనక, విప్లవానికి ద్రోహం చెయ్యకు" అన్నాడు సియావో.

"అమ్మమ్మ, నానాపని సత్తేసేత్తానా? చైర్మన్‌మావో, పార్టీ నాపేనం. భూసమస్కరణగాని నేకంటే నానింకా గాడిదనాగ కాంవందుకీ శాకిరి సేత్తుండేవోణ్ని. నాకోపెళ్లాంకాదుగదా, ఓ మడిసెక్కాన్నా వుండీదికాదు. నావిప్లవంకోసం ఏదైనాసరే సేత్తాను సియావో బాబూ. నాను హౌని నాను హువాయంగ్ సీనికాదు" అన్నాడు హౌ.

సియావోకి హువానికూడా ఓసారి చూడాలనిపించింది. హౌ ఇంటిదగ్గరనుండి హువా ఇంటికేసి నడిచేడు.

(ఇంకా వున్నది)

మార్క్సిజం - సాహిత్యం

(గత సంచిక తరువాయి)

అయితే సురేంద్రరాజు ప్రపంచంలోకి మళ్ళీ ప్రవేశించాల్సిన అవసరంవుంది. ఈ ప్రపంచంలో కర్కోటకులయిన పాలకులు, కుసంస్కారులయిన ప్రజలు, జితేంద్రియులయిన కొంతమంది సాహిత్యకారులు వారి పాఠకులు వుంటారనిచూసాం. ఈ సాహిత్యకారులు ఏదోవిధంగా తాము జీవిస్తున్న సమాజానికి వ్యతిరేకంగా పోరాడుతారు, ఎందుకు? వారికీ, సమాజానికి సఖ్యత లేదుకాబట్టి- సఖ్యత ఎందుకు లేదు? కృత్రిమవిలువల్ని పాటించే పెట్టుబడిదారి సమాజంలో జీవిస్తున్నారు గనుక. మరదీనికి- దీనికీగూడ- మార్క్స్ మద్దతుకావాలి. థియరీస్ ఆఫ్ సర్ప్లస్ వాల్యూ అన్నపుస్తకంలో మార్క్స్ "పెట్టుబడిదారి వ్యవస్థలో భౌతికవుత్పత్తి కొన్నిరకాల మేధాగతమయిన (spiritual) ఉత్పత్తికి ప్రతికూలంగా వుంటుంది- ఉదా: కళలకూ, కవిత్వానికీ" అన్నాడనిచెప్పి దాన్ని సురేంద్రరాజు ఈవిధంగా వ్యాఖ్యానిస్తున్నారు: "పెట్టుబడిదారి వ్యవస్థలో కళలు అభివృద్ధి చెందవని మార్క్స్ అంటున్నాడంటే దానిక్కారణం- మనిషి కృత్రిమ విలువల్ని పాటించేవాడుగా, పరాధీనుడుగా, శకలంగా, ఏకాకిగా, అసాహిత్యాన్ని నీచసంస్కృతిని ఆనందించేవాడుగా ...." వగైరా వగైరా తయారవుతాడు కాబట్టి. మార్క్స్ చెప్పిందానికిదాఅర్థం? అసలు పెట్టుబడిదారి సమాజంలో కళలు వృద్ధిచెందనే చెందవన్నాడా? ఒకవేళ పైనిచ్చిన కొటేషన్ ఆ అర్థాన్ని స్ఫురింపజేసినా, అది సరికాదని అదేపుస్తకంలో వేరేసందర్భాలలో చెప్పినమాటలు రుజువుచేస్తాయి.

పెట్టుబడిదారి వుత్పత్తి విధానానికి కళలకు వైరుధ్యం వుంటుంది- దీనికి కారణం మనిషి కృత్రిమంగాను నీచంగాను తయారవడంగాదు- పెట్టుబడిదారి వుత్పత్తి వస్తు వినియోగంకోసం కాకుండ మార్పిడికోసం జరుగుతుంది- అంటే ఉత్పత్తి అయినా వస్తు వాడకపు విలువ రూపంలో కాకుండా మారకపు విలువ రూపంలో వుంటుంది- ఉత్పత్తికి ప్రోద్బలం అదనపు విలువద్వారా పెట్టుబడిని ఇతోధికం చేసుకోవడం- అయితే కళాకారుల సృష్టికీ, కవితకు అనివార్యంగా మారకపు విలువ వుండాలనిలేదు- ఉండదనీ చెప్పలేం- ఇక్కడే పెట్టుబడిదారి వుత్పత్తికీ కళకు కవిత్వానికీ వైరుధ్యం వుంది- దీనికి భిన్నంగా భూస్వామ్య సమాజంలో వుత్పత్తి (అధికభాగం) వాడకపు వస్తువుల వుత్పత్తి. అదనపు వుత్పత్తి పెట్టుబడిగా మారిన ఈ సమాజంలో దోపిడి

వర్గాలకు గానాబజానాలతోను ముషాయిరాలతోను కొలంగడపడాన్ని మించిన వ్యాపకం వుండదు- అంటే వారి ప్రమాణాల్ననుసరించి ఉత్తమమనిపించుకున్న కళ, కవిత్వం ఉత్పత్తి కావడానికి వేరే ఏ ఆటంకమూ వుండదు- అందుకనే ప్రత్యేకించి "పెట్టుబడిదారీ వుత్పత్తి విధానం కళకు ప్రతికూలంగా వుంటుంది" అని చెప్పడం.

ఈ వైరుధ్యం వాస్తవంలో ఏరూపం తీసుకుంటుందన్నది నిర్దిష్టస్థాయిని బట్టి వుంటుంది- ప్రముఖ బూర్జువా మేధావి, ఆనాటి (18వ శతాబ్దపు చివరి భాగం) అభ్యుదయ శక్తినింకా కోల్పోని బూర్జువావర్గం ప్రతినిధి అయిన ఆడంస్మిత్ ఒకచోట మతాధికారులను, లాయర్లను, డాక్టర్లను, రచయితలను, ఆటగాళ్లను, పాటగాళ్లను, బఫూన్లను అందరిని ఒకటిగాచేర్చి, వీరందరు నిరర్థకమయిన అనుత్పాదక శ్రామికులు, నౌకర్లతో సమానమని, వీళ్లు సమాజంమీదపడి బ్రతికేవాళ్లని, నిరసనగా అన్నమాటల్ని వుటంకించి, మార్క్స్ దాని నీవిధంగా వ్యాఖ్యానించాడు11. ఇక్కడ ఇంకా విప్లవ శక్తిని కోల్పోని బూర్జువావర్గం మాట్లాడుతోంది- ఈ వర్గం అప్పటికింకా సమాజాన్ని రాజ్యాంగాన్ని సంపూర్ణంగా తనకు లోబరచుకోలేదు- అయితే ఈ బూర్జువావర్గం పూర్తిగా అధికారంలోకివచ్చి, ఉత్పాదక శ్రమకు ప్రతినిధిగా వున్నదికాస్త, వుత్పాదక శ్రామికుల్ని తనవంతుగా ఎదుర్కున్నపుడు, ఇక్కడ నిరసించిన వాళ్లందరిని 'తన వాళ్ల'గా ఎంచుకుంటుంది- క్రమంగా 'సంస్కారం' పెరిగి తింటే చాలదని 'సంస్కారం' వుండాలని గ్రహిస్తుంది- ఈ భౌతికేతర వుత్పత్తులన్నీ పెట్టుబడిదారీ వుత్పత్తిలో భాగమవుతాయి, పెట్టుబడిదార్ల లాభాలకోసం చేయబడతాయి- అప్పుడు తాను వ్యర్థమని నిరసించిన ఈ ఉత్పత్తులనే ఉపయోగకరమని సమర్థిస్తుంది- (సుదీర్ఘమయిన మార్క్స్ వ్యాఖ్యకు ఇది స్వేచ్ఛానువాదం మాత్రమే).

ఇది గతశతాబ్దం మధ్యభాగపు విషయం. తరువాతి పరిణామాల్నిగూడ తెలుసుకోవాలి- క్రమంగా పెట్టుబడిదారీ సమాజం గుత్తపెట్టుబడిదారీ స్వభావాన్ని పొందింది- అంటే అంతవరకు అప్పుడప్పుడు- ఆర్థిక సంక్షోభాల సమయంలో ఎదుర్కొన్న 'మార్కెట్ సమస్య' దైనందిన సమస్యగా మారికూర్చుంది- అధికంగా పెట్టుబడి కేంద్రీకరించ బడటంచేత, దాన్ని లాభదాయకంగా మదుపుపెట్టడానికి కావలసిన మార్కెట్ల విస్తరణ సమస్యయిది (దీనిని ఆర్థిక శాస్త్రవేత్తలు అదనపువిలువ ఫలదీకరణ సమస్య- Problem of realisation of surplus value. అంటారు). దీనికొక పరిష్కారం, ప్రచారసాధనాలను ముమ్మరంగా వాడుకొని వాడకందారుల [illegible] దానికి కళను లొంగదీయడమేకాదు,

కళనే ఒక ప్రచారసాధనంగా వాడుకుంటుంది పెట్టుబడిదారీవర్గం- ఈరోజు పాశ్చాత్య దేశాల్లో రేడియో, టి. వి. లలోని ప్రోగ్రాంలు అధికంగా గుత్త పెట్టుబడిదారి సంస్థలు నిర్వహించేవే- వీటిని 'కమర్షియల్స్' అంటారు- అంతేకాదు, కళాభవనాలు (art galleries) నడుపుతారు, వేలడాలర్లు వెచ్చించి తమకే అర్థంగాని అరూప కళా ఖండాలు కొంటారు- ఒకప్పుడు నిరర్థకమని నిరసించిన సైద్ధాంతిక పరిశోధననే కాకుండ నిజంగానే నిరర్థకమయిన నకిలీ పరిశోధననుగూడ ఇప్పుడు ప్రోత్స హిస్తున్నారు- వివిధ 'ఫౌండేషన్ల' ద్వారా12. కాబట్టి తన పరిణామక్రమంలో బూర్జువా వుత్పత్తి విధానం 'కళాపోషణ' అవసరంగా చేస్తుందని గ్రహించాలి- (ఈ కళ పాలక వర్గాలకే గాని ప్రజాకళకాదని వేరేచెప్పనవసరం లేదు. అయితే సురేంద్రరాజు చెప్పే 'ఉత్తమ' కళకు ఈ మార్కెట్ల విస్తరణార్థం జరిగే కళాపోషణకు ఏ విరోధం లేదు- ఈ పోషణ పుణ్యమా అని ఈనాడు అమెరికాలో 'ఆధునిక కళా కారులు' చాలమంది లక్షాధికారులయ్యారు)

పోనీ పెట్టుబడిదారి వుత్పత్తి విధానం 'ఉత్తమ' సాహిత్యానికి కళకు విరోధి అనుకుందాం- మరి మన 'ఉత్తమ' సాహిత్యకారులు కళాకారులు ఏంచేయాలి? ఆ ఉత్పత్తి విధానాన్ని ఎదిరించాలి- అంటే (తాత్వికజ్ఞానం గలవాళ్లు, గతితర్కం ఎరిగిన వాళ్లు కాబట్టి) అందులోని వైరుధ్యాల్ని పురస్కరించుకొని కార్మికవర్గంతో చేయికల పాలి- కాని సురేంద్రరాజు ప్రపంచంలోని మేధావిచేసేది ఈ పని కాదు- ఇతను 'సమాజానికి వ్యతిరేకంగా పోరాడతాడు'- ఉత్పత్తి విధానంతో విరోధం వున్నవాడు మొత్తం సమాజంతో పోరాడడం ఎందుకు? అయితే ఇది కేవలం అతని వ్యక్తిగత మయిన వెర్రికాదు- ఒక కొత్త చారిత్రిక సిద్ధాంతం "వ్యక్తికీ సమాజానికీ మధ్య కొనసాగే ఘర్షణ గతితార్కికంగా కొనసాగుతుంది- దాని ఫలితంగానే ఆ సమాజంలో మార్పు వస్తుంది"- మరొకచోట "గతితార్కికత క్రియాశీలంగా చరించాలంటే వ్యక్తికీ వాస్తవానికీ ఘర్షణ జరగడం అనివార్యం."

'చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర' అని నమ్మే మార్క్సిజం నుండి ఇంత దూరంపోయి, యాంత్రికతకు గతితార్కికతకు గల భేదం వివరించ బూనుకోవడం ఎందుకు? ఇది చారిత్రిక భౌతికవాదంకాదు, చారిత్రిక అధివాస్తవికవాదం- ఇంత భయానకమయిన వాదానికి గతితర్కం గూడ చేరిస్తే ఏమవుతుందో చెప్పలేం కాబట్టి దయచేసి యాంత్రికంగానే అన్వయించమని ప్రార్థన.

'ఆధునిక' సాహిత్యం

ఇరవయ్యవ శతాబ్దంలో పాశ్చాత్య సాహిత్యంలో వచ్చిన సాహిత్యోద్యమాల నన్నింటిని మార్క్సిస్టులు బూర్జువా సాహిత్యం, క్షీణసాహిత్యం అని విమర్శించారని,

అయితే ఈ సాహిత్యం బూర్జువా విలువలకు వ్యతిరేకంగా వచ్చిన సాహిత్యమని సురేంద్రరాజు ఆరోపిస్తున్నారు- దీన్ని కొంచెం వివరంగా పరిశీలించాల్సివుంది.

ప్రథమంగా వర్గసాహిత్యం గురించి మార్క్స్ చెప్పిన మాటల్ని మరొకసారి గుర్తుచేయాలి. ఒక వర్గం తన సామాజిక ఆర్థిక అవసరాలదృష్ట్యా అవలంబించే దృక్పథాన్ని, తన వ్యక్తిగతమయిన కారణాలవలన అవలంబించేవాడు ఆ వర్గానికి ప్రతినిధి- (అయితే దీన్ని ఫార్ములాగా మార్చి మామొహాన కొట్టొద్దని సురేంద్రరాజు వంటి వారికి విజ్ఞప్తి) ఈ **అవగాహనతో** పాశ్చాత్య సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు గతశతాబ్దానికి ఈ శతాబ్దానికి పెట్టుబడిదారి విధానంలోని తేడాలు గమనించాలి.

గతశతాబ్దం చివరి భాగందాకా పెట్టుబడిదారి ఆర్థిక విధానం (మొత్తం మీద) పెట్టుబడుల పోటీని ప్రాతిపదికగా కలిగివుండింది- పారిశ్రామిక విప్లవాన్ని సాధించి ఆవిరిశక్తిని ప్రప్రథమంగా వుత్పత్తికి చోదకశక్తిగా మార్చింది- భౌతిక ప్రపంచం గురించి జ్ఞానం పెరిగేకొద్దీ దాన్ని వుత్పత్తికి వాడుకొని ఉత్పాదకతను విపరీతంగా పెంచింది- అటువంటి వ్యవస్థలోని పాలకవర్గానికి సహజంగానే శాస్త్రీయ దృక్పథం, హేతువాదం, ప్రగతివాదం, యథార్థవాదం వచ్చుతాయి- దీని ప్రతిబింబమే అనాటి బూర్జువా తాత్విక సిద్ధాంతాలలో ఈ వాదాల ప్రాబల్యం- అంతేకాకుండా, విభిన్న దేశాల పెట్టుబడిదారి వర్గాల మధ్య వైరుధ్యాలున్నా గెల్చుకోవడానికి ప్రపంచమంతా వుంది కాబట్టి ఆ వైరుధ్యాలు తీవ్రంగా పరిణమించలేదు- విశాలమయిన ఆసియా ఆఫ్రికా ఖండాలలోని మార్కెట్లు 'తమ'వే కావడంతో వారికి ఈ ప్రపంచం చాల అందంగా కనిపించింది- అందుకే బెన్ జాన్సన్ అన్నాడు,

"ALL IS WELL WITH THE WORLD
...GOD IS IN HIS HEAVEN."

గతశతాబ్దం చివరిభాగానికి పెట్టుబడి కేంద్రీకరణజరిగి గుత్తపెట్టుబడిదారి వ్యవస్థ వుత్పన్నమయింది- దీనితో వనరులకోసం వలసలవేట విజృంభించింది- అంత వరకూ రెండుమూడు దశాబ్దాలకొకసారి వచ్చే ఆర్థికసంక్షోభం, క్రమంగా రోజువారీ సమస్యగామారి మార్కెట్లకోసం పోటీమరీ అధికమయింది- కాని ఆసియా ఆఫ్రికా ఖండాలు ఎంతపెద్దదయినా ఒక పరిమితి వున్నవి కాబట్టి ఈపోటీకి పరిష్కారం ఇదివరకటంత సులభం కాకుండ పోయింది. మొదటి ప్రపంచయుద్ధం జరిగింది- ఇదంతా చాలదన్నట్లు కార్మికవర్గానికి 'లేనిపోనిఆశలు' కల్పిస్తూ అక్టోబర్ విప్లవం జరిగింది- హఠాత్తుగా అందమయిన వాస్తవం వికారంగా తయారయింది- తాత్విక స్థాయిలో యిది అధివాస్తవిక వాదంగా పరిణమించింది- అంతవరకు తమ ఆధిపత్యం

అనంతంగా విస్తరిస్తుందనుకున్న బూర్జువా వర్గాలకు అది నిజంకాదని, తమలోతాము కీచులాడుకోవడమే జరిగేదని తెలిసేసరికి ప్రగతిమీద నమ్మకంపోయింది. అందుకే ఈ 'ఆధునికుల'లో మొదటి వాడయిన టి.ఎస్. ఎలియట్ ప్రగతివాదం మీదనేయుద్ధం ప్రకటించాడు.[13] ఉత్తరోత్తరా వలసలలో తిరుగుబాట్లే కాకుండ, ఉత్పత్తి శక్తుల నిరంతర విప్లవీకరణగూడ పెట్టుబడిదారీ ఆస్తిసంబంధాలతో ఢీకొని కొత్త కొత్త సమస్యలని తెచ్చిపెట్టింది. రసాయనిక పదార్థాలనుత్పత్తి చేస్తే నదుల్లో చేపలు చస్తున్నాయి. కలప పరిశ్రమ విస్తరిస్తే వరదలు వస్తున్నాయి. అణుశక్తి ప్రయోజనాన్ని కనుగొంటె హీరోషిమా నాగసాకిలలో లెక్కలేనంత మంది ప్రాణాలుకోల్పోయారు. ఈ వర్గానికీక శాస్త్రీయదృక్పథం మీద హేతువాదం మీద నమ్మకం సన్నగిలింది. అస్తిత్వవాదం పుట్టింది. ఫ్రెంచివిప్లవ కాలంలో, ఒకనాడు మనిషి ప్రవర్తనగూడ సూత్రబద్ధమని నిరూపించవచ్చునని నమ్మిన బూర్జువా, రెండవ ప్రపంచ యుద్ధాంతానికి అస్తిత్వవాదిగామారి అసలు ప్రపంచానికే అర్థంలేదు పొమ్మన్నాడు. ఒకనాడు సార్వజనీనత గురించి, సార్వకాలిక సత్యాల గురించి మాట్లాడిన బూర్జువా తనకు వ్యతిరేకంగా తిరగబడుతున్న సత్యాన్ని చూసి దడుసుకొని 'ప్రతి సత్యము క్షణికమే' అన్నాడు ('Every truth is a truth of the moment' - ఈ మాటలన్నది Heidegger కాబోలు)

సామ్రాజ్యవాదం క్షీణ బూర్జువాయుగం కొబట్టే మార్క్సిస్టులు అధివాస్తవిక వాదంనుండి, అస్తిత్వవాదంనుండి, వాటి పుత్రపౌత్ర సమూహంనుండి పుట్టిన ఆధునిక పాశ్చాత్యసాహిత్యాన్ని క్షీణసాహిత్యమనీ, బూర్జువా సాహిత్యమనీ మాత్రమే కాకుండ, చాల శాస్త్రీయంగా క్షీణబూర్జువా సాహిత్యం అన్నారు. ఈ సాహిత్యం ఎదురుతిరిగింది బూర్జువా విలువలకు కాదు, సామ్రాజ్యవాద పూర్వయుగపు బూర్జువా విలువలయిన హేతువాదం, ప్రగతివాదం, యదార్థవాదం మొదలయినవాటికి. ఈ 'తిరుగుబాటు' బూర్జువా సమాజంలో సామ్రాజ్యవాద పూర్వయుగంనుండి సామ్రాజ్యవాద యుగానికి జరిగినమార్పుకు తాత్వికస్థాయిలోని గుర్తింపుమాత్రమే, అంటే ఆమార్పు బూర్జువా చైతన్యంలో ప్రతిబింబించబడ్డ తీరుమాత్రమే.

సురేంద్రరాజుకు చారిత్రకజ్ఞానం లేదుకాబట్టి, ఈ నికార్సయిన సామ్రాజ్యవాద బూర్జువా సాహిత్యానికీ, గతశతాబ్దంలో పెటీబూర్జువా వర్గదృక్పథమయిన కాల్పనిక వాదానికీ తేడాతెలియలేదు. అసలు సామ్రాజ్యవాదం అంటే ఏమిటో తెలియకపోబట్టే దళారీ సాహిత్యాన్ని విమర్శించేవాళ్ళకీ, పాశ్చాత్య ప్రభావాన్ని నిరసించే ఛాందసులకు తేడాలేదంటున్నారు.

అయితే ఈ క్షీణ బూర్జువాసమాజంలో 'ఉత్తమ' సాహిత్యం పుట్టదా అనిఅడగవచ్చు- మార్క్స్ ఎంగెల్స్‌లు రియాక్షనరీ అయిన బాల్జాక్‌ను మెచ్చుకోలేదా అనవచ్చు. ఇంతకీ మార్క్స్ బాల్జాక్‌ను 'బూర్జువావిలువల్ని ధ్వంసంచేసినందుకు'కాదు మెచ్చుకుంది- మార్క్స్ చారిత్రిక జ్ఞానహీనుడుకాడు, బూర్జువావిలువల్ని గర్హించే భూస్వామ్య చైతన్యాన్నిచూసి హర్షించడానికి.

వాస్తవాన్ని, అందులోని సామాజిక సంబంధాలను ఏ మాయలేకుండ (సిద్ధాంతం లేకుండ కాదు) ప్రతిబింబించే సాహిత్యానికి, చారిత్రికంగా అనివార్యమయిన మార్పును (వ్యక్తిగతంగా నచ్చినా నచ్చకపోయినా) అంగీకరించే దృక్పథానికి, ఒక విలువవుంటుంది. బాల్జాక్ సాహిత్యాన్ని తామీకారణంగానే మెచ్చుకున్నామని ఎంగెల్స్ ఒక వుత్తరంలో స్పష్టంచేసాడు. 14

ఆధునిక పాశ్చాత్య సాహిత్యంలో ఇటువంటి రచనలు లేవా అంటె తప్పకుండ వున్నాయనే చెప్పాలి- ఉదాహరణగా అమెరికన్ రచయిత జోసఫ్ హెల్లర్‌ను చెప్పుకోవచ్చు- యుగప్రతినిధిగా బూర్జువా ప్రపంచంచేత- మన దళారీ మేధావులతోసహా- స్తుతించబడుతున్న సాల్ బెల్లోకన్నా నిజానికి హెల్లర్ రచనలకు ఎక్కువ విలువవుంది. బెల్లో వాస్తవాన్ని చూడలేక నకిలీ ఆధ్యాత్మికపు ముసుగువేసుకున్నాడు- హెల్లర్ రచనలు దానికి విరుద్ధంగా వర్తమాన అమెరికా సమాజానికి చక్కగా దర్పణం పడతాయి.

చెప్పొచ్చిందేమిటంటే క్షీణ బూర్జువా సాహిత్యంలో వైవిధ్యం లేదనికాదు, విలువయిన సాహిత్యం పుట్టదనికాదు- దానిని సీరియస్‌గా పరిశీలించవలసిన అవసరం లేదనీ కాదు- అసలు శత్రువును సంపూర్ణంగా కాకుండ పైపైనే అర్థంచేసుకునేవాడు యుద్ధమేంచేస్తాడు? 'పీపుల్స్ పేపర్' పత్రిక వార్షికోత్సవ సందర్భంగా మార్క్స్ చెప్పినవిగా సురేంద్రరాజు యిచ్చిన వాక్యాల అర్థంయిదే- అంతేగాని, ఆ సాహిత్యం యొక్క వర్గస్వభావం చూడవద్దనిగాదు, వర్గపోరాటంలో భాగంగా దాన్ని ఎండగట్టవద్దనీ కాదు- అసలు ఈ ఆధునిక సాహిత్యం పుట్టిన కొత్తలోనే లెనిన్ దీనిని నిర్ద్వంద్వంగా క్షీణసాహిత్యమని ఖండించాడు. 15

చివరి మాట

మార్క్సిజం మతంకాదు, మార్క్స్ మహమ్మదు వంటి ప్రవక్త కాదు- పెట్టుబడిదారి సమాజంలోని వైరుధ్యాల నుండి పుట్టిన గతితార్కిక భౌతికవాదం మొదటిగా మార్క్స్, ఎంగెల్స్‌ల దృక్పథంలో రూపం తీసుకుంది- అయితే యిది ఒక్కరోజులో

జరగలేదు- 1848లో 'కమ్యూనిస్టు మానిఫెస్టో' రాసేకాలానికి వారి అవగాహన ఒక స్థాయికి చేరుకుంది- క్రమంగా సమకాలీన సమాజాన్ని, చరిత్రను, ప్రకృతిని విశ్లేషించడంతో మరింత ముందుకు పోయింది- అయితే ఒక విషయాన్ని విశ్లేషించాలన్నా సరిగ్గా అర్థంచేసుకోవాలన్నా దానికి సమకాలీన సమాజంలోనే ప్రేరణ వుండాలి- కాబట్టే పారిస్‌కమ్యూన్ రోజుల వరకు వర్గపోరాటానికి రాజ్యాంగయంత్రానికీ వున్న సంబంధం మార్క్సుకు సంపూర్ణంగా అర్థంకాలేదు- దీన్ని గురించిన సంపూర్ణమయిన అవగాహన 1871లో రాసిన 'సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్' అన్న రచనలో కనిపిస్తుంది- అందుకే లెనిన్ తన 'రాజ్యము - విప్లవము' అనే ప్రఖ్యాత సిద్ధాంత గ్రంథానికి ఈ రచననే ఆధారంచేసుకున్నాడు- అదే విధంగా జాతిసమస్య మార్క్స్ కాలంలో ముందుకు రాలేదు కాబట్టి (చరిత్రలో అది సామ్రాజ్యవాద కాలంలో ప్రధమంగా వుత్పన్నమయింది కాబట్టి) దాన్ని గురించి మార్క్స్ ఎక్కువగా చెప్పలేదు- ఆ పని లెనిన్ చేసాడు- ఇక సోషల్ సామ్రాజ్యవాదం ఎటువంటిదో మార్క్స్ వూహించనుకూడలేదు.

మార్క్సిజాన్ని అర్థంచేసుకునేప్పుడు యివన్నీ గుర్తుంచుకోవాలి- ముఖ్యంగా మార్క్స్ 1840లలో చేసిన రచనలను (అంటే కమ్యూనిస్ట్ మానిఫెస్టోకుముందు రాసినవి) వాడుకునేటప్పుడు చాలమెలకువతో వ్యవహరించాలి- దానికి విరుద్ధంగా సురేంద్ర రాజు గాని యితర విమర్శకులుగాని ఆకాలపు రచనలనే ప్రమాణంగా తీసుకోవడం, పైగా సందర్భశుద్ధి పాటించకుండ కొటేషన్లు గుప్పించడం చేస్తున్నారు- ఇదంతా మార్క్సిస్టులను దూషించడానికి పనికివస్తుందిగాని ప్రపంచాన్ని అర్థంచేసుకోవడానికి, మార్చడానికి నిరుపయోగం- బహుశ వారిఉద్దేశ్యంకూడ అదేననుకోవాలి.

కె. బాలగోపాల్

15-3-81

1. సృజన, జూన్-జులై, అగస్ట్-సెప్టెంబర్, డిసెంబర్ 1980
2. సృజన, అగస్ట్, సెప్టెంబర్ 1979
3. F. Engels, 'Ludwing Feuerbach and the end of classical german philosophy', Marx-Engels Selected works, P. 613, Progress Publishers, Moscow, 1970.
4. F. Engels, Letter to J. Bloch, Sept. 21, 1890. Marx-Engels Selected works. P. 683.
5. K. Marx, 'The Eighteenth Brumaire of Louis Bonaparte,' Marx-Engels Selected works, P. 96.

6. V. I. Lenin, 'Frederick Engels', Marx-Engels Selected works, P. 18.
7. "Accumulate, accumulate, that is Moses and the Prophets!" -K. Marx, Capital, Vol. I, P. 595, Foreign Languages Publishing House, Mascow, 1961.
8. Marx-Engels, 'Communist Manifesto', Selected works, P. 38 ("The bourgeoisie cannot exist without constantly revolutionising the instruments of production......")
9, K. Marx, 'The Eighteenth Brumaire of Louis Bonaparte', Marx-Engels Selected works, P. 120.
10. K. Marx, Letter to P. V. Annenkov, Dec 28, 1846. Marx-Engels Selocted works. P. 668.
11. K. Marx, 'Theories of Surplus Value', P. 291-292. Foreign Languages Publishing House, Moscow.
12. P. Baran and P. Sweezey, 'Monopoly Capital', Penguins, New Yark
13. A. G. George, 'T. S. Eliot, his mind and art,' Asia Publishing House, 1962.
14. F. Engels, Letter to Margaret Harkness, Marx Engels Selected Correspondence, p. 480, Foreign Languages Publishing House, Moscow,
15. V. Shcherbina, 'Lenin and problems of literature,' Progress Publishers, Moscow, 1974.

ఈ చర్చలో పాల్గొనదలచినవారు, ఈ చర్చను శ్రద్ధగా అవగాహన చేసుకోవలసినవారు ఆగస్టు 79 సంచికలో ఆర్. ఎస్. సుదర్శనం, 'మార్క్సు దృష్టిలో సాహిత్యం,' సెప్టెంబర్, అక్టోబర్ 79 సంచికలలో త్రిపురనేని మధుసూదనరావు 'మార్క్సిజం – సాహిత్యం,' జనవరి 80 సంచికలో సాసి, ఆర్. రవీంద్ర & మిత్రులు. జూన్ / జులై, ఆగస్టు / సెప్టెంబర్, డిసెంబర్ 80 సంచికల్లో సురేంద్రరాజు 'సాహిత్యం – మార్క్సిజం' చర్చను, వీరంతా ప్రస్తావించిన సాహిత్యాన్ని, అధ్యయనంచేస్తే ప్రయోజనకరంగా వుంటుంది. ఈ చర్చను సాహిత్యం – సమాజం సంబంధాల విశ్లేషణలో పాతకాల అవగాహనకు పదనుపెట్టేదిగా కొనసాగించాలన్నదే మా ఆశయం.

'సాహితీమిత్రులు'

సాహసం?

కొంతిగారి 'గంగజమ్మ' కథ కథాసాహిత్యంలో నిస్సందేహంగా ఒక మలుపు. నేడు తెలంగాణా ప్రాంతంలోని జనజీవితంలో జరుగుతున్న చలనం సాహిత్య కళా రూపాలను మరింత పదును పెడుతున్నాయి- సాహిత్యం కళలు ప్రజలను చేరుకోవడానికి భాష, భావం, రూపం ప్రజాపరంగా మర్పు చెందుతున్నది.... తెలంగాణా భాషలో తెలంగాణా ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను తెలుపుతూ - ఇటీవల ఆయా పరిస్థితుల్లో జరుగుతున్న మార్పుల గురించి సాహిత్యం వస్తోంది.... ప్రజల్లో నుండి రచయితలు, కవులు, కళాకారులు పుట్టుకరావడం గొప్ప ముందడుగు.

గంగజమ్మ కథ పోరాటంలోని ఒకానొక దశకు సంబంధించింది- ఈ కథలో ప్రధాన యితివృత్తం రచయిత మాటల్లో "విప్లవ చైతన్యమున్న ప్రజలు అన్ని సాంకేతిక అధునిక సౌకర్యాలు గలిగిన అభివృద్ధినిరోధక శతృవుకన్నా బలవంతులు." అనేది.... మూడు పట్టీలమేజరు అతనితో పాటు ఇరవైమంది పోలీసులు తుపాకులు ఉండికూడా ఊళ్లోఉన్న ఒక్కమనిషిని పట్టుకోలేకపోయారు.... తమ నాయకున్ని కాపాడుకోవడం కోసం ఎంత చాకచక్యంగా జనం ప్రవర్తిస్తారో మాంజి కళ్లతోనే సైగచేయటం- నర్సిగాడు పుల్లెద్దును అదిలించినట్టేపోయి, గలుమకాడి పెంటన్నకు, పాపయ్యకు కండ్లతో ఏదో చెప్పటం- ఇస్తారక్క నెగడుతగ్గించి, నారకట్టువిప్పి తడుక సందుచేసి పెట్టడం.... ఇవ్వన్నీ అతిమామూలుగా అతిచాకచక్యంగా చేస్తూ పోలీసుల కళ్లుకప్పి 'చిన్నన్నను' రక్షించుకొంటారు.... నిన్నటి వియత్నాంలో దాదాపు 2700 కోట్ల డాలర్ల ఆధునిక ఆయుధాలతో కూడా అమెరికన్ సామ్రాజ్యవాదం గడ్డికరవడం- ప్రజలు కంకబొంగులతో విమానాలు పడగొట్టడం- ఇవ్వాళ్ల సోషల్ సామ్రాజ్యవాదం కంపూచియా మీదికి వియత్నాంను, అఫ్ఘాన్‌లో తనూ దిగినా ఇంకా ప్రజలు వీరోచిత పోరాటాలు చేస్తూ ఎదురుదెబ్బతీయడం కొత్తగాదు....

అయితే ఈ కథలో బాగా ఆలోచించాల్సిన విషయం ఒకటున్నది.... ఇందులోని విప్లవకారులు గతితార్కిక భౌతిక వాదులుగా కాక 'ఆదర్శపురుషులు'గా కనిపిస్తారు.

దంపాయ గ్రామానికి అతిదగ్గరలో పోలీసు క్యాంపున్నదని తెలిసి, పట్టపగలు, దళకమాండర్ ఒక సానుభూతిపరురాలుకు వైద్యం చేయడంకోసం పోవడం ఎంత వరకు సమర్థనీయం? సమర్థింపుగా దళంలో చర్చజరిగినట్టుగారాశాడు.... ఈ చర్చంతా సమర్థింపుకోసమే జరగడం- చర్చలోపాల్గొన్న వాళ్లంతా ఆదర్శవాదులుగా మాట్లాడటం

విచిత్రం.... "ఆర్థిక రాజకీయ తదితర రంగాలతోపాటు ప్రజల వైద్య అవసరాలలో కూడా బాధ్యత పార్టీదేబౌతుంది...." ఎప్పుడవుతుంది.... ? ఆర్థిక, రాజకీయ లేదా తదితరాలు ప్రధానంగా చేపట్టి పనిచేస్తున్న దళం "వైద్య అవసరాల" కోసం అతి సాహసంతోకూడిన త్యాగానికి సిద్ధపడుతుందా ? ఒక్క అంకమ్మ అన్న పాపన్న మాత్రం "అన్నిదిక్కుల నుండి కొట్టచూసి అప్పుడు ఏదో ఒకటిచెయ్యాలి." అంటాడు.... అన్ని దిక్కులంటే ప్రమాదం గురించి చర్చసాగిందేగాని- అసలు పోవాలా ? వద్దా ? అనేచర్చ శాస్త్రీయంగా అన్నికోనాల్లోనుండి జరుగలేదు.


ప్రజల కోసం పార్టీ తప్పకుండా అవసరమైన సమయంలో సాహసోపేతమైన త్యాగాలుచేస్తుంది. కాని ఆ త్యాగానికి త్యాగంచేసే వ్యక్తి ప్రాణంకన్నా ఎక్కువ ప్రాధాన్యత ఉండాలి.... ఈ కథలో చిన్నన్న దళకమాండర్ - అంకమ్మ మామూలు సానుభూతిపరురాలు....అంకులు కంటె చిన్నన్న ఉద్యమానికి ఎంతో విలువైనవాడు.... అంకులు లాగా కోటానుకోట్ల ప్రజానీకం దోపిడి రోగగ్రస్తులై చితికిపోతున్నారు. అంకమ్మపోతే ఒక సానుభూతిపరురాలు కరువౌతుంది. కాని చిన్నన్నపోతేనో ; ఏ ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంఘిక అవసరాలు తీర్చడానికి పోరాటం చేస్తున్నారో ఆ పోరాటం ఎంతో కొంత కుంటుపడుతుంది.... అంటే నష్టం ఎక్కువ....

మావోను ఎడ్‌గార్‌స్నో అతని బంధువుల దుస్థితి గురించి ప్రశ్నిస్తాడు. "చైనా దేశపు కోటానుకోట్ల ప్రజల్లో నాబంధువులు ఉన్నారు. అందుకేగదా ఈ యుద్ధం." అంటాడు మావో.... కనుక కొనసాగించవలసిన ప్రజాయుద్ధం ప్రధానమైంది.... విప్లవకారుడి ప్రాణం హిమాలయాలకంటె బరువైంది. విప్లవకారుడి త్యాగం ప్రజా యుద్ధాన్ని ముందుకు తీసుకపోయేదిగా ఉండాలి.... టాటూనది వంతెన మీద వీరుల త్యాగం చైనాదేశపు కోట్లాది ప్రజానీకపు విముక్తి యుద్ధంలో అతికీలకమైంది.... దళం ప్రజలకోసం తప్పకుండా ప్రజలకోసం వీరోచిత త్యాగాలుచేస్తుంది.... కాని ఆ త్యాగం యుద్ధాన్ని ముందుకు తీసకపోవడానికే అయితే.... దళంలో ఈ చర్చ అత్యంత ప్రధానంగా జరుగాల్సింది....


ఇకపోతే కథకు ముందువాడిన వర్ణన అస్పష్టంగా ఉండి పెద్దగా ఉన్నది.... ప్రజాకథలు తీరికగా చదువుకునేవి కాదు.... వర్ణనసీనుతో పాటు చలనంలో ఉండాలి. నిశ్చలంగా కథకేమి సంబంధం లేకుండా ఉంటే బోరు కొడుతుంది....

రచయిత అవగాహనలోని ఈ లోపాలను సవరించుకోవాలని- ఈ రచయిత ముందు ముందు మంచి మంచి కథలు రాయగలడనే ఆశతో....


- ముత్యం కేశవరావు



సృజన ప్రచురణ ఇంద్రవెల్లి కవితా సంకలనాన్ని రాడికల్ యువజన సంఘం మూడవ మహాసభల్లో ఆవిష్కరిస్తున్న ఆదిలాబాద్ గిరిజన రైతుకూలి సంఘం ప్రతినిధి కామ్రేడ్ కుర్సింగ్ రాము.



ఆదిలాబాద్ జిల్లా గిరిజన రైతుకూలి సంఘం మహాసభ పోస్టర్



నిన్న బహిరంగసభపోస్టర్– ఈ రోజు దాని మీదే జరగనివ్వని సభకు వచ్చి
మృతులైన గిరిజన రైతు కామ్రేడ్స్‌కు సి పి ఐ (ఎం ఎల్) పీపుల్స్‌వార్
అరుణారుణ జోహార్లు

ఇంద్రవెల్లి ఆకాశం
గిరిజన మృతవీరుల రక్తంతో ప్రతిఫలిస్తున్నది-
నిశ్శబ్దంగా రోదిస్తున్నది-
వీస్తున్న గాలి నెత్తురువాసన మోస్తున్నది-

o o o

బాయ్‌నెట్ కొసలకంటిన నెత్తురులోంచి
గాయాల్లో నుండి పారిన, పొరలిన రక్తంలోంచి
నిర్జీవమైన గుండెల్లోంచి
శాంతి పునరుద్ధరించబడింది-
అవును !
పీనుగలు మాట్లాడలేవు ఎలుగెత్తి అరవలేవు-
ఇకమీదట శాంతికి అర్థం
తుపాకుల్తో కాల్చేయడం.
ఒకటి.... రెండు.... మూడు....
ముప్పై.... మూడువందలు

ఇంద్రవెల్లి

వీలైతే జనాభాలో మూడొంతుల మందిని కాల్చెయ్యండి
శాంతి శాశ్వతంగా పరిఢవిల్లుతుంది

o o o

భూస్వామి భూమి ఐదెకరాల నుండి
నూరు ఎకరాల దాకా ఎదిగింది-
వడ్డీవ్యాపారి ఏకులావచ్చివోడు మేకైండు,
బొక్కసం బంగారంతో నిండింది-
చివరికి ఫారెస్టు వాచర్ సైతం
కోళ్లను గొర్లను లాక్కెళ్లిండు
సర్కారు - సేద్యమైనభూముల్లో తుమ్మలునాటిండ్రు
భూస్వామికోసం- వడ్డీవ్యాపారికోసం
ఫారెస్టర్లకోసం- పోలీసులు
గూడాలకు నిప్పుపెట్టిండ్రు
మహిళలను చెరబట్టిండ్రు
బందిఖానాల్లో బందీలుచేసిండ్రు

నిజంగా–
అంతా శాంతిగానే జరిగింది–

o o o

చాన్నాళ్ళు–
గిరిజనుడు అమాయకుడుగా, నిస్సహాయుడుగా
మౌనాన్ని మింగి, వేదననుభవించి
పేలబోయే పర్వతంలాగా వుండేవాడు–
పుడమితల్లి కోసం – ఆత్మరక్షణ కోసం
హక్కుల కోసం–చెల్లెళ్ళ భార్యల మానప్రాణాలకోసం
పోరాడ్డం నేర్చుకున్న తర్వాత
ఇక్కడ శాంతి భంగపడింది

o o o

శాంతి తర్వాతి దృశ్యం....
ముసలవ్వలు రానిపడుచు కొడుకుల కోసం
దుఃఖిస్తున్నారు– దుఃఖానికి భాషలేదు
శాంతి కోసం ఇక మేకలు కాదు
రక్తం పంచుకు పుట్టిన కొడుకులవంతు
వ్యాన్లు, పోలీసులు, తుపాకులు–
ఊరకుక్కలు– తెల్లధోతుల
భూస్వామి వడ్డీవ్యాపారి స్నేహితంగా
బజార్లన్నీ తిరుగుతూనేవుంటారు పోటీగా–
బజార్లు నిశ్శబ్దాన్ని మోస్తుంటాయ్ కొన్నాళ్ళదాకా–

o o o

చరిత్రపుటల్లో,
ఆదిలాబాద్ గిరిజనుడు కొత్త అధ్యాయాన్ని
తనరక్తంతో దస్తూరీ చేశాడు–
నిజం–
ఇవ్వాల్టి శాంతిఅంటే
ఎక్కుపెట్టబడ్డ తుపాకి అనిఅర్థం
కేవలం తుపాకులే గిరిజన మృతవీరుల
ఆశలను ఆవాహన చేస్తాయి–

o o o

ఇక ఇప్పుడు ఇంద్రవెల్లి ఆకాశం
కన్నీళ్ళను కసిగా మలుచుకునే
శాంతికపోతం–

— ఎ. ఎన్

రగల్ జెండా

ఎస్.కె.

తడిసి తడిసి నెత్తురైన జెండా ఒకటి
నీ పేదదీర్చి నీకు నీడపడుతుంది
ఆ జెండాదే అయిన సుదీర్ఘ పోరాటచరిత్ర
ప్రేమతో నీశిరసునెప్పుడూ ముద్దాడుతుంది
నువ్వు కోలుకుంటావు
గడ్డకట్టిన నిశ్శబ్దంపగిలి
పెగిలి పెగిలిఏడ్చి పూడ్చివేయబడుతుంది
ఆ తడిమీద
నువుకొత్తగా తిరిగి మొలకెత్తుతావు
తడిసి తడిసి నెత్తురౌతున్న జెండా
ఎగసిఎగసి ఆజెండాగాలులు
మన్నంటి
నినువెన్నంటి వస్తూనేవుంటాయి
నువ్వు తెప్పరిల్లుతావు
తేటపడుతావు
తేరుకుంటావు
పోయినవాళ్ళజాడల్ని పోరాటంలో పోల్చుకుంటావు

అడవివాసివి
ఆదిమవాసివి
గాయపడ్డమానవతవు
దెబ్బకు దెబ్బతీసే స్వభావమేకాని
దెబ్బతినడం నీరక్తంలోలేదు

నీకు దూరంగా
నీ అనుభవానికి జీవితానికి విసిరేసినట్లున్నా
నీతో పెనగొన్నాను

ఔను నిజమే
ఆత్మీయత పోగొట్టుకున్న శోకంలోనో
అలవిగాని ఆనందాతిరేకంలోనో
కళ్ళు చెమరుస్తాయని
భోరున ఏడుస్తాయనితప్ప

'గ్యాసుగోళీ'లుపగిలి కళ్ళనీళ్ళవుతాయని
నెత్తుళ్ళవుతాయని తెలియనివాడివి నువ్వు

హానిజేస్తేతప్ప
అడవిమృగాన్ని తరిమి తరిమి
వేటాడని వాడివి నువ్వు
చెట్ల మీదినుంచో
గట్ల మాటునుంచో
చెప్పా పెట్టకుండా ఎక్కుపెట్టిన తుపాకులు
వెదికి వెదికీ వేటాడుతాయని ఎట్లా అనుకుంటావు ?

నీ చుట్టూ చక్రబంధం వేసివుందని
అది అప్పటి కప్పుడే అయింది కాదని
ఎన్నో రోజులుగా పన్నిన కుట్రని
ఎట్లా అనుకుంటావు నువ్వు !
నిన్ను మోసుకొచ్చిన వార్తల్ని చూశాను
వార్తలు పాతవాసనేస్తున్నయ్

నీ సంక్షేమం రోడ్లలో
అశోక ధర్మం కన్పిస్తున్నది
చక్రాల పరుగు విన్పిస్తున్నది

నీ అభ్యున్నతి పథకంలో
బుద్ధునిధ్యానం
మహాత్ముని ఉద్ధరణ మోసగిస్తున్నది

అయినా భయంలేదు
చింతలేదు
బతుకుమీద భవిష్యత్తుమీద
మీ మీద
అచంచల విశ్వాసంవున్నది
సిద్ధాంతంపిడిలో ఇమిడి చంద్రవంక
కొడవలిదై, సుత్తెను గుండెలకుహత్తుకొని

ఇంద్రవెల్లికి పూర్వరంగం :

ఎదలబాధ

నక్సల్‌బరి శ్రీకాకుళం
కరీంనగర్ ఆదిలాబాద్
ఇవి పేర్లు కావు- పోరాటాలకు సంకేతాలు

ఆదిలాబాద్ ఈ పేరు ఎలా వచ్చిందోకాని నిజంగా ఎదలబాధకు ఆదిలాబాద్‌కు సారూప్యంవుంది అసలు జనం పిలుపు ఎదలబాధ....

ఎదలబాధ రగిలిందిర జంబాయిరే
ఆదిలాబాద్ కదిలిందిర జంబాయిరే
కొండ కోనల్లోన జంబాయిరే
గోండు మండిండురా జంబాయిరే

ఆదిలాబాదు కొండ కోనల్లోని గోండు కొలామ్‌ల గూర్చి తెలుసుకోవాలి. ఇది ఏడుపుకాదు.... వల్లకాడు కాదు దీన్ని మీరేమైన అనండి. ఇవ్వాళ మొదలుకావాల్సింది అక్కడి నుంచే. వల్లకాట్లో ఎన్నికథలు.... ధైర్యంవుంటే రండి ఇక్కడ వల్లకాట్లోని అస్థికలే ప్రశ్న కొడవల్లనెత్తుతున్నాయి. వినండి.... నిన్నటికి వాళ్ళు మృతజీవులు, ఇవ్వాళ వాళ్ళు విప్లవిస్తున్న వెలుగురవ్వలు....

కొండలు కోనలు వాగులు వంతలు దట్టమైన అడవులు ఎదురుగా గోండు గూడెంలోంచి ఏదో గీతం విన్పిస్తుంది. నిర్మల ఆకాశపు నీడకింద ఎన్నెట్లో ఆ ఆకారాలు ఈ చీకటి బతుక్కి చెల్లుచీటీ ఇవ్వాలని, చీకటికి ఉరేయ్యాలనుకున్నట్లుగా వర్తులాకారంలో తిరుగుతూ, గెంతుతూ దగ్గరికి వస్తూ మళ్ళీ దూరమయిపోతున్నారు. ఆ గొంతుల్లో విషాద గీతం ఏమిటి? దాని భావమేమిటి? విషాదంగా విన్పిస్తున్న గీతంలాలేదు.

నిశ్శబ్దం, విషాదం రెండూ భయంకరమైనవి....
ఆ విషాదం వెనక క్రోధం కన్పిస్తూన్నది

రేల రేల రేరేలా రేలా / రేల రేల రేరేలా రేలా
రేల రేల రేరేలా రేలా / రేల రేల రేరేలా రేలా

తొత్తురాజోరా జండా / మొదలు రాజోరి జండా
ఇందికేడు ముందు రంకున చౌరంగ్ జండా / ఇప్పుడు మూడురంగుల నాలుగుమూలల జండా రేలరేల రేరేలా రేలా-

తెలంగన్ వాడీ వాతవాత / తెలంగాణ గాడుపు వచ్చివచ్చి
జండాటోత్తో టోత్తోయాత / జండా వాలివాలి పోయింది
రేలరేల రేరేలారేలా-
కలన్‌వాడి వాతవాత / మరట్‌వాడా గాడుపు వచ్చివచ్చి
జండాటోత్తో టోత్తోయాత / జండా వాలివాలి పోయింది
రేలరేల రేరేలా రేలా-

చంద్రపూర్ రాజధానిగా గోండుకొలామ్ తమ జాతిజండా ఎరుపురంగుది ఎగిరేసి రాజ్యం చేసుకున్నారు- ఆ తరువాత నైజాం తెలంగాణ ప్రాంతాన్ని పాలిస్తున్నాడు చంద్రపూర్‌ను కైవసంచేసుకున్నాడు అందుకే తెలంగాణగాడుపు జండాను వాల్చిందని నిరసన. కలన్‌వాడి (మహారాష్ట్ర) జెండావచ్చి జండానువాల్చింది- అంటే బ్రిటిష్ జెండావచ్చి గోండు కొలామ్ జెండాను అందే కాంగ్రెస్ జెండావచ్చి గోండు కొలామ్ జెండాను వాల్చింది. ఆజాతి రాజ్యాధికారాన్నికోల్పోయినామని విలపిస్తున్నది- అడవుల్లో స్వేచ్ఛగా విహరించేకాళ్ళకు సంకెళ్ళు.. పోడుగొట్టి వ్యవసాయం చేసుకుందామనుకున్నా అధికార్ల ఉక్కుపాదాలు చౌకీదార్లు శేరేదార్లు జంగ్లాత్‌వాళ్ళు- వాళ్ళవెనక పోలీసులు తుపాకులు, జైళ్ళు. పోడుచేసిన ఎందరు జైల్లకెల్లినారో జంగ్లాత్ అధికార్ల చూపుల్లో ఎన్ని గూడాలు కాలినాయో అధికారపు రక్కసి ఎందరిరక్తం తాగిందో లెక్కలేదు- బాధలకు పరిష్కారం కావాలి.... ఆ బాధల్ని తలపోస్తున్న గిరిజనులు బాధలపల్లవికి ఈ చరమగీతం పాడాలనుకుంటున్నారు- అన్నికోల్పోయిన వారికసి.... ఈ పాటలో విన్పిస్తున్నది.... తాంబురలాంటిదే మీటుతూ గొంతెత్తి పాడుతున్నారు.

చాందదీ ఉమ్‌తేర్ / వెండిని గుంజిండ్రు
సోనేటీ ఉమ్‌తేర్ / బంగారం గుంజిండ్రు
పిత్తుడుటీ ఉమ్‌తేర్ / రాతెండి గుంజిండ్రు
కాగటీ ఉమ్‌తేర్ / కంచు గుంజిండ్రు
గరీటోంకా ఫాసీకీతోర్ / గరీబోల్ల రక్తం తాగిండ్రు
ఓర్ లూటీకేసి బడేమత్తోర్ / వాళ్ళుదోపిడిచేసి పెద్దగయిండ్రు
ఉకుమత్ టీ ఉమ్‌తేర్ / అధికారం గుంజిండ్రు
బాండేటీ ఉమ్‌తేర్ / తుపాకుల్ని గుంజిండ్రు
తల్వార్ టీ ఉమ్‌తేర్ / కత్తులన్ని గుంజిండ్రు
గుంతిటీ ఉమ్‌తేర్ / బాణాల్ని గుంజిండ్రు

కాంగ్రెస్‌పార్డీ బనికేతేర్ / కాంగ్రెస్‌పార్టీ తయారు చేసిండ్రు
గరీబోంక్ బాయి సతావీకేతేర్ / గరీబోళ్ళనులావు తిప్పల పెట్టింద్రు
కోపన్‌బీ తెండ్‌తేర్ / రేషన్‌కార్డు తీసిండ్రు
తావన్‌బీ తెండ్‌తేర్ / తావన్‌డ్లను తీసిండ్రు
డగ్గర్ లోకోరే డగ్గరాంతేర్ / పెద్దలోకులే పెద్దగయిండ్రు
మాకే సాయివర్ వర్తువాతా / మాకే సచ్చేకాలమొచ్చింది
లబడ్ గోష్టి కీతేర్ / కల్లేమాట చేసిండ్రు
వోటాబీ ఉమ్‌తేర్ / ఓట్లన్నీ గుంజిండ్రు
కుర్చీథగా ఉచ్చిమంతోర్ / కుర్చీమీద కుసోనున్నడు
నోదతొడ్డితోనే ముడ్డికేతోర్ / వాడునోటినిముడ్డిచేసిండు

1. నాలిక కాదు అది తాటిపట్ట అనే సామెతకు సమానంగా ఆదివాసులు వాడే సామెత.

వర్షాకాలం వరదలు– ఎండకాలం ఎండలు నీటిబొట్టు దొరకడం కష్టం.... విపరీతమైన చలి....నెగడు దానిచుట్టూ పడుకోవడం– ఎందరి శరీరాలపైననో కాలివున్న గుర్తులు.... కష్టించే కూలిరైతుకు– భూస్వామికి, కార్మికునికి– పెట్టుబడిదారికి బ్రతుకుల్లో తేడావుంది– మైదానప్రాంతంవాడికి– అడివిలోవున్న వాడికి జీవనవిధానంలో తేడావుంది–

అడవిలో పూచికపుల్ల ముసితే లంచం
గుడిసె[!] వేసుకుంటే లంచం
గడ్డికోసి అమ్ముకుంటే లంచం

మంచెపట్టి, నాగల్‌పట్టి సేప్ నావారి (అంటే పంటలమీద కొన్ని పండిన దినుసుల్ని కానుకలుగా ఇవ్వాలి....)

గూడెంకి వచ్చినప్పుడు చౌకీదార్ హడావుడి హంగామా జులుం

ఈ పాట ద్వారా వ్యక్తమౌతుంది....

నీళ్ళేకరువు – కడవల కొద్ది నీళ్ళు కావాలి.... చౌకీకి

పండగకన్నా అన్నం వండుకోరు అదే ఘాటోమిర్కుటి (గటక కారం) వద్దు అన్నం పెట్టాలి....

ఇన్ని చేసినా వాళ్ళ ఘాతుకాలకు అంతులేదు రుక్కుబాయి పసిబిడ్డ ప్రాణాలు ఎందుకు పోయాయి? ఎడ్లుకట్టెయ్యడానికి గుడి ముందు పందిరి వేసుకుంటే దొంగ

కట్టెతెచ్చావని పందిరిపీకేస్తుంటే పందిరికింద పన్న పసిబిడ్డ ప్రాణాలుపోయాయి. చౌకీదారులనే దేవుళ్లను బ్రతిమాలుతున్నారు ఆ దంపతులు. బిడ్డను కోల్పోయారు అప్పుడే.... ఆ దేవుళ్లు పసిబిడ్డ ప్రాణాల్ని తీసుకున్నారు.

మంట శరీరాన్ని కాల్చుతుంది,

జులుం గుండెల్ని కాల్చుతుంది....కసిగా ఆ గుండెలు మండినప్పుడు కాలేదెవరు? ఉండడానికి గుడిసె వేసుకున్నందుకు గొడ్లుగోదాఅమ్మి భూమి రైనుపెట్టి రెండువేల రూపాయలు చౌకీదార్లకు లంచం ఇచ్చుకున్నాడు మాడనిమారు. ఇలారాస్తూపోతే ఎందరో.... గుడిసె, నాగలి, మంచె, నెగడుకట్టె ఇవేకావాలి అతనికేంవద్దు....

దాయికావాలి చౌకీకి.... పసిపిల్లలకన్న ప్రాణంగా పెంచుకున్న కోళ్లు జంగ్లాతోళ్ళపాలు.

అడవిగడ్డలు, విప్పపువ్వు, పండ్లతో కాలంగడిపి పురుగుబూసిలో పనిచేస్తే.... ఆపైన చౌకీదార్ల జులుం....

చివరకు ఓటర్‌లిస్టులో పేర్లు నమోదుచేసే ఎన్యూమరేటర్లకు ఓటర్లు అఠానా లంచంఇవ్వాలి !

మనమెంతకాలం బాధలుపడిన
దోపిడిమూకకు దయరాదన్న
దోపిడిమూకల పీడసతోడ
బతికిసచ్చిన భేదమెలేదు
బాధలగాయాలే ఆ గీతానికి చరణాలు
కష్టజీవి కన్నీళ్లే ఆ గీతానికి పల్లవి
కవిలేడు ఆపాటకు కదిలిపోతున్న జనంవున్నారు
ఆకవిపేరు ఆవేదన, ఆక్రందన
రేలరేల రేరేలారేలా
రేలరేల రేరేలారేలా
రేలరేల రేరేలారేలా
రేలరేల రేరేలారేలా
ఇద్‌బగటా చౌకీదారల్ వాతేర్/
    వీడెక్కడి చౌకీదార్ వచ్చె
ఇద్‌బగటా శేరేదారల్ వాతేర్/
    వీడెక్కడి శేరేదార్‌వచ్చె

కుర్సిలావ్ అంతేరు / కుర్సితెమ్మోనంటాడే
నన్‌బాయి వోజన / నేనేమిసేతు
కుర్సిలావ్ ఇంతేరు / కుర్సితెమ్మోనంటాడే
బగటాకుర్సి ననుసీకోనే / ఎక్కడికుర్సి ఇయ్యాలే
నన్‌బాయివోజన / నేనేమిసేతు
బగటాకుర్సి ననుసీకోనే / ఎక్కడికుర్సి ఇయ్యాలే
రేలరేల రేరేలారేలా

పానీలావో ఇంతేరు / నీళ్ళుతెమ్మోనంటాడే
నన్‌బాయి వోజన / నేనేమిసేతు
పానీలావో ఇంతేరు / నీళ్ళుతెమ్మోనంటాడే
బగటాపానీ నన్‌సీకోనే / ఎక్కడినీళ్ళు ఇయ్యాలే
నన్‌బాయి వోజన / నేనేమిసేతు
బగటాపానీ నన్‌సీకోనే / ఎక్కడినీళ్ళు ఇయ్యాలే
రేల రేల రేరేలా రేలా

చాయిలావో ఇంతేరు / చాయి తెమ్మోనంటాడే
నన్‌బాయి వోజనా / నేనేమి సేతు
చాయిలావో ఇంతేరు / చాయితెమ్మోనంటాడే
బగటాచాయి నన్‌సీకోనే / ఎక్కడిచాయి ఇయ్యాలే
నన్‌బాయి వోజనా / నేనేమిసేతు
బగటాచాయి నన్‌సీకోనే / ఎక్కడిచాయి ఇయ్యాలే
రేలరేల రేరేలా రేలా

పెరిక్ లావో ఇంతేరు / (వరిఅన్నం) తెమ్మోనంటాడే
నను బాయి వోజనా / నేనేమి సేతు
పెరిక్ లావో ఇంతేరు / వరిఅన్నం తెమ్మోనంటాడే
బగటా పెరిక్ నన్ సీకోనే/ఎక్కడి వరిఅన్నం ఇయ్యాలే
నన్ బాయి వోజన /నేనేమి సేతు
బగటాపెరిక్ నన్‌సీకోనే / ఎక్కడివరిఅన్నంఇయ్యాలే
రేలరేల రేరేలారేలా

ముర్గిలావో ఇంతేరు / కోడిని తెమ్మోనంటాడే
నన్‌బాయి వోజనా / నేనేమిసేతు

రగల్‌జెండా

యుగ యుగాలుగా కోల్పోయిన స్వేచ్ఛని మళ్ళీ తెచ్చుకోవాలని... .... గోండు యువకుడు సంఘ నిర్మాణం చేపట్టి ముందడుగేస్తున్నాడు. గొంతెత్తి కొత్త గీతాన్ని పాడుతున్నాడు.

మావారాజ్యం తరువల్ / మరట్‌సాత్తేకి సాయివటే
మన రాజ్యం లేవడానికి / మనం చస్తేచస్తేమాయె
ఖాండిర్‌కు సుఖం వాయానా / సాయివట్ సొక్కుట్ మందానా
చిన్నపిల్లలకన్నా సుఖం రావాలే / బతుకు మంచి గుండాలే

నిజమే ఎన్ని తరాలుగా ఈ బానిస సంకెళ్ళు మనతోనే వస్తున్నాయి, తెగాలి.... ఇంకా.... ఇంకా.... తెగాలి....

నెలంజు పొద్దు బదిలే మాయిమాకి / సూర్యుడు చంద్రుడు మారలేదు.
బద్‌లే మాయిమాకి ధరత్‌రే / మారలేదు భూమి
సర్కార్ బద్‌లే మాల్తోర్ / సర్కార్ మారింది
అది వాసినే ఫాసే కేతోర్ / ఆదివాసుల రక్తం తీస్తోంది
ఆది వాసి లాసి ఖానూన్ తెందుతోర్ / ఆదివాసుల కొరకు ఖానూన్ తీసిండ్రు
దగ్గర్ డగ్గర్ పైసా సూద్‌తోర్ / పైసున్న పెద్దోలనే సూసిండ్రు
తొడ్డితానే ముడ్డికేతోర్ / నోరునే ముడ్డి చేసిండ్రు
అది వాసినే పాసికేతోర్ / ఆదివాసుల రక్తం తీసిండ్రు
మావా నీషాని రగల్‌జండా / ఎర్రని గుర్తు మన జండా

మురగిలావు ఇంతేరు / కోడిని తెమ్మనంటాడే
బగటా మురిగినన్ సీకోనే / ఎక్కడి కోడిని ఇయ్యాలే
నన్ బాయి వోజనా / నేనేమిసేతు
బగట మురిగి నన్ సీకోనే / ఎక్కడి కోడిని ఇయ్యాలే
రేల రేల రేరేలా రేలా

కటుల్ లావో ఇంతేరు / మంచం తెమ్మనంటాడే
నన్‌బాయి వోజన / నేనేమిసేతు
కటుల్‌లావో ఇంతేరు / మంచం తెమ్మనంటాడే
బగటా కటుల్ నన్‌సీకోనే / ఎక్కడిమంచం ఇయ్యాలే
నన్‌బాయి వోజనా / నేనేమిసేతు
బగటాకటుల్ నన్‌సీకోనే / ఎక్కడిమంచం ఇయ్యాలే
రేల రేల రేరేలా రేలా

ఆ కొండకోనల్లోని గిరిజనుల కథలు ఎన్నని ఏకరువుపెట్టను- హద్దులేనన్ని గాధలు....

అది వేసవికాలం సూర్యునితోపాటు మేము ప్రయాణం చేస్తున్నాం- అడవి అందంగావుంది- నిశ్శబ్దంగా భయంకరంగా వుంది- గంభీరంగావుంది- ఎత్తయిన కొండలు.... ఆ కొండల్నిచూస్తే మానవమాత్రులు ఆ కొండలపైన ఉన్నారని, ఉంటారని. వూహించలేం- అక్కడ అడవివుంది ... మనుషులు ఉన్నారు- విశాలమైన మైదానప్రాంతాలుండగా అక్కడుండడం ఏంకర్మ ? నిజమే- కాని వుంటున్నారు. వాళ్ళ ముద్దుపేర్లు గిరిజనులు- ఆదివాసులు- సేద్యయోగ్యమైన భూముల్ని బీడుగా మార్చి ఆనందించే మనుషుల్ని హిరాణ్యాక్షుల్ని మనం రోజూచూస్తున్నాం. మరి ఇక్కడ చెట్టుచెట్టుకు బుక్కెడు నీళ్ళుతాగుతూ అడవినరికి- రాళ్ళురప్పలుఏరి నలాల పంటదీసేవాళ్ళు నువ్వులు- కందులు- జొన్నలు- ఒంటికి వెచ్చదనాన్నిచ్చే నూబు

నేటి నీషాని మంతాముండా / ఎద్దునుతినే ముండా1 ఇవ్వాళుంది
మురాన తన్ వన్ సుట్టికేంటు ముండా / ఎద్దును తినే ముండాను ఇడిసి
మల్ల జండ తహరో తహనా గొండా / మళ్లజండను ఎత్తర ఎత్తు గొండా
జండా నిలువల్ వక్తు వాతా / జండా నిలిచే కాలం వచ్చింది
మాక్ బహన్ బేశాల్ వాంతా / మాకెట్లా కోపం వస్తుందంటే
సందర్ ఉంది ఆకట్ / అందరం ఒక్కటి కావాలే
కయిద రగల్ జెండా పీకట్ / చేతుల ఎర్రజండా పట్టాలి
మావా సంఘం ఓంది కేకట్ / మన సంఘం ఒక్కటి చెయ్యాలి
దుస్రా పిసువల్ తరువల్ తెదట్ / కొత్త బతుకు తేవడానికి లేవాలే

గోండు రాందాసు జనం గుండెల చప్పళ్లను పాట పాడుతున్నందుకు.... ఆ విధంగా ఆలోచిస్తున్నందుకు ఇనుప ముక్కుల కాకులు, గద్దలు రెప్పల చట్టం కట్టుకొని చెట్టుచెట్టు పుట్టపుట్ట గాలింపు.... ఇవ్వాళ ఆదివాసులు పడుతున్నది జాతిజండా కాదు పోరాట జండా....

అతను మేల్కొన్న గిరిజనుడు
అతని ఊపిరి పెనుతుఫాన్
అతని చూపులు కత్తి మెరుపులు
ఎత్తిన చేతులు వజ్రాయుధాలు....

అందుకే ఏలికలకు గుండెల్లో భూకంపాలు- పడానాకాయిదా (పాత సాంప్రదాయం) నిరసిస్తూ పునాకాయిదా (కొత్తకాయిదా) కొమురం భీము పోరాట సాంప్రదాయాన్ని కొనసాగించాలనుకుంటున్నారు కోలాములు, గోండులు.

[ముండా1— దేవరకాడి కొయ్య జండా పోయినంక గుర్తుగా పెట్టారు పండగ రోజున దానికి ఎద్దును కోసిపెడతారు]

పోగుకు కావల్సిన పత్తి- అన్నిపండిస్తూ అమాయకంగా అనాగరికంగా చదువు- సౌకర్యం ఏదీలేక, అన్నిహంగులతో బతుకుతున్న 'నాగరికుని'కి వేలసంవత్సరాల తేడాలో బతుకుతున్న వాళ్ళు- పాటిమానవుని ధైర్యాన్నిచూసి కనీస బాధ్యతగా ఎంచిన మేము వాళ్ళదగ్గరికి ప్రయాణం చేస్తున్నాం.

ఎట్లాగైతేనేం ఆ కొండని మూడుతడవలు అరగంటకొకసారి ఆగుతూ, వగరుస్తూ ఎక్కేశాం- విశాలమైన భూభాగం నాలుగుకిలోమీటర్ల వ్యాసార్థం కల్గివుండవచ్చు దీన్ని గోండు కొలామ్ భాషలో చెప్పాలంటే పటార్ అంటాడు- పెద్దపెద్దచెట్లు- మధ్యలో చిన్నదారి- మాచుట్టూ మాకన్న ఎత్తుగాపెరిగిన గడ్డి- గూడెం చివరగావుంది అంటే కనీసం మేము ఇంకా 4 కిలోమీటర్లు నడవాలి- మా తలలవద్ద ఒకరకమైన ఈగలు "జూమ్"మంటూ మావెంటే వస్తున్నాయి. అడవుల్లో, గుట్టల్లో, తుప్పల్లో తిరిగేవ్వుడుఅవిమామూలు- ఆ సంగీతం- రోతగావుంది- ఆగివస్తూన్నప్పుడు మాత్రం- సరదాగా వుంటుంది- నడుస్తున్నమాకు దార్లో పగిలిన పెంకులు- రక్తంమరకలు- కనిపించాయి- "ఏమిటి రక్తంమరకలు పగిలినపెంకులు" అనుకుంటునే రెండు పగిలిన రక్తపుపెంకుల్నితీసా- దగ్గరగా చూస్తున్ననాకు అదిఏదో చెప్తున్నట్టుగా అనిపించి చెవిదగ్గర పెట్టుకున్నా.

చిన్న చేదబాయి లేక ఈ పటార్‌మీద వీళ్ళు ఎన్నోఏళ్ళుగా ఇట్లాగే నీటికోసం యుద్ధం చేస్తున్నారు- ఈ పటారేకాదు ఏపటారైన అంతే. ఈపటార్‌మీద వర్షాకాలం నీటికి కొదవవుండదు చలికాలం ఎండకాల వీళ్ళు నీటికోసం యుద్ధంచెయ్యాలి.

పిల్లాజెల్లా ముసలి ముతకా అందరు, నీటికోసం- చీకటితోలేచి కొండమీదనడచి సూర్యోదయానికల్లా గుట్టదిగుతారు- అక్కడ బండలసందుల్లో చిన్నచెలిమె ఊట అవి ఊరినాకొద్దీ నింపుకోవాలి- స్నానం ఆ కాలంలోవాళ్ళు స్నానంచేసిన రోజు మహదానందమే- ఉదయం తీసుకెల్లిననీరు గొడ్లకి- వంటకి- తిరిగి సాయంత్రం అదేయాతన లేకుంటే వస్తు.

అట్లాగే నిన్నటిరోజు సాయంత్రం నీళ్ళుతీసుకొని గుట్టెక్కారు- ఆత్రం సుక్కబాయి చూలాలు- అలుపుతో ఆయాసంతో ఇక్కడ కూర్చుంది. అందరు ముందుకు వెళ్ళిపోయారు- ఆకాశంమీద చంద్రుడు మబ్బులో దాక్కున్నాడు. నీడ వెలుతురులా ఛాయలు.

ఆమె ఏడుస్తూంది- కడుపుమంటతో కన్నవారిని తిట్టింది- కట్టుకొన్నవాడ్ని తిట్టింది- జులుంతో పన్నులుగుంజే సర్కార్‌ను సత్తెనాసయిపోను అని శాపనం పెట్టింది.

ఏదోఅలికిడి. అటుచూసింది- గుడ్డేలుగు. అరిచింది- పెడబొబ్బలుపెట్టింది- లాభంలేదు- కొట్లాడింది- రాయిరప్ప ఏదిదొరికితే అదివిసిరింది- కొరికింది. వాడి గోళ్ళు కండల్నిపీకాయి- పుర్రెమీద కొట్టింది- అప్పటికే ఆయుద్ధభూమి రక్తసిక్తమయింది- గుడ్డేలుగు కొట్టినదెబ్బకు పొట్టపగిలి కడుపులోబిడ్డ, రక్తంముద్ద నేలతల్లి ఒడిలో పడింది- అది ఘోరమైనచావు....

గూడెంకదిలింది సొప్పులతో 1 ఆ ఎలుగుల్లో కుండ నీళ్ళు- బయటపడ్డ పసిగుడ్డు- పుర్రెపగిలి అత్తింసుక్కు. అరిచారు. ఏడ్చారు- ఇది మామూలు. తమజాతి యుగాలుగా అడవుల్లో జంతువులతో యుద్ధంచేస్తూనే బతుకుతున్నది....

నా కళ్ళల్లో నీళ్ళు పెంకులమీదపడ్డాయి- తడయిపోయింది. పెంకులు స్పందించడం మానివేశాయి- ఆ రెండిట్ని జేబులోవేసుకుని నడక ప్రారంభించాం....

గూడెం ఐదారు ఇండ్లుఉన్నాయి.

అలికిడిలేదు- నిన్నటి భయంకరమైన రోజును మరవలేదు, వాళ్ళకళ్లల్లో ఎర్రజీరలు.

బావి తవ్విస్తామని బ్లాక్‌వాళ్ళు లంచంతీసుకున్నారు- కాని బావిలేదు. బావిపడదు కిందికెల్లిపోండి అన్నారట. నిజమే ఆమాటతోపాటు గుడిసె, ఇంతభూమి కింద చూపితే బాగుండేది.

ఇన్నేళ్ళు తహసీల్ వసూలుచేసే ఈ సర్కార్ ఒకచిన్న చేదబావి తవ్వించలేదా? వెన్నుపూస కదిలింది- నిజమే ఆపని వాళ్లుచేస్తే నువ్వెందుకు?!

వీళ్ళకు - నీళ్ళుకావాలి. బీడి ముట్టిద్దామనుకున్ననాకు పెంకులు తగిలాయి. గుండె వేగంగా కొట్టుకుంది- సుక్కు- రక్తం- పెంకులు. నీటికోసం జంతువులతో పోరేవీళ్ళు- జంతువుల్లాంటి మనుషులతో పోరాడాలి- అప్పుడు రక్తం....వరదలు....

పెళ్ళికావాలి...

నెగడు మండుతున్నది- చుట్టూచీకటి, అలికిడిలేదు. అడవిలో క్రూరమృగాల అరుపులు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. నెగడుకాడ కూసున్న జగ్గానికబొజ్జు నెగడిలా మండిపోతున్నాడు- కొయిదా? ఎక్కడికొయిదా. ఈకొయిదా లేకుండా జెయ్యాలి కాని తనతోటికానిపని- నిస్సహాయత. అది జాతిపరంగా జరగాలి- అందుకేకోపం

1 కంకబొంగు పగలగొట్టి పట్టుకుంటే అది మండుతూనేవుంది అదేవాళ్ళబ్యాట్రీ.

ఆకోపం ఇంకాపెరుగుతుంది- కొడుకు పెళ్ళి చెయ్యమన్నాడు పొద్దున్నే, అప్పటినుండి అతనికోపం పెరిగిపోతుంది. తనగతం గుర్తుకువచ్చింది. తనతండ్రి తనకు పెళ్ళి జెయ్యనందుకు ఇల్లువిడిచి ఇల్లటం వచ్చాడు. తనకొడుకు అలాపోకూడదు. పోనివ్వద్దు ఒక్కడేకొడుకు. తనకు మామచనిపోతూ ఇచ్చిన భూమి ఐదుఎకరాలు- ఇదే తన ఆస్తి. రెక్కలకష్టంచేసి కావళ్లకాసి ఏదోఇంత తింటున్నారు- తమజాతిలో పెళ్ళి చెయ్యకపోతే కొడుకు వెళ్ళిపోవడం తప్పేంకాదు- కాని అంతఖర్చు తనవల్లకాదు. ఆలోచిస్తూ నిద్రపోయాడు నెగడుకాడే....

పొద్దున్నే సంతకు రెండు గొడ్లుకొట్టుకొని వెళ్ళాడు. అక్కడుండి అమ్మితె అడ్డికి పావుశేరేకదా. ఐదువందలరూపాయలు వచ్చాయి. భూమి రైనుపెట్టి దత్తుషావుకారి కాడ మూడుగోనెల జొన్నలు తెచ్చాడు- పెళ్ళిఖర్చంతాకూడా పిల్లవాడే భరించాలి కాబట్టి ఆ అవస్థ....

పెళ్ళి.... డప్పులు మోగుతున్నాయి....
స్త్రీలు ఎదురెదురుపడి పదాలు పాడుతున్నారు....
పెళ్ళికూతురికి ఎనిమిది బట్ట రవికెలు పెట్టారు.
కన్యాశుల్కం ఏభై రూపాయిలు ఇచ్చాడు
వచ్చిన అతిథులకు ఆరుపూటల భోజనాలు
మూడుగోనెల జొన్నలు- మూడు మేకలు....
స్త్రీలు నాలుగేసి విస్తార్లు అదనంగా పెట్టుకున్నారు.
వడ్డించాలి తప్పదు. ఒక్కటేవిస్తార్లదితిని మిగిలింది
పడేస్తున్నారు.... ఇదంతా చూస్తున్నబొజ్జకు
కోపంవస్తుంది కాని లాభంలేదు....
కొట్నాకబొజ్జు కొడుకు రాముపెళ్ళిఅయ్యింది, కాని
భూమిషావుకారి దత్తుకు రైనుపడింది- ఇట్లా ఎన్నికుటుంబాలో- వెక్కలేమ....

కాయిదా

దుక్కికి సాగిన రోజు కోడి
విత్తనమేసిన రోజు కోడి
పంటలో కలుపుతీస్తే కోడి

వర్షాలు కురిశాయి- రైతులంతా దుక్కులు సాగుతున్నారు. అరకమోతి నాగలి
[illegible]

రెండు కోళ్ళు. చౌకీదార్ పాలయినాయి- ఎండకాలమంతా టొంగుకొట్టి గొంతు తడుపుకున్నారు. అడివంతాతిరిగి గీవ్వేర్ (బంక) తీసుకొచ్చి పూటలెల్ల దీసుకున్నారు.... షావుకారి జింకార్ కాడ మొన్ననే గోనెడు జొన్నలు పెచ్చులకు తెచ్చాడు, పంటమీద ఇస్తానని. అవే తింటున్నారు. కాయిదా చెయ్యకపోతే దండుగ వేస్తారు గూడెం పెద్దలు- జింకార్ వద్ద కాళ్ళవేళ్ళ బడి పదిహేను రూపాయలుపెట్టి కోడ్నితెచ్చి దేవరకు బలిచేసి దుక్కి సాగాడు....

విత్తనమెయ్యాలి మళ్ళ కోడి.... జింకార్ వద్ద అప్పు
కలుపుతియ్యాలి మళ్ళీ కోడి.... జింకార్ వద్ద అప్పు

గూడెం అడవికి శాంతి చెయ్యాలంటొంది- పంటలు పాడవుతున్నాయని.... తన వాటా పదిహేనురూపాయలు జింకార్- పంటకోతకు రాకముందే మళ్ళీకోడి- జింకార్ వద్ద అప్పు. పంటకోతకు వచ్చింది- మళ్ళీ కోడి- జింకార్ వద్ద అప్పు. రాసికి బలి ఇవ్వాలి- జింకార్.... మూటాఏభై తెచ్చి మేకబుడ్డను బలిచేశాడు- ఇన్ని చేసిన అరకమోతి పంట ఎందుకు ఇంటికి తీసుకుపోలేదు ? రోజూ కావలి ఉండి తవ్వేడు తీసుకెళ్లి వండి తిని మళ్ళీ కావలి వుంటున్నాడు- ఎందుకు ? పంట ఇంటికి తీసుకుపోతే కూడా బలిఇవ్వాలి కోడి- షావుకారి జింకార్ అప్పు పెరిగింది ఇవ్వనన్నాడు.

ఆ జొన్నలు ఖతంఅయ్యేవరకు అదేవరుస. కాలంతోపాటు అతనుసాగాడు. అతను వేసిన చేనెంత మంచేదు అంటే ఐదెకరాలువుండొచ్చు రెండుగోనలకన్నా ఎక్కువ పండిస్తేకష్టం అతనికి పండినవి గోనెడు.

అతనిఅప్పెంత ?

కాయిదాకు అతనుకట్టిన ఖరీదుఎంత ? ఇప్పుడు జింకార్ షావుకారికి పాలుకు చేస్తున్నాడు తనభూమిలోనే షావుకారి అప్పు తీరేదెప్పుడు తీర్చేదెన్నడు చెట్లు, పుట్టలకు సాగిలబడి మొక్కే విజ్ఞానవేత్తలేవుండగా కొండల్లో కోనల్లో ఆగిరిజనుడు సాంప్రదాయానికి బలికాకేంచేస్తాడు.

గోన/20 కుంచాలు క్వింటల్ సర
కాయిదా - సాంప్రదాయం
ఫొటో - మిర్కుట్/ గటకకారం
ఛా/కలి జావుర్/తండ్రి

ఐదురూపాయల కథ

అదిగూడెం- పదిఇళ్లకన్నా ఎక్కువలేదు. చుట్టూఅడవి.

ఆ ఇళ్లమధ్యలో బంగ్లా (గెస్ట్‌హౌస్) గోండుభాషలో దాన్నిబంగ్లా అంటారు. బంగ్లాఅంటే బంగ్లాఏమికాదు గుడిసె. ఊరికి కొత్తవారెవరొచ్చినా అక్కడ ఉంచుతారు. గూడెం పెద్దపటేల్ అతనికి అతిధిసత్కారం చేస్తాడు.

వాళ్ళకు జంతువులంటే భయంలేదు కాని- నైజాంకు నజరానాలిచ్చి గంపలు మోసుకొని వచ్చిన మైదానప్రాంత షావుకార్లంటే భయం- ఎందుకు.

బాకిలేకుండా అప్పుకట్టడం- ఇక్కడ మామూలు వ్యవహారంగానే సాగుతుంది. అతడెంత అప్పుతీసుకున్నాడో అప్పుకిందికి ఎంతసొత్తు చెల్లించాడో అతనికి తెలువదు- నమ్మకమే నడిపిస్తుంది- తనలాగే అందరు ఉంటారు అనుకుంటాడు. అందుకే అణా పైసలతో అప్పు తీర్చేస్తారు....

షావుకారు కాసం రామయ్యకు ఆగూడేల మీద కన్నుపడింది. ఒకటా రెండా లెక్కలేదు గంపనెత్తిన వేసుకుని కొండలు కోనలు తిరిగాడు.

పొగాకు రెక్కిచ్చి - తప్పెడు కందులు తీసుకునేవాడు
చిన్న బెల్లం ముక్కిచ్చి - సోడు నువ్వులు తీసుకునేవాడు
సోలెడు బియ్యమిచ్చి అడ్డెడు - అంశెలు తీసుకునేవాడు

ధరలు- అతని ఇష్టం- చిన్న చిన్నగ అప్పులిస్తు ఆ గూడేలకు దగ్గరలో ఓ పెద్ద పల్లెలో పెద్దబంగ్లా కట్టుకున్నాడు. వందెకరాల భూమికి ఆసామి అయ్యాడు. పది మంది జీతగాళ్ళు- పెద్ద కిరాణం దుకాణం. వెండి బంగారం కుదవబెట్టుకున్నదెంతో వాళ్ళకిచ్చిన అప్పెంతో- దానికి జప్తుచేసుకున్న వెండి బంగారమెంతో లెక్కలేదు- పదితులాల బంగారు కంటెకి పదిపదులిస్తే మహ ఎక్కువ- ఎట్లా అతను ఇంతపెరిగాడు

కాసం రామయ్యకు కొమురం జంగుకి షావుకారేత్తం వుంది. అన్నీకలిపి రెండు వందలు అప్పుగా వున్నట్లు జంగుకి లీలగా గుర్తు. పది ఇవ్వడం- మళ్ళీ జంగు వడ్డీతో కట్టడం- ఇట్లా కొంతకాలం పోయి పోయి. రెండు వందలు అప్పుగా మిగిలాయి. అసలు తాను తెచ్చుకున్నది మొత్తంగా రెండు వందలకన్న ఎక్కువకాదు. అంతకన్న ఎక్కువ డబ్బే ఇచ్చాడు. షావుకారి ఇంకా బాకీ వున్నావ్ అనడం జంగుకు అర్థంకాని సమస్య. కొత్తగా పోడుగొట్టిన చేల్లో పండిన నాలుగు గోనల నువ్వులు ఐదు గోనల జొన్నలు, అవులేగ ఇన్నిఇచ్చినా బాకీ చెల్లుబాటుకాలేదు మొత్తం ఎంతవుందో కనుక్కొని ఛీ ఉరితాడు తప్పించుకోవాలనుకున్నాడు- మొత్తం బాకీ కట్టేస్తా నాలెక్కచెప్పు అన్న జంగు మాటలు రామయ్యకు నచ్చలేదు.

పుస్తకాలు తిరిగేసి మరిగేసి గీసీ, తీసీ, లెక్కలేసి– ఐదువందలు అప్పువుంది అన్నాడు....

"ఒరే జంగూ ఇంతకాలం మంచిగా వున్నావ్ నీకు చెడ్డబుద్ధిలేదు నాకులేదు సరే నీ అప్పేదో తీరుసేస్తానంటున్నావ్ ఆ తీర్చే బాకీ కింద నాకు డబ్బువద్దు– డబ్బేం చేస్తుంది! నీ గుర్తుగా– ఐదు మేకల్ని పంపు– చూడు జంగూ! పశువుల్ని, మేకల్ని దానం చెయ్యడం ధర్మం. మంచిది. ఫుత్తినే ఇచ్చావనుకో– చూడు ఈ ఖాతాబుక్కులో అప్పు అయిపోయింది అని ఎవ్వరిది పాటాకొట్టి ఉండకూడదు. ఐదురూపాయిలు అప్పు వున్నట్లు రాస్తున్నా– మళ్ళీ అనుకోకుండా అప్పుకువస్తే ఈ పద్దుమీదే రాయొచ్చు. నా కాయిదా అది." అంటూ జంగువైపు చూసి అన్నట్టేరాసాడు– ఏదైతేనేం తన ఉరిపోతుంది. అని సంతోషపడ్డాడు జంగు– ఐదు మేకల్ని కొట్టి పంపాడు.

జంగు చనిపోయాడు, రాంసావుకు ఆ పురితాడు బిగిసింది– సంటకుపోయిన రాంసావును కాసం రామయ్య జైల్లో వేస్తానని బెదిరించాడు అయ్యచేసిన బాకీ అణా పైసతో వసూలు చేస్తానన్నాడు. జైలు అనగానే రాంసావు గుండెల్లో రైల్లు పరుగు లెట్టాయి. తను తన గూడెం– అడవి– తన పొలం– మంచెలు, చుట్టు నాలుగూళ్ళ సంత, ఇంతకన్న తనకేం తెలువవు.

అంబటాల్లయ్యింది. పట్ల మీద గొడ్లు– అరుస్తున్నాయి– ఘాటోమిర్కుట్ తింటున్న రాంసావు– ఘాల్‌నుద్దేశించి "మా:– కాసం రామయ్యకు బాదల్ ఏమన్న బాకీ వున్నాడా" తనకేంతెలుసు గడ్డికొయ్యడం– ఘాటో వండటం తప్ప తెలుసు కుండామన్న కోరికాలేదు ఉన్నా చెప్పలేరుకూడా అన్నట్లున్నాయి ఆ చూపులు

సిల్లే నాకుబత్తత్ టావాయి (లేదు– నాకేమిఎరుకా) అంటూ గిన్నెలోపలికి పట్టుకపోయింది– చెయ్యి తుడుచుకుని బయటికి వచ్చిన రాంసావుకు కాసం రామయ్య కచ్చురం దిగి కనిపించాడు– ఆ చూపుల్లో బెదిరింపు– జైలు– రాంసావుకు గుర్తుకువచ్చి కాళ్ళు వణికాయి–

"ఓ రాంసావు సితీకి సిల్లేకి ఓంది గోష్టివెహ" (ఓ రాంసావు ఇస్తావా లేదా ఐక్కడేమాట చెప్పు) అన్నాడు రామయ్య,

"బత్తల్ షావుకారల్ సీతన్ బగటా సియ్యాన్ సియివతీ వెహటు బచ్లబాకి మంతోడు"

("ఎందుకు షావుకారి, ఇస్తా ఎందుకియ్యా ఇచ్చుదేగదా చెప్పు ఎంతబాకి వున్నదో")

"ఖాతాపుస్తకం తేలేదు బాకీ బాగానేవున్నాడు ఇప్పుడైతే ఐదు గోనెల జొన్నలియ్యి"

అప్పుడే ఇంటికివచ్చిన జొన్నలు ఐదుగోనెలు ఇచ్చాడు. బంగాలేదు- వీడికి తన గురించి తెలువదు సరే, గూడెంలో వీడేకాస్తా ఉన్నోడు- టిన్ రేకులగుడిసె, గొడ్ల కొట్టం, మేకలమంద, 20 ఎకరాల అందాజ పొపుర్ (చేను) రామయ్యదృష్టిలో పడ్డాయి ఇంకేముంది- టిన్ రేకులు పోయాయి- గొడ్లు, మేకలు పోయాయి. ఇంకాబాకీతీరలేదని 20 ఎకరాలు 10 ఏళ్ళుగా రైను పెట్టుకుంటున్నాడు. రాంసాపు పాలుకుచేసి ఏటా రెండు పసల్లు జొన్నలుపోస్తున్నాడు. అతనిబాకీ తీరలేదు. తీరదుకూడా.

భూమి కొరకు.....

యుగాలుగా ఈభూమికోసం ఎందరిరక్తం వరదలుపారిందో- తప్పదు- ఇంకా పారుతుంది భూమిని తలకిందజేసి బువ్వపెడుతున్నందుకు- అదినేరం. నష్టంచేసింది భూమినిదున్నడం- అదినేరమైతే బువ్వతినే ప్రతివాడు నేరస్తుడే. ఈ పటార్ మీద గూడా అన్నీ కదులుతున్నాయి- నిదురబోయినసీమ కదలబారింది- కదలబారిన సీమదండును జూసి కల్లోలం అంటున్నాయి ఖద్దరుగుడ్డలు- కదిలిన ఈ తుంబాగూడెంకథ!

అది 1975- చీకట్లు కమ్ముకున్నాయి- ఏళ్ళతరబడి సాగుజేస్తున్న పంటభూముల్ని ప్లాంటేషన్స్ చేశారు- తనభూమిలో మొక్కలు నాటనివ్వనన్న సిడాం పాపు రక్తం మడుగైనాడు- మన్నెగూడెం మంటెగలిసింది, కాదు కాల్చి మంటెగలిపారు- దిక్కులేని వాళ్ళను చేశారు- ఒకటారెండా ఊర్లకూర్లు కొన్నివేలఎకరాలు ఒక్కొక్కరిది రక్తసిక్తగాధ- ఎక్కువ ప్లాంటేషన్స్ చేసినందుకు ఆ సంవత్సరం ఆ ఏరియా రేంజర్‌కు బంగారుపతకం దొరికింది. ఆదొంకపీడకల- బంగారంపండేభూముల్లో పిచ్చి తుమ్మలు నాటారు. అప్పుడు తుంబాగూడెం నిశ్శబ్దంగావుంది. కళ్లల్లో నిప్పుపెట్టుకుంది. కనబడ్డ ప్రతివాని కాళ్ళుపట్టుకుంది. కాని లాభంలేదు- భూమిదక్కలేదు. ఇప్పుడు తుంబాగూడెం కొత్తగీతంపాడుతుంది. ఆవూళ్ళో సంఘంసూర్యుడు ఉదయించాడు-

భూమికొరకు నెత్తురంతా
కాల్వలైనా కదిలిపోదుము
జైల్లోన మమ్ము లేసిన
అసలుకే వెనుతిరిగిపోము-

తుంబాగూడెం పాడినగీతం అక్కడితో ఆగలేదు- అది నిప్పురవ్వలా అడివంతా దావానలమయ్యింది. పటార్ మీద పోలీసుల ఫైర్ ఇంజన్లు ఆమంటను ఆర్పలేక పోతున్నాయి. తినేతిండిని గోడౌన్స్‌లోపెట్టి ఖరాబుచెయ్యడం సర్కారువారికే ఎరుక- ఆతరువాత జొన్నలు పాతరబోసి పెచ్చులకిచ్చే షావుకార్లకే ఎరుక. గోడౌన్స్‌లో పెట్టినవి సముద్రంలో పోయమంటున్నారు డాక్టర్లు- షావుకార్ల పాతరజొన్నల వాసన భరించలేం విషమైనాతాగొచ్చు- కాని అదేతింటున్నారు గిరిజనులు-

పండినపంటల్ని ఖరాబుచేశారు- కాని పండించుకునే భూములేమన్నాయి పిచ్చి తుమ్మలు నాటరు-;

పందికొక్కులు పంటకొడితే మందుకొట్టి చంపాం- పండేభూముల్లో పిచ్చి తుమ్మలు నాటితే సర్కారు ఏమందు కొట్టాలో చెప్పడంలేదు చెప్పదు కాని వాళ్ళు తెలుసుకున్నారు.

ఇక్కడ ప్రతిచెట్టు, గుట్ట, పిట్ట- ఎర్రమందును నూరుతున్నాయి.

సర్కారుతుమ్మను, పిచ్చితుమ్మను నాశనంచేయడానికి గిరిజనులు ఎర్రమందును కనిపెడితే వెర్రెత్తిన సర్కారు ఇంద్రవెల్లిలో విరుచుకపడి కనిపించిన వాణ్ణల్లా కరిచిచంపింది.

ఇది ఇవ్వాళ- మొన్న కొమరంభీం మీదకూడా ఇట్లాగే విరుచుకపడింది. కాని అక్కడితో గిరిజనుల తిరుగుబాటు ఆగిపోయిందా? నిన్న కోరన్న మంగన్నను భూస్వాములు రెంజిమ్‌ను వాళ్ళ కావలికుక్కలు శ్రీకాకుళంలో కాల్చిచంపారు- అక్కడితో పోరాటం అణగిపోయిందా? ఇవ్వాళ ఇంద్రవెల్లిలో ఇందిరా అంజయ్యలు రక్తపాతం సృష్టించారు- ఆ రక్తంలోనే గిరిజన రైతాంగ పోరాటజెండా మరింత ఎరుపెక్కి ఎగురుతుంది.

— వెంకన్న

సృజన దగ్గర కొత్తపుస్తకాలు

సృజన ప్రచురణ :

1. కరీంనగర్ ఆదిలాబాద్ రైతాంగ పోరాటపాటలు- 2.00
2. ప్రజాకళలు, సాహిత్యం ఎలావుండాలి - వర్గీస్ వ్యాసాలు 2.00

క్రాంతి ప్రచురణ :

3. నాట్యాలు - నాట్యరూపకాలు 1.00
4. రైతుకూలి విజయం - ఒగ్గుకథ 1.00
5. అరాచకవాదమా? సోషలిజమా? - స్టాలిన్ 1.50

సాహితి ప్రచురణ :

6. జూలియస్ ఫ్యూజిక్ - ఉషా ఎస్. డానీ - 4.00

తుడుం (నగారా)

గోదావరి

నారేపచెట్టు కొసకంటాపాకి మరోమారు గొంగడిముసుగు సరిచేసుకొని తేనె తుట్టెవేపు దృష్టిసారించాడు భిక్యా. ఇంకొంచెంపాకాలి- అట్లాపాకుతుండగానే అను కోకుండా కొండకిందికి దృష్టిసారించాడు- అల్లంతదూరాన కాకీబట్టలోల్ల గుంపు కని పించింది- కాకీబట్టలోల్లముందు ఇద్దరు తెల్లబట్టలోల్లు నడుస్తున్నారు. భిక్యా జర్రిన కిందికిజారి కొండమీదినుండి కిందికి పరుగెత్త సాగిండు గాలికన్న వేగంగా.

కొండ కింద భాగంలో గూడానికొచ్చేదాకా అతను పరుగెత్తుతూనే ఉన్నాడు- గూడెంలో మొత్తంకలిపి ఇరవై గుడిసెలున్నాయి. కాలుగాలిన పిల్లిలా గుడిసె గుడిసెకు పరుగెత్తాడు- నలుగురైదుగురు లేవలేని ముసలివాళ్లు, జ్వరంతో మంచానికంటుకు పోయిన ఒక పడుచువాడు- ఇద్దరు ముగ్గురు పిల్లలుతప్ప ఎవరు కనిపించలేదు. కాసేపు ఏమిచేయాలో తోచక పొద్దుకేసిచూస్తూ నిలుచున్నాడు- పొద్దు అంగుదలకొచ్చింది- తలగోక్కున్నాడు- ఎటూనిర్ణయించుకోకుండానే [1] మిట్టమీదికురికి మళ్లీ చూశాడు- వాళ్లు వచ్చేస్తున్నారు. ఎట్లా ? ఎట్లా ? అట్లా గుంజాటనపడుతూనే కడింటికేసి పరుగెత్తాడు- గుడిసెలోపల ఎవరూలేరు- కొయ్యకుగట్టిన ఎర్రజెండా ఊడబీకి దాచేశాడు- నాలుగైదు ఎర్రికాయిదాలుతీసి చూర్లో చెక్కాడు- అప్పుడు కనిపించింది అతనికి తుడుం.

తుడుం పట్టుకొని కొండమీదికి పరుగెత్తాడు- మరోపదినిమిషాల్లో కాకీబట్టలోల్లు గూడెంలో ప్రవేశించడం నగారా మోగడం ఒక్కసారేజరిగాయి.

గూడెంలోకి అడుగుపెట్టిన కాకీబట్టలవాళ్ల నాయకుడు బెదిరి బెదిరి చూశాడు. అతని ఉబ్బుచెంపల మీదికంటా చెమట అసహ్యంగా కారుతుండగా- "బి. క్విక్- గుడిసెల్లో వెతకండి." ఆర్డరేశాడు- కాకీబట్టలోల్లు విజృంభించి కర్రిలూపుతూ గుడిసెల మీద పడ్డారు- గిరిజనులకు విలువైన కుండలు పగులగొట్టారు. తునికిపళ్లు తొక్కే శారు- [2] కంకబెసం ఎగజల్లారు- విప్పపూవు పారబోశారు. ఉన్నవాళ్ళను నాయకుని దగ్గరికి ఈడ్చుకొచ్చారు. నాయకుడు. [3] గడంచ తెప్పించుకొని అప్పటికే కొలువుదీరాడు

అర్ధగంట గడిచింది. గుడిసెల్లో గాలింపు అయిపోంది- నాయకుడికి ప్రమో షన్ ఆశ చావబోతోంది- తెల్లబట్టలోల్ల కళ్లల్లో భయం తెప్పరిల్లింది- కాకీబట్టలోల్లకు అధవా ఒక ఆడపిల్లన్నా దొరకక మహాచెడ్డ [4] నాదానుగా ఉన్నది.

---

1 ఎత్తైన ప్రదేశం 2 కంక చెట్ల నుండి తీసే గింజలు(గిరిజనులు వండుక తింటారు)

3 చిన్న మంచం 4 నామోషిగా

సరిగ్గా అలాంటి సమయంలో ఊపపక్కన చేకుపొరకల్లోనుండి అరుపులు విన్పించాయి- మరికాసేపటికి మట్టిపెళ్లలు దొర్లుతున్నట్లుగా మనుషులు పరుగెత్తుకొచ్చారు- నాయకుడులేచి అటెన్‌షన్‌లో నిలబడినాడు- తెల్లబట్టలోల్ల కాళ్లు వనుకుతున్నాయి. పదినిముషాల సమయంలోనే కాకీబట్టలోల్ల చుట్టు అయిదారు వందల జనం పోగయ్యారు. ఇంకా వచ్చేవాళ్లు వస్తూనేఉన్నారు.

నాయకుడు ముఖంలోని భావాలను చిత్రంగా మార్చాడు- అతనిముఖంలో కృత్రిమైన ప్రశాంతత. గొంతులో అలవాటులేని మార్దవం- "మీరేం భయపడవద్దు- మేం మిమ్ములనేంచేయం- కాని మీరుమాకు...." నాయకుడు తెల్లబట్టల వాళ్లకేసి చూశాడు.

తెల్లబట్టల ఎద్దుముఖం వాడొకడు "పొరకల పార్టోల్లు దొంగలు- మిమ్ముల నిండముంచుతరు" అన్నాడు వొనుకుతూనే.

ఖాకీనాయకుడు చిరాకుపడ్డాడు- తెల్లబట్టల బక్కవాడు "రాడికలోల్లు మీకు మంచివాల్లే కావచ్చుగాని సర్కారుకు శత్రువులు- మరందుచేత వాళ్లెవరన్నాఉంటే సర్కారోల్లకప్పగియ్యండ్లి."

గిరిజనులు మాట్లాడలేదు- ఒకరిముఖాలొకరు చూసుకున్నారు- వెనుకవాళ్ళకివేమి విన్పించక అరుస్తున్నారు.

"సర్కారుమీకు కోటి రూపాయలు మంజూరు జేసింది" ఖాకీనాయకుడు.

ఎద్దుముఖంవాడు చిన్నగాదగ్గి- "మీకు సాయపడుతుంది సర్కారు" అన్నాడు.

ఈసారి రేగుతుట్టెలాగా వెంట్రుకలుగల ఒకస్త్రీ ముందుకొచ్చింది- "గిసేండ్లు మేం సచ్చినమో బతికినమో సూడని సర్కారుకు దయెట్ల గలిగిందోంట-" అన్నది చేతులుతిప్పుతూ.

బక్కపలుచటివాడు తలగోక్కున్నాడు.

"మీవూళ్ళకు [5] సడుకులేపిత్తది-" ఎద్దుముఖం.

"మాకు కాళ్లున్నాయి" స్త్రీ.

"మీ మోటర్ల కోసమా?" వెనుకలైనులోనుంచి బొంగురుగొంతు.

"మేకలగొనిస్తది?"

"అవి ఏడమెయ్యాలె-[6] సైకిదాపు [7] పుల్లరని కోసుకుంటడు." జనంలోనుండి.

"మీకు ఎడ్లుగొనిస్తది!"

"8 కంకలగట్టి ఏడదున్నదుం. సర్కారు ఉన్నభూమి రిజర్వ్ల్లదనే-"

"మీకు అప్పులిస్తది."

"ఎన్నేండ్లు ?"

ఎదుముఖంవాని ముఖంలో కోపం.

"ఇయ్యేడిత్తది. మనంబువ్వకు కర్సుసేసుకున్నంత 8 బొండిగలకురిబెడ్తది."

"మాదెర్ సోదు మీరంతా నక్సలైట్లు" ఖాకీ నాయకుడు పళ్లు పటపట కొరికాడు ఖాకీబట్టలవాళ్ళు నలుభైమంది తుపాకులెత్తారు.

జనం ఆరువందలు దాటారు- తిట్లుశాపనార్థాలు- ఖాకీబట్టలవాళ్ళ చుట్టున్నజనం ఇంకా ఏదో అడుగుతూనే ఉన్నారు- చక్రబంధంలో చిక్కుపోయిన ఖాకీవాళ్ళు ఏదో చెప్పుతూనే ఉన్నారు- మాటలు అయిపోయాయి. ఖాకీవాళ్ళు కర్రలెత్తి ముందువరస లోని వాళ్ళను కొడుతున్నారు- వెనుకున్నవాళ్ళు హడావిడిలో ఉన్నారు.

మరో అర్ధగంటలో దెబ్బలుతిన్న ముందువరుసవాళ్ళు వెనక్కుపోయారు- చుట్టూ 9 నువ్వుకట్టెమధ్య ఖాకీవాళ్ళు ఇరుక్కుపోయారు.

ఖాకీనాయకుడు కీచుగొంతుబడి "ఫైర్ ఫైర్"అని అరుస్తున్నాడు కాని ఆ అరుపు ఎవరికీ వినపడటంలేదు. మరింక లాభంలేదని సంజ్ఞకోసం చేతులెత్తాడు.

"10 అగ్గిదల్గబెడ్తం." అరుపులు.

ఖాకీనాయకుడు పిచ్చిగా చేతులూపాడు- రెండుమూడు తుపాకులు గాలిలోకి మొరిగినయ్- నాయకుడు అదిరిపడి చేతులూపడం ఇంకా ఎక్కువచేశాడు....

గిరిజనులు నువ్వుకట్టెలొక్కుటా విరుచుక పడ్డారు. అందరిచేతుల్లో కర్రలున్నాయి. పెటేల్ పెటేల్‌న దెబ్బలు- ఖాకీవాళ్ళు మూడునాలుగు భాషల్లో మొత్తుకుంటున్నారు. గాబరాగా తుపాకులు సదురుతున్నారు- తమప్రాణంకన్న విలువగా వాటిని గుండెలకదుముకుంటున్నారు. ఇంకా చేకుపొరకల్లోనుండి పరుగెత్తుకొస్తున్న గిరిజనుల అరుపులు వినవస్తూనే ఉన్నాయి.

మరో అయిదు నిమిషాలకు ఖాకీనాయకుడు ముందు, తెల్లబట్టలోల్లు వెనుకా వాళ్ళవెనుక చిరిగి పేలాడుతున్న ఖాకీగుడ్డలవాళ్ల పరుగెత్తుతున్నారు.

కొండతిరిగేదాకా గిరిజనులు వెంటబడి తరుముతూనే ఉన్నారు.

---

8. గోండుభాషలో ఎడ్లుఅనిఅర్థం 8. మెడకు 9. నువ్వుమొక్కల ఎండుచెత్త
10. నిప్పుఅంటిస్తాం.

ఇంద్రవెల్లి !

అజ్ఞాత సూరీడు

గోండుల ఆశల్ని రక్తంతో రచించిన
          రంగుల కాన్వాస్—
బస్తర్ నుంచి విప్పచెట్ల మీదుగా
ఎగిరొచ్చినగాలి, వంద మంది మరణ రహస్యాన్ని
నేలనాల్గు చెరుగులా వ్యాపింపజేస్తుంది—
కాదు పదమూడే అంటారు
ప్రజల రక్తంతో హోలీ లాడుకునేవాళ్లు—
ముప్పయ్యో - చిల్లరో వుండొచ్చు
కానీ వాళ్లు నక్సలైట్లు కాదు
గిరిజనులు, అంటూ వాపోతారు
ఎరుపును ముంచెత్తే బురద పులుముకున్న వాళ్లు
వాస్తవం తన పరిధి నుంచి బైటపడటానికి—
గింజుకుంటూవుంటుంది అప్పటి కింకా—

o o o o

బొంగరంలా తిరిగి పిట్టల్ని కాల్చేసిన
చోటికే వస్తాడు కోతివెధవ—
వాగ్దానాలతో వాళ్లకు తనమీదున్న క్రోధాన్ని
మరిపించటానికి— ప్రయత్నిస్తూ—
అరలక్షతో ఆశ్రమ పాఠశాలకు
          ప్రారంభోత్సవం చేస్తాడు
మీకే పోలీసు వుద్యోగాలిస్తానని
పిచ్చెత్తి గొంతు చించుకుని అరుస్తాడు—
ఆప్తుల్ని పోగొట్టుకున్న జనం మౌనంగా
          ముఖంచిట్లిస్తారు—
గుట్టలకు దూరంగా అడివిలో
          బిడ్డల్ని పోగొట్టుకున్న "నాగోబా"
ఆక్రోశాన్ని వాళ్లు మాత్రమే వినగల్గుతారు—

o o o o

వాళ్ల జీవితాల జిగురుతో
తమకరెన్సీ కట్టల్ని సీల్ చేసుకుంటుంది
          నాగరిక వ్యాపార ప్రపంచం—
విషం కలగలిసిన 'రత్నపురి గడలు'

మిగుల్తాయి చివరికి వాళ్ల తింటానికి
జంగుజాయి పుత్సవాల్లో కాస్త కాస్త
విప్పసారా దొరకనూ వచ్చు-
అయితేనేం-
కాపురం క్షేమ ఆశలు మాత్రం
ఇంకా తీరవలసే వున్నాయి-
గతం కార్చిన నెత్తురు వర్తమానాన్ని
వుత్తేజపరిస్తే, వర్తమానం ఓడ్చిన రక్తం
భవిష్యత్తును స్థిరపరుస్తోంది

o o o o

'తీవ్రవాదులకు విదేశాలనుంచి డబ్బు' అంటూ
చంపిన వాళ్లకు ఎక్స్‌గ్రేషియాలు యిస్తారు-
ప్రాంప్టింగ్ ప్రేక్షకులకు కూడా వినిపిస్తుంది
అది రష్యా స్వరం-
దెబ్బకు దెయ్యం పారిపోయింది అనుకొని
శవాల మీద విందులు చేసుకుంటారు వాళ్ళు-

కానీ-
దవాఖానాలోంచి భీమారావ్
'తూటాగాయం తగ్గగానే మీటింగుకు పోతా'నంటాడు-
"నిర్బంధం ప్రతిఘటనను పెంచుతుంది"

o o o o

మరో చిత్రం-
అజ్ఞాతంలో....ఇంద్రవల్లి
రక్తం చిప్పిలుతూన్న కళ్లతో ఒకరిగాయాల నొకరు
చూసుకుంటూ-

"ఒరిగిన అన్నల కెన్నీయలో - ఎర్రెర్రనిదండా
లెన్నీయలో"
"ఒత్తుకున్నాం కంటిలో తడి-ఎత్తుతున్నాంఎర్రపిడికిలి"
సర్వవ్యాపితమైన నిశ్శబ్ద గానంతో
రగల్‌జండా గుండెల్లో ఎగురుతుండగా-
తుడుం ప్రతిధ్వనిస్తోంది-

అడవి, గూడెం, పోరక, పోడు
ఆదివాసులవి అవి పేదరాశులవి

ఆదిలాబాద్ ఆదివాసుల జీవితం - పోరాటం

అది మూడురాష్ట్రాలకూడలి. ప్యాంటంటే, తెల్లబట్టల మనుషులంటే దోపిడీ దార్లనితప్ప 'నాగరికత' తెలియని ఆదివాసుల రాజ్యంఅది. ఆ అడవంతా తమదనితప్ప, మనుషులమధ్య, రాష్ట్రాలమధ్య సరిహద్దులుంటాయని తెలియని అమాయకులైన ఆదివాసుల రాజ్యంఅది. అది వెనుకటి గోండ్వానా. ప్రస్తుతం చంద్రాపూర్ (మహారాష్ట్ర), బస్తర్ (మధ్యప్రదేశ్), ఆదిలాబాద్ (ఆంధ్రప్రదేశ్) జిల్లాలప్రాంతం. దట్టమైన అడవిప్రాంతం. అక్కడ అడవితల్లి కన్నబిడ్డలు ఆదివాసులు. అడవితల్లి కంటిపాపలు ఆదివాసులు. ఈ భూమిమీద అనాదిగా బతుకుతున్న మనుషులు ఆదివాసులు. క్రూరమృగాలనుంచి, మరింతక్రూరమైన తెల్లబట్టల మనుషులనుంచి, బయటి ప్రపంచంనుంచి రక్షిస్తూ వాళ్ళను కడుపులోపెట్టుకొని కాపాడుతున్నది అడవితల్లి.

16,133 చ.కిమీ. విస్తీర్ణం కలిగిన ఆదిలాబాద్ జిల్లాలో అడవి విస్తీర్ణం 6,937 చ. కిమీ. 12 లక్షల 88 వేల జనాభాలో ఒకలక్ష డెభ్బైవేలమంది ఆదివాసులు. జిల్లాలోని మొత్తం 1609 గ్రామాల్లో 409 'షెడ్యూల్డ్' గ్రామాలు. ఈగిరిజన ప్రాంతాల్లో 100 చ.కిమీ. ప్రాంతానికి రెండు పోస్టాఫీసులుకూడాలేవు. ఇక్కడ విద్యుత్‌సౌకర్యం 3% గ్రామాల్లోకూడాలేదు- జిల్లాలో అక్షరాస్యతాశాతం 14.15 మాత్రమే- వైద్య ఆరోగ్య సౌకర్యాలు ఎంత తక్కువగా వున్నాయో 13 లక్షల జనానికి 188 మంది డాక్టర్లున్నారంటే అర్థమవుతుంది- 16 వేల చ. కిమీ. వైశాల్యంకలిగిన జిల్లాలో రోడ్ల పొడవు 863 కి. మీ. మాత్రమే- అడవిప్రాంత గ్రామాలలో పాఠశాల వుండడం అరుదు. ఒకవేళ వున్నా టీచర్ ఎక్కడో దూరంగావున్న పట్టణంలో వుంటాడు.

ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసులు ప్రధానంగా ఆరుతెగలు-

1. గోండు : వీళ్ళను 'కోయతూర్' అనికూడా అంటారు- వెనుకటి 'గోండ్వానా' రాజ్యం ఈతెగ రాజుల పరిపాలనకిందనే వుండేది- వీళ్ళమాతృభాష 'గోండు'

2. పుజారి : వీళ్ళను 'కొలామ్' లనీ, 'గట్టుమన్నె' లనీ పిలుస్తారు- వీళ్ళు ఆదివాసులకు పూజారుల్లాంటివాళ్ళు- దేవతలకు పూజలుచేయడం, వైద్యంచేయడం

3. పటాడి : వీళ్ళను 'పరధానులు' అనికూడా పిలుస్తారు- వీళ్ళు పిండకూడు వ్యవహారాలు, కథలు చెపుతుంటారు. వీళ్ళమాతృభాష 'మరాఠీ'.

4. మచ్చలీర్ : వీళ్ళను 'నాయకపోళ్ళు'అని పిలుస్తారు. వీళ్ళమాతృభాష తెలుగు.

5. టోయిటల్ : వీళ్ళను 'చుక్కబొట్లోళ్ళు'అని పిలుస్తారు. వీళ్ళ మాతృభాష గోండు.

6. ఓజల్ : వీళ్ళను 'కంచరోళ్ళు'అని పిలుస్తారు- వీళ్ళమాతృభాష మరాఠీ.

ఈ ఆదివాసుల గ్రామాలు చిన్నచిన్న గూడాలుగా వుంటాయి- ప్రతి గూడెంలో 10 నుంచి 15 గుడిసెలుంటాయి. 20-25 గుడిసెలుంటే పెద్ద గూడెం అన్నమాట- ప్రతి గూడానికి ఒక గ్రామపెద్ద [పటేల్] వుంటాడు- గూడానికి సంబంధించిన వ్యవహారాలన్నీ ఆయనే చూస్తాడు- బయటినుంచి ఎవరైనా అతిథులొస్తే ఆయన ఇంటికిపోయిన తరువాతనే మిగిలిన వాళ్ళు రానిస్తారు- స్త్రీలు చాలావరకు బయటి వాళ్ళకు కనబడరు- ఆదివాసుల సాంప్రదాయాలలో, ఆచారవ్యవహారాలలో మార్పులు, చేర్పులు చేసే అధికారం కలిగిన వాళ్ళను 'ముఖాసీ'లంటారు- కొన్ని గూడాలకు ఒక 'ప్రాంతీయ ముఖాసీ', తాలూకాకు 'తాలూకా ముఖాసీ'వుంటారు- పటేల్‌గిరీ, ముఖాసీ గిరీలు వంశపారంపర్య అధికారాలు.

ఆదివాసులు ఎన్నోక్షుద్ర శక్తులను పూజిస్తారు- ప్రతి గూడెం శివారులో 'శివ సంగు దేవేర' గుడి వుంటుంది- ప్రతి గూడెంలోనూ తప్పనిసరిగా దేవేర్ల గుడి వుంటుంది- 'జంగుబాయమ్మ దేవేర' వీళ్ళ ముఖ్య దేవత- ఏ పనైనా ఆ ప్రత్యేక దేవేరను పూజించి మొదలుపెడతారు- వీళ్ళ సంప్రదాయంలో పెళ్ళి మగపెళ్ళి వాళ్ళకు చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం- విపరీతమైన వృథా జరుగుతుంది- పిల్లలకు పుట్టిన ఐదవరోజే పేరుపెడతారు- ఎవరైనా మరణిస్తే రెండు మూడు రోజుల్లో వాసుకగ్గర రెండుమూడు వందలమందికి భోజనాలు పెడతారు- భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే మరొకరు రెండుమూడు నెలల్లోనే మళ్ళీ మనువు కుదుర్చుకోవచ్చు- పురుషుడు ఎంత మంది స్త్రీలనైనా పెళ్ళిచేసుకోవచ్చు. ఇంటిపేరు ఒకటే అయితే పెళ్ళి చేసుకోవడానికి వీలులేదు. ఇంటిపేర్లు చాలాతక్కువగాఉంటాయి. ఆత్రం, సిడాం, అరక, కొముర౦, సోయం, మాడి, గెడాం, కొట్నాక, సరుపం, ఉరివెత్త, మడావి, కొడిపె వగైరా.

వినోద కార్యక్రమాలు గిరిజనుల్లో చాలాతక్కువ. కళారూపాలు ఎక్కువగా అభివృద్ధి చెందలేదు. పెళ్ళిళ్ళప్పుడూ, దేవేరకు చేసేటప్పుడూ డోలువాయిస్తూ నృత్యం చేస్తారు. 'రేలా-రేలా-రేలారే, అనే పల్లవిలో పాటలు పాడతారు.

మగవాళ్ళ ఒంటిమీద ఒక్క గోచీగుడ్డ మాత్రమే వుంటుంది. స్త్రీలు రవికలు వేసుకోరు. చీరలు మాత్రమే వుంటాయి. పిల్లలకు బట్టలు సాధారణంగావుండవు.

ఆదివాసుల ఆహారం ప్రధానంగా అడవి ఉత్పత్తులే. జొన్నఅన్నం, కూం ముఖ్యమైన ఆహారం. అయితే ఇది మూడునెలలకంటె ఎక్కువకాలం దొరకదు. రెండుమూడు నెలలు విప్పపూలు అంబలికాచుకొని తాగుతారు. కంకబెనాలు [వెదురు బియ్యం] ఒక పదిహేను రోజులు ఆహారంగా పనికొస్తాయి, సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ ఆకులూ, అలములూతిని గడపవలసిందే. ఉప్పు చాలా తక్కువగావాడతారు. పాలు, పెరుగు, నూనె దాదాపు తెలియవనే చెప్పాలి.

ఆదివాసుల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వీళ్ళింకా వ్యవసాయంలో నూతన పద్ధతులను తెలుసుకోలేదు. వీళ్ళు ప్రధానంగా పండించేవరి వర్షాధారంగా పండేదిమాత్రమే. వరిలో కలుపుతీయడం వీళ్ళింకా నేర్చుకోలేదు. పొలం మళ్ళు కట్టి నీళ్ళుపెట్టే పద్ధతి ఇప్పుడిప్పుడే అలవాటపడుతున్నది. వరితప్ప వేరేపంటలు చాలా తక్కువ ఇంద్రావతి, ప్రాణహిత, గోదావరి ఒడ్డుప్రాంతాల్లో కొంతవరకు జొన్న పండిస్తారు. సిరొంచ, అసరెల్లి, అంకీస ప్రాంతంలో చెరువులున్నాయి. వ్యవసాయం కాక ఆదివాసులు తవిసిబంక, తునికాకులు, తునికిపళ్ళు, తాటికల్లు, ఇతర కొన్ని రకాల పళ్ళపై ఆధారపడతారు.

ఇట్లా అడవితల్లిఒడిలో స్వేచ్ఛగా జీవించిన ఆదివాసులు క్రూరమైన దోపిడీకి గురయ్యారు. మైదానప్రాంతాలనుంచి దొరలు, షావుకార్లు ఈ బ్రహ్మాండమైన సంపదను కొల్లగొట్టుక పోవడానికొచ్చారు.

అడవిని, సుసంపన్నమైన ఆ ప్రకృతిని స్వంతంచేసుకున్నారు దొరలు. అమాయకులైన ఆదివాసులను తరిమేశారు. లేదా పీల్చిపిప్పిచేశారు. వాళ్ళ దోపిడీ విధానాలు ఒకటా రెండా ?

నిజాంరాజు ఆదివాసులమీద రకరకాల పన్నులువేసి విపరీతంగా దోపిడీచేశాడు. విప్పపూలమీద, బంకమీద, సారెపప్పుమీద పన్నువిధించాడు. పశువులమేతపై పన్ను విధించాడు. కలప కొట్టుకుంటే పన్నువిధించాడు. గుడిసెకుకప్పుకునే గడ్డిపైకూడా పన్నువిధించాడు. అడవిసంపదలన్నిటి వాడకంపైనా పన్నువిధించాడు. ఆదివాసులను కన్నతల్లిఒడినుంచి దూరంచేశాడు. సాగుభూములను అడవిగామార్చాడు. బంజరు [illegible]

చట్టబద్ధ దోపిడీయేకాక నైజాంఅధికారులు నజరానాగా, జుర్మానాగా కోళ్ళు మేకలూ గుంజుకపోవడం సర్వసాధారణమైంది.

దాదాపు ఆ కాలంలోనే మైదానప్రాంతాలనుంచి ఎంతోమంది బతుకుతెరువుకై పొట్టచేతపట్టుకొని ఈప్రాంతం చేరారు. వాళ్ళందరూ ఇప్పుడు ఆ ప్రాంతపు లక్షాధికారులు. వాళ్ళదోపిడీ విధానాలు మచ్చుకుకొన్ని.

1. ఆదివాసులకు ఇచ్చేటప్పుడు చిన్నకొలత పాత్రలు, వాళ్ళనుంచి తీసుకునేటప్పుడు పెద్దకొలత పాత్రలు వాడడం.
2. 50% నుంచి 100% వడ్డీరేట్లతో చక్రవడ్డీకి అప్పులివ్వడం
3. కుదువపెట్టుకున్న వస్తువుల విలువలో నాలుగోవంతు మాత్రమే ఇచ్చి వస్తువులను స్వంతం చేసుకోవడం.
4. తెల్లకాగితాలపై వేలిముద్రలు వేయించుకొని, తద్వారా తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం.
5. జొన్నలు, అవిశెలు, కందులు, పెసలు, పత్తి, ఆముదాలు, బంక, విప్పపూవు, సారెపప్పు మొదలయిన అటవీ ఉత్పత్తులు తీసుకొని అతితక్కువ విలువకట్టి ఇవ్వడం.
6. ఆదివాసులకు సరుకులను అధిక ధరలకు అమ్మడం.
7. అప్పుకింద జప్తుచేసుకున్న పశువులను ఆదివాసుల దగ్గరనే వుంచి వాటి పోషణ భారం వాళ్ళమీదనే వేయడం, ఆ పశువులను వ్యవసాయానికి వాడుకున్నందుకు రెండున్నర క్వింటళ్ళ జొన్నలు, వందకట్టల చొప్పు వసూలు చేయడం.

ఈ షావుకార్లు మొట్టమొదలు ఈ ప్రాంతాలకు చేరినప్పుడు నిజంగా బతుకు తెరువుకోసం వచ్చిన వాళ్ళే- ఒక గంపలో పొగాకు, చింతపండు, ఉప్పు, మిరపకాయలు లాంటి మామూలు సరుకులు వేసుకొని ఊరూరా తిరిగి అమ్ముకున్న వాళ్ళే- ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఎంతోవిలువైన అటవీ ఉత్పత్తులను అతితక్కువ వెలకట్టి తీసుకునేవాళ్ళు, 0.75 పైసల విలువగల సోలెడు ఉప్పు ఇచ్చి రు. 5.00 విలువగల బంక తీసుకునే వాళ్ళు- ఇట్లా ఊరూరికీ తిరిగి అమ్ముకున్న షావుకార్లు ప్రస్తుతం వందల ఎకరాల, లక్షల రూపాయల ఆస్తిపరులయ్యారు. ఇదంతా [illegible]కులు చేసిన దోపిడీ- ఇదిగాక ఆదివాసులను దోచుకోవడంలో షావుకార్లతో

గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్, ఆం. ప్ర. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆం ప్ర ప్రభుత్వ అటవీశాఖ- ఈమూడూ ప్రభుత్వ దోపిడీ సాధనాలు- వివిధ పన్నుల వసూళ్ళను అటవీశాఖ, ప్లాంటేషన్స్ నాటడం, అటవీ ఉత్పత్తులను సమీకరించడం, కొట్టిన కలపను బయట అమ్మకానికి పంపడం ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహిస్తున్నాయి- అడవి నుంచి తవిసి బంక ఏరే పనిని కార్పొరేషన్ చేయిస్తుంది- ఈ పనిచేసే పురుషులకు రు. 3-25 పై. స్త్రీలకు రు. 2-75పై కూలి ఇస్తారు- ప్రభుత్వం నిర్ణయించిన కనీస కూలి కంటె ఇది చాలా తక్కువ- ఆదివాసులు ఏరుకొచ్చిన తవిసి బంకకు కిలోకు రు. 3-00 ఇస్తాడు- అయితే కిలోకి 1200 గ్రా. తూస్తారు- ఇదే బంకకు బయట మార్కెట్‌లో ధర రు. 12-00 నుండి రు. 25-00 దాకా వుంది- ఈ కార్పొరేషన్ దగ్గర టెండర్ తీసుకున్న కంట్రాక్టర్లు తునికి ఆకులు కోయిస్తారు- 50 ఆకుల కట్టకు ఐదుపైసలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా ఈ కంట్రాక్టర్లు 70, 80 ఆకులు కట్టించుకొని మూడుపైసలు ఇస్తారు.

ఇక ప్రభుత్వ అటవీ శాఖ దోపిడి-ప్రతిగ్రామంలోను ఈ శాఖకు చెందిన ఒక చౌకీదారు, ప్రతి ఐదుగ్రామాలకు కలిసి ఒక డఫేదారు ఇద్దరు చౌకీదార్లతో కలిపి చెక్ పోస్టు వుంటుంది- పశువులు అడవిలో మేసినందుకు ఈ చౌకీదార్లు పుల్లరి వసూలు చేస్తారు- పుల్లరి ఒక్కొక్క పశువుకు రూపాయి చొప్పున వుంటుంది- పుల్లరి వసూళ్ళ కాలంలో ఆవు గర్భంతో వుంటే రెండురూపాయలు వసూలుచేస్తారు- చౌకీదారు మారినప్పుడల్లా పుల్లరి వసూలుచేస్తారు- మేకలకైతే పుల్లరి 10 రూపాయల నుంచి 15 రూపాయల దాకా వుంటుంది- గుడిసెలు వేసుకుంటే వందల రూపాయల లంచం, పంటల మీద ధాన్యం వసూలుచేస్తారు- తాటికల్లు తీయడానికి వెదురుతో నిచ్చెనలు తయారుచేసుకున్నందుకు, కల్లుపారడానికి చెట్టకు కట్టే బొంగులకోసం వెదురు వాడుకున్నందుకు ఐదురూపాయల నుంచి పదిరూపాయల దాకా వసూలుచేస్తారు- ఇష్టమొచ్చినప్పుడల్లా కల్లు, కోళ్ళు గుంజుకపోతారు- ఇట్లా ఫారెస్టు అధికారులు అడిగినదేది ఇవ్వకపోయినా ఆదివాసుల మీద కేసులు బనాయిస్తారు- ఈ ఫారెస్టు అధికారులకు, షావుకార్లకు, భూస్వాములకు దోపిడీలో అణచివేతలో సాయంచేయడాని పోలీసులెప్పుడూ సిద్ధంగా వుంటారు- జనాభా లెక్కలు సేకరించడానికి వచ్చిన స్కూల్ టీచర్ కూడా ఒక్కొక్క మనిషిదగ్గర 0-50 పైసలు తీసుకున్నాడంటే 'నాగరికులు' ఆదివాసులనెంత భయంకరంగా దోపిడీ చేస్తున్నారో అర్థమవుతుంది- కనుకనే ఆదివాసులు ఊళ్ళోకి ఎవరైనా ప్యాంటుతో వస్తే కనిపించకుండా పారిపోతారు- గిరిజన కో-ఆప

రేటివ్ సొసైటీల పేర తెరవబడిన దుకాణాలు గిరిజన దోపిడీ కేంద్రాలుగా మారి పోయాయి. అటవీ ఉత్పత్తులను గిరిజనులు ఈ సొసైటీ దుకాణాలలో తప్ప బయట అమ్మగూడదు. బయటికంటె ఈ సొసైటీల్లో కొనుగోలు ధర చాలా తక్కువగా వుంటుంది.

ఇంతమంది ఇన్నిరకాలుగా పీల్చిపిప్పిచేసింతరువాత ఒకప్పుడు అటవీ సంపద కంతా యజమానులైన, అడవి ఉత్పత్తులను స్వేచ్ఛగా అనుభవించిన ఆదివాసుల ఆర్థిక పరిస్థితి విపరీతంగా దిగజారిపోయింది. ఆదివాసుల ఆర్థికస్థితిగురించి 27 గ్రామాలలో సర్వేచేసి తెలుసుకొన్న వివరాలను ఈ వ్యాసంచివర ఇవ్వబడిన అను బంధంలో తెలుసుకోవచ్చు.

ఇలాంటి ఆదివాసులలో ప్రతిఘటన ప్రారంభమైంది. అణచివేత ప్రతిఘటనను దారితీస్తుందనే సత్యం మళ్ళీఒకసారి నిజమైంది. తరతరాలు తమమీద జరుగుతున్న అణచివేతను ఆదివాసులు ప్రతిఘటించ నిశ్చయించుకున్నారు. బూర్జువా పత్రికలు ప్రచారంచేస్తున్నట్టు ఈ ప్రతిఘటనకు గిరిజనులను 'రెచ్చగొట్టింది' ఒక్కవ్యక్తి కాదు, ఆదివాసులలో ప్రతిఘటనా చైతన్యాన్ని కలిగించిందీ, రగిలించిందీ పార్టీ, గిరిజన రైతుకూలిసంఘం, పొరకలపార్టీ. "వ్యక్తి కీకన్నులు రెండేరెండు, పార్టీకున్నవి సహస్రనేత్రాల్", సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఆదివాసులలో పనిచేయడం ప్రారంభించింది. నలభై ఏళ్ళకిందటి కొమురంభీము పోరాట వారసత్వాన్ని పార్టీవాళ్ళకు గుర్తుచేసింది. 1940-45 మధ్య నిజాం ఫారెస్టుఅధికారుల నిరంకుశత్వానికీ, దోపిడీకి వ్యతిరేకంగా బాబేఝరీ, జోడెన్‌ఘాట్, గోందుగూడెం, మోవాడలలో రగులుకొన్న కొలిమిని నలభైఏళ్ళతర్వాత పార్టీ కార్యకర్తలు తమ "ఊపిరితిత్తులతో ఊది ఊది మండించారు". ఫారెస్టు అధికారుల బలం-కార్యక్రమంతో వీరోచితంగా నడిచిన ఆ పోరాటక్రమంలో ఆదివాసులు నిజాంసైన్యంతోకూడా తలపడవలసి వచ్చింది. ఆ పోరాటానికి నాయకత్వం వహించిన కొమురంభీమునూ, పదిమంది సహచరులనూ నిజాంసైన్యం జోడెన్‌ఘాట్‌వద్ద కాల్చివేసింది. ఆ మృతవీరుల మరణాలకు బదులు తీర్చుకోవలసిన అవసరాన్ని, దోపిడీవ్యవస్థను కూల్చేయవలసిన అవసరాన్ని పొరకల పార్టీ ఆదివాసులకు తెలియజెప్పింది. 'ఏటిపాట కొండసిగను చేరింది'. ఆదివాసుల సాంప్రదాయక రగల్‌జెండా పొరకలపార్టీ ఎర్రజెండాతో మమేకమైంది.

ఆదివాసుల ప్రతిఘటనా చైతన్యానికి భూమిసమస్య మొట్టమొదటి పాదువేసింది.

దాన్ని ప్రభుత్వం వాళ్ళను వాళ్ళభూములనుంచి తరిమేసింది- గూడాలు తగులబెట్టింది. సాగుభూములను బీళ్ళుచేసింది- సాగుభూముల్లో పిచ్చిదుమ్మల ప్లాంటేషన్లు నాటింది- తమభూమిని అన్యాయంగా ఆక్రమించిన ప్రభుత్వంమీద ఆదివాసులు తిరుగబడ్డారు- పిప్పల్‌ధరిలో ప్రభుత్వ దురాక్రమణకు గురైన 100 ఎకరాల ప్లాంటేషన్‌ను నరికి సాగుచేసుకోవడంతో ఆదిలాబాద్ ఆదివాసుల పోరాటం ప్రారంభమైంది. ఈ సంఘటన ప్రేరణతో తుమ్మగూడెం రైతాంగం 500 ఎకరాల ప్లాంటేషన్ నరికి సాగుజేసింది- ఉట్నూరుతాలూకా పిప్పల్‌ధరి, తుమ్మగూడెం, దేవాపూర్, చించుఘాట్, నిజాంగూడ, తిప్ప, అజ్జని, గాదెగూడ, తోషం, దిబ్బగూడ, కానాపూర్- ఒకటేమిటి- ఉట్నూరు అడవంటుకుంది. ఉట్నూరుతాలూకా రైతాంగం సంఘటితమై పోలీసుల, ఫారెస్టుఅధికారుల జులుంకు, భూస్వాములదోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించింది.

ఆసిఫాబాదు తాలూకా వాంకేడ్‌లో పెద్దసంత జరుగుతుంది- ఇది మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగ్రామం- ఎమర్జెన్సీ ఎత్తివేసిన కొత్తలోనే 'పోరకలదొర' పిలుపుపై ఈసంతకు వందలకొద్ది బండ్లుకట్టుకొని గిరిజనులు తమవద్ద ఎమర్జెన్సీలో వడ్డీవ్యాపారులు, భూస్వాములు గిరివిపెట్టుకున్న వస్తువులు స్వాధీనం చేసుకోవడానికి వచ్చారు- ఎన్నోగ్రామాలనుంచి వందలబండ్లతో గిరిజనులు తరలివస్తున్నారని తెలిసి పోలీసులు మోహరించి వాంకేడ్‌సంతపై దాడిచేసి లాఠీచార్జ్ చేసారు, ఎందరో గిరిజనులను అరెస్టు చేసారు. పోరకలదొరగా పిలవబడుతున్న కామ్రేడ్ లక్ష్మీకాంతాన్ని అరెస్టుచేసారు. గిరిజనుల ఈ కదలిక శ్రీకాకుళ పోరాటంకన్నా పూర్వం గున్నమ్మ నాయకత్వంలో కొండమీదికి వందలబండ్లు కట్టుకొని వెళ్ళి కట్టెలు కొట్టుకొనివచ్చిన గిరిజనుల సంఘటితశక్తిని గుర్తుకు తెచ్చింది.

అసిఫాబాద్ తాలూకా మర్రిగూడ, వెలిగి, కాపుగూడ, నౌగాం, సైనుగూడ గ్రామాల గిరిజన రైతాంగం నౌగాం గ్రామ భూస్వామి, అసిఫాబాద్‌షావుకారు కలిసి అక్రమంగా ఆక్రమించిన 1[illegible]0 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. వాంకిడి పంచాయితీలోని మెట్టపనీ లోయలో గిరిజనులు 200 ఎకరాల అడవి నరికి సాగులోకి తెచ్చుకున్నారు. సిర్పూరు తాలూకా సోమిని గ్రామ రైతాంగం బెజ్జూరు భూస్వామి హుసేన్ అలీ అక్రమంగా ఆక్రమించుకొని వున్న 60 ఎకరాల భూమి స్వాధీనం చేసుకున్నారు. భూస్వామి రౌడీలనూ,- పోలీసులనూ, పట్వారీ, గిర్దావర్‌లనూ వెంటపెట్టు

జరిపినా బెదరకుండా జనం ప్రతిఘటించారు. ఆ తర్వాత భూస్వామి రిజర్వ్ పోలీసుల సాయంతో గ్రామం మీద దాడిచేసి పదముగ్గురు రైతుల్ని అరెస్టు చేయించాడు. సిర్పూరు తాలూకా కొండపల్లిలో రైతాంగం భూస్వామి ఆక్రమించుకొని ఉన్న 50 ఎకరాల భూమినీ, 12 జతల ఎడ్లనూ స్వాధీనం చేసుకున్నారు. సిర్పూరు తాలూకా బారేగూడెం, ముంజంపల్లి గ్రామాల్లో రైతాంగం 250 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రామ రైతాంగం సిర్పూరులో సబ్ కలెక్టరును, తహసీల్దారునూ ఘెరావ్ చేసి వెయ్యి ఎకరాల భూమిమీద కౌలుదారీ పత్రాలు సాధించుకున్నారు.

ఆదిలాబాద్ తాలూకా లోహెర, సాలెగూడెం గ్రామాల్లో రైతాంగానికి పట్టాలున్నప్పటికీ ఫారెస్టు అధికారులు 259 ఎకరాల భూమిని ఆక్రమించుకోగా గిరిజన రైతుకూలిసంఘం నాయకత్వాన ప్రజలు ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. హాలీఘాట్ గ్రామభూస్వామి ఆక్రమణలోవున్న 20 ఎకరాలభూమిని ప్రజలుస్వాధీనం చేసుకున్నారు. అసిఫాబాద్ తాలూకా సోనాపూర్ ప్రజలు ఫారెస్టు అధికారులనుంచి 30 ఎకరాలభూమి స్వాధీనం చేసుకున్నారు. అసిఫాబాద్ తాలూకా దరిగాం గ్రామంలో ఫారెస్టు అధికారులనుంచి ప్రజలు 15 ఎకరాలభూమి స్వాధీనం చేసుకున్నారు. ఉట్నూరు తాలూకా గెర్సన్‌పటార్, దుబ్బగూడెం, పత్తనూరు, సమొక, కేస్‌వాగూడా, ఘోడుందా, నర్సాపూర్, సుంగాపూర్, మాంజిరి, దేవపూర్, గిన్నెర, తోమగూడెం, యశోద, కేస్లాపూర్, తోషం, బొర్రిపద్ది, పరుశవాడ, అర్జుని, గట్టెపల్లి, సిరికొండ, రిమ్మ, పిట్టబొంగరం, దోంగర్‌గామ్, హీరాపూర్ గ్రామాల ప్రజలు ఫారెస్టు అధికారులు ఆక్రమించుకొని బీడుపడేసిన, ప్లాంటేషన్లు నాటిన భూమిని, కొత్తగా అడవిని నరికి మొత్తం 1600 ఎకరాల భూమిని సాగుచేశారు.

ఆదిలాబాద్ తాలూకా తిప్ప, బెమిరిగూడెం, సైత్‌పూర్, ఖడ్కి, లోహక్, గార్కుగూడెం, పాటగూడెం, బండగూడెం, మొలలగుట్ట, ఖానాపూర్, బోలేగామ్ గ్రామాల ప్రజలు ఫారెస్టు అధికారుల నిర్బంధం నుంచి 900 ఎకరాల భూమిని విడిపించి సాగులోకి తెచ్చారు.

గుడిసెలు కాలిపోయిన పునాగూడ ప్రజలు అడవికొట్టి గుడిసెలు వేసుకోగా పోలీసులు, ఫారెస్టు అధికారులు వచ్చి గుడిసెలు కాలబెట్టారు. ఆగ్రామ ప్రజలందరూ ఇంద్రవెల్లి ఫారెస్టు ఆఫీసుముందు బైఠాయింపు జరిపి తమ భూమి తాము స్వాధీనం చేసుకున్నారు.

ఇట్లా ప్రభుత్వం ప్లాంటేషన్ అనీ, రిజర్వ్ ఫారెస్ట్ అనీ, ఇంకా అనేక సాకులతో అక్రమంగా ఆక్రమించుకునివున్న భూమిని గిరిజనులు స్వాధీనం చేసుకున్నారు.

నేలతల్లి చెర విడిపించారు. వేలఎకరాల భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బతుకుతెరువులేని నిరుపేద వర్గాల వాళ్ళు, స్థానిక ఆదివాసులు కలిసి అడవి పలచగావున్న ప్రాంతాల్లో అడవిసరికి భూమిని సాగులోకి తెచ్చారు. ఇట్లా సాగులోకి వచ్చిన భూమి ఎనభై వేల ఎకరాలు. మొదట లంచాలు తీసుకొని సాగు చేయడానికనుమతించిన ఫారెస్టు అధికారులే అడవిసరికారని వీళ్ళమీద కేసులుపెట్టారు.

చౌకీదారు, దఫేదారు, జనాభా లెక్కల పంతులు, పట్వారీ, గిర్దావర్, సిపిఐ నాయకులు, కాంగ్రెస్ఐ నాయకులు.... ఎవడు పడితేవాడు ప్యాంటున్నవాడల్లా లంచం తీసుకునేవాడే. తమతోపాటు భూమిని పంచుకోవడానికొచ్చి తమ మీద అధికారం చెలాయిస్తున్న కొందరు గిరిజనేతరులు. పొట్టచేతపట్టుకొని తమ ప్రాంతానికొచ్చి లక్షాధికారులై విపరీతమైన దోపిడీచేస్తున్న షావుకార్లు. అడవిమీద తమ హక్కును గుంజుకుంటున్న ఫారెస్టు అధికారులు. దొంగకేసులు బనాయిస్తున్న పోలీసులు....దగా, దగా, కుడి ఎడమల దగా దగా, ఆదివాసులకు ఎటుచూస్తే అటు దగా. తమ జాతిని నాశనం చేయబోయే ఏదో భయంకరమైన కుట్ర జరుగుతున్నదని ఆదివాసులు ఊహించారు. తమ సంస్కృతిని నామరూపాలు లేకుండా చేసేందుకు 'సభ్యప్రపంచం' కంకణం కట్టుకున్నదని ఆదివాసులకర్థమైపోయింది. వెయ్యి టిఎన్‌టిల శక్తితో వాళ్ళు పేలారు. వర్లీ, సంతాల్, వైనాడ్, బీర్భూమ్, గోపీవల్లభపూర్, సవర, జాతాపు, కోయ, చెంచు, జార్ఖండ్, నాగా, మిజో, సింగ్‌భూమ్, గువా........ఆదివాసుల తిరుగుబాటుల సాంప్రదాయం మరొక మూరాకువేసింది.

ఈ పేలుడు బయటికి వినబడకుండా వుండాలని ప్రభుత్వం వీలయినంత కాకిగోల చేసింది. గిరిజన సంక్షేమనిధులు ప్రకటించింది, గిరిజనుల మూఢనమ్మకాల మీద వ్యాసాలు రాయించి ప్రకటించింది, గిరిజనులమీద కేసులు పెట్టింది. ఈ ప్రయత్నాలన్నీ విఫలమై పోరాటం విజృంభిస్తుంటే, పోరాట వాస్తవాలు బయటి ప్రపంచానికి తెలుస్తుంటే ఇక ఈ పోరాటాన్ని మొత్తంగా గిరిజనులకూ గిరిజనేతరులకూ మధ్య జరుగుతున్న సంఘర్షణగా తప్పుడు ప్రచారం చేసింది.

కాని, నిజానికి ఈపోరాటం ఎక్కడా గిరిజనులకూ గిరిజనేతరులకూ మధ్య పోరాటంగాలేదు. ఆదిలాబాద్ అంతటా ఈపోరాటం దోపిడీదార్లకు వ్యతిరేకంగానో, వాళ్ళ ఏజెంటయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగానో జరుగుతున్నదే. ఖచ్చితంగా ఈపోరాటం ఫారెస్ట్ అధికారులకు, భూస్వాములకు వడ్డీవ్యాపారులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమే. ఈ పోరాటం అంతటా గిరిజనులు, గిరిజనేతరులు దృఢమైన ఐక్యతో

నిలబడి వున్నారు. పోరాటకారులను విభజించి తన పట్టు నిలుపుకుందామనే దురాలోచనతో ప్రభుత్వం మహారాష్ట్రులకు గోండులకుమధ్య, లంబాడీలకు గోండులకుమధ్య విభేదాలు సృష్టిస్తోంది. ఐతే భూస్వాములుగాను, వడ్డీవ్యాపారులుగాను ఉన్నవాళ్ళ గోండులైనా, లంబాడీలైనా, మహారాష్ట్రులైనా, మైదాన ప్రాంతాలనుంచి వచ్చిన ఇతర కులాల వాళ్ళయినా వాళ్ళకు వ్యతిరేకంగా పీడితులందరూ కలిసి పోరాడుతున్నారు. ఈ పోరాటాలలోకూడా ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలే వ్యాప్తిలోనూ, సంఖ్యలోనూ ఎక్కువ. ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలతో పోలిస్తే భూస్వాములకూ, షావుకార్లకూ వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు తక్కువే. ఈవిషయం పైన ఇచ్చిన పోరాట వివరాలతో మరింత స్పష్టమవుతుంది. ఇక్కడి రైతాంగం ఫారెస్ట్ అధికారుల, పోలీసుల చేతుల్లో తీవ్రమైన అణచివేతకు, దోపిడీకి గురవుతున్నది. కనుక ఇక్కడ ప్రధానంగా పోరాటం ఫారెస్ట్ అధికారులకూ, పోలీసులకూ వ్యతిరేకంగా జరిగేదే. ద్వితీయంగా షావుకార్లకూ, భూస్వాములకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలొస్తాయి, అంతేగాని గిరిజనులూ, గిరిజనేతరులూ ఎక్కడా సంఘర్షించడమూ, తీవ్రమైన పోరాటానికి సంసిద్ధులుగావడమూ జరగనేలేదు.

ఈ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలతో గిరిజన రైతుకూలిసంఘం ఆదిలాబాద్ జిల్లాలో కలిగించిన సంచలనంతో మూడురాష్ట్రాల హోం మంత్రిత్వశాఖలు బెంబేలెత్తి పోయాయి. బస్తర్, చాందా, ఆదిలాబాద్ జిల్లాల పోలీసు యంత్రాంగం, మూడురాష్ట్రాల హోం మంత్రిత్వశాఖలు ఈప్రాంతంమీద తీవ్ర నిర్బంధాన్ని, నిఘానూ కేంద్రీకరించాయి.

చాందాజిల్లా సిరొంచతాలూకా ప్రజలను సంఘటితంచేస్తున్న సి పి ఐ ఎం ఎల్ పీపుల్స్‌వార్‌కు సంబంధించిన ఒక దళ నాయకుడు కామ్రేడ్ పెద్ది శంకర్ 1980 నవంబర్ రెండున మొయిన్‌బిన్‌పేటలో ఒక అబద్ధపు 'ఎన్‌కౌంటర్'లో కాల్చివేయబడ్డాడు.

జనవరి 15న బస్తర్ జిల్లా ఎస్‌పి 'ఈ ప్రాంతంలో నక్సలైట్లకూ, పోలీసులకూ ఎన్‌కౌంటర్ జరిగే ప్రమాదం లేకపోలేద'ని అన్నాడు. జనవరి 19న పోలీసులకూ నక్సలైట్లకూమధ్య కాల్పులు జరిగినట్టు వార్త వచ్చింది. ఈ వార్త శుద్ధ అబద్ధమని ఈ ప్రాంతం పర్యటించిన జర్నలిస్టుల బృందంఒకటి ఫిబ్రవరి 9న ప్రకటించింది.

ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వం 585 మంది గిరిజనులపై కేసులు బనాయించింది 12 గ్రామాలలో పోలీసు క్యాంపులు పెట్టింది. 12 పోలీసు స్టేషన్లలో సాయుధదళాల సంఖ్యను పెంచింది.

ఈ నిర్బంధాన్ని ఆదివాసులు వీరోచితంగా ఎదిరించారు. గిరిజన రైతుకూలి సంఘం నాయకత్వాన ఇంకా దృఢమైన ఐక్యతతో నిలిచారు. గిరిజన రైతుకూలి సంఘం తన మొదటి మహాసభను ఏప్రిల్ 20న ఉట్నూరు తాలూకా ఇంద్రవెల్లి గ్రామంలో నిర్వహించ తలపెట్టింది. ఈ సభకు నలభై నుంచి యాభైవేల మంది గిరిజనులు హాజరవుతారని అంచనా వేయబడింది. ఏప్రిల్ 18 నుంచి ఇంద్రవెల్లిలో మకాం వేసిన జిల్లా పోలీసు అధికారులు సభ జరగనీయకుండా చూడడానికి శపథం పూనారు. ఇంద్రవెల్లికి ఎనిమిది కిలోమీటర్ల దూరం నుంచి పోలీసు వలయం పన్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా సభకు వస్తున్న వేలాదిమంది గిరిజనులను చెదరగొట్టారు. సాయంత్రం వస్తున్న ఇంకొక ఊరేగింపుపై అమానుషంగా చెట్లమీది నుంచి కాల్పులు జరిపారు. ఐదువేల మందికిపైగా వున్న ఈ ఊరేగింపులో వందమంది గిరిజనులు వీరమరణం పొందారు. వంద మంది గిరిజన మృతవీరుల రక్తంలో తడిసి మరింత ఎరుపెక్కిన ఎర్రజెండా ఆదిలాబాద్ గిరిజన జనపదాలమీద విషాదానికి వీడ్కోలు పలికి, విప్లవ శంఖం పూరిస్తూ ఎగురుతోంది.

సభకోసం అరవైమైళ్ళు, ఎక్కడో నిజామాబాద్ జిల్లా సరిహద్దు నుంచి నడచి వచ్చిన టాస్రి గ్రామపు మారు "అడవిలో నడిచేటప్పుడు కత్తి పట్టుకోకుంటే ఎట్లా ?" అని ఎస్పీనడిగిన ప్రశ్న ఆదివాసుల గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నది. ఈ చీకాకుల కీకారణ్యంలోంచి, ఈ పెద్దపులులూ, తోడేళ్ళు నిండిన అడవిలోంచి అరవైమైళ్ళ లాంగ్ మార్చ్ కాదు వేలమైళ్ళ లాంగ్ మార్చ్‌చేసి సమతా సుందర స్వర్గాన్ని చేరుకోవాలంటే కత్తి వుండక తప్పదని, కత్తిని నడిపించే పార్టీ ఉండక తప్పదని ఆదివాసుల అనుభవం మళ్ళీ ఒకసారి స్పష్టంగా తెలియజెప్పింది.

అల్పమైన వర్గపోరాటాన్ని తప్పుడు ప్రచారం చేసి గిరిజన, గిరిజనేతర సమస్యగా మార్చగలిగామని, కమ్యూనిస్టులను నమ్ముకుంటే గోండుల గతేమవుతుందో చెప్పామని, 'ఇక కార్యకర్తలు కనిపిస్తే గోండులు పట్టుకొని తంతార'ని ప్రభాకరరెడ్డి విర్రవీగుతున్నాడు.

పోలీసు కాల్పుల్లో మరణించిన గోండుల శవాలను వారి కుటుంబాల కివ్వకుండా వాళ్ళ సంప్రదాయం ప్రకారం పూడ్చిపెట్టకుండా దహనంచేయించాడు ప్రభాకరరెడ్డి. చంపేసి, నెత్తురంటిన చేతులు కడుక్కుంటే నేరం మాసిపోతుందని మాక్‌బెత్‌లా భ్రమపడుతున్నాడాయన. What is done cannot be undone. తాత్కాలికంగా ఈ దుశ్చర్యలన్నీ మాక్‌బెత్‌ను రాజును చేస్తాయేమోకాని సోదినుంచి, పురాణాలనుంచి, సాహిత్యం నుంచి అన్నిటికీ మించి చరిత్ర నుంచి ఏదైనా పాఠం నేర్చుకోవాలని ప్రభాకరరెడ్డికి, [illegible]

హెచ్చరిక గుర్తుచేసుకోవడం మంచిది- 'పౌరకలు(అడవి) కదలివచ్చి ఆయన రాజ్యాన్ని కూల్చేస్తాయి.' అప్పుడు ఎంవికృష్ణారావో, నారాయణరావో, కొత్తదాసో, పవిత్రనో ఆయననుకాపాడలేరు.

ప్రభాకరరెడ్డికే మాత్రమే కాదు, ఇంకెవడికైనా చరిత్రలో నిరంతరమైన వర్గ పోరాటాన్ని రక్తపుటేర్లలో ముంచైనాసరే ఆపడం సాధ్యం కాదు. 'అంతం కాదిది ఆరంభం.'

వందమంది గిరిజన మృతవీరుల కంఠాలు నినదిస్తున్నాయి. "ఈసారి మేం దెబ్బతిన్నాం. కాని ఇది అంతంకాదు. మేంచాలా నేర్చుకున్నాం. ఇనుమడించిన పోరాటచతురతతో, రెట్టింపు క్రమశిక్షణతో మరింత బలవంతులమై మళ్ళీ ఉద్యమ లక్ష్యంవైపు నిరాఘాటంగా సాగుతాం".

గిరిజన కామ్రేడ్స్ మరణాలకు ప్రతీకారం తప్పనిసరిగా తీర్చుకోబడుతుంది. ఆప్రతీకారానికి [illegible] ఏప్రిల్‌తో ఇంద్రవెల్లిలో పోలీసుకాల్పులు జరిగిన పదిరోజులకే అడవిలో జరిగిన మేడే బహిరంగసభలో ఒక గిరిజనుడు వివరించాడు. "గోండుగిరిజనోంపే పోలీస జులుం నాశకమయానా" (గోండు గిరిజనులపై పోలీసుజులుం నశించాలి) "రడికల్ డియోర్ మైనలీర్ సంఘం జిందాబాద్, పౌరకలపార్టీ జిందాబాద్" "ఉడ్‌వానోంకో భూమి పాయిజతే" (దున్నేవాడికే భూమికావాలి).

పిచ్చితుమ్మల వ్యవస్థను నాశనంచేసి దున్నేవాడికే భూమిని గ్యారంటీచేసే వ్యవసాయ విప్లవానికి నాయకత్వం వహిస్తున్న పౌరకలపార్టీ వ్యవస్థను ఆదివాసులు పీపుల్స్‌వార్‌లో పాల్గొని స్థాపించుకుంటారు.

[ఈ వ్యాసంఅంతటా గిరిజనులను ఆదివాసులుఅని పిలవడం జరిగింది ఆసియా దేశాల గిరిజనుల గురించి విస్తృత పరిశోధనలు జరిపిన ఆస్ట్రియా ఆంత్రోపాలజిస్ట్ క్రిస్టాఫ్ వాన్ ఫ్యురర్ హేమెన్‌డార్ఫ్ గిరిజనులను tribals అని కాకుండా aboriginals అని పిలుస్తాడు. ఈపదానికి సరైనఅర్థం 'అనాదినుంచి ఆ ప్రాంతానికి పరిమితమైన, అప్రాంతంలో జీవిస్తున్న ప్రజలు' అని. అందుకనే ఆదిలాబాద్ అడవి ప్రాంత ప్రజలను ఆదివాసులు అనిపిలవడం సరైనదదే ఉద్దేశ్యంతో ఆ పదం వాడడం జరిగింది.]

సవరణ

67వ పేజీలో అజ్ఞాత సూరీడు కవిత శీర్షిక 'రక్తహోళీ' ఇంద్రవెల్లి! శీర్షిక కాదు, కవితలోని మొదటి చరణం.

గిరిజనుల ఆర్థిక స్థితిగతులు - ఒక పరిశీలన

వరుస సంఖ్య	గ్రామం పేరు	కుటుంబాల సంఖ్య	కుటుంబ జనసంఖ్య	కులం	నీటి సదుపాయము		
					త్రాగడానికి నీటి ఆధారం	భూములకు	
						బావి	చెరువు
1	2	3	4	5	0	7	8
1	అ	25 (గుడిశెలు)		కోయ	బావి (ఎండకాలం వుండవు)		చిన్నకుంట
2	ఆ	8 (గుడిశెలు)			వాగు	లేదు	లేదు
3	ఇ	30 (3,4 గూనవి)			బావి		లేదు
4	ఈ	100		కోయ, కమ్మ నేతకాని గౌడ కోమటి	లేదు (ఎండకాలం చాలాకష్టం)		
5	ఉ	130		ఓడవాళ్ళ, కోయ	,,		
6	ఊ	156		కమ్మ, కోయ నాయకపు	,,		
7	ఎ	25	200	కోయ, కమ్మ గౌడ, వోడ	గోదావరినది		లేదు
8	ఏ	200		బెస్త, ఓడ కోయ	లేదు	లేదు	లేదు
9	ఐ	20			బావి	లేదు	చిన్నకుంట
10	ఒ	12			,,	లేదు	లేదు
11	ఓ	25			,,	,,	లేదు
12	ఔ	30			,,		,,
13	క	17	150				

అప్పులు	ఆసుపత్రి	బస్సు	స్కూల్	వ్యవసాయ పద్ధతి	ఫారెస్టు అధికారులదోపిడి	వడ్డీ లేదా పెచ్చులు
9	10	11	12	13	14	15
	లేదు	10 కి. మీ. దూరం	లేదు	వర్షాధారం నాగలి	వెట్టి, లంచాలు (రూ 5నుండి 500) కోళ్లు	100 రూ 150 రూ సం॥ అంటే 50%
	,,	దూరం	,,		మొత్తం పై విధంగానే	మొత్తం పై విధంగానే
	,,		,,	,,		
		,,				
	,,		,,	(సర్పంచ్‌కు ట్రాక్టరు)		
		,,				
	,,		,,			
		,,	,,	వర్షాధారం నాగలి		
	,,					
		,,				
	,,		,,	,,		
		,,				
	,,		,,	,,		
		,,				
	,,	లేవు	,, 3వ తరగతి	,,		
	,,		లేదు	,,		
	లేదు			వ్యవసాయం లేదు		
ఇంటికి రూ. 100 చొప్పున 3సం. క్రితం ఇచ్చారు ఇంకా కట్టలేదు	,,	,,	వుంది ఒకపూట పిల్లలకు భోజనం ఒకడే టీచర్	,, వర్షాధారం నాగలి		

1	2	3	4	5	6	7	8
14	ఖ	38		కోయ నాయికపుగొడ	1¼కి.మీ. దూరం వెల్లాలి బావిలేదు		
15	గ	25		చాకలి మంగలి		చెరువువుంది కాని భూములుపక్క	చిన్న చెరువు
16	ఘ	64		కోయ	బావివుంది	గ్రామానికి	వుంది
17	చ	37	280	దొరచట్టం కోయ, ఒడ 20	కాని ఎండకాలం నీల్లు దొరకవు	చెందిన పెరక కమ్మకులాల	లేదు
18	ఛ	43		నేతకాని 10 మాదిగ1 మాల 8	ప్రక్కగుంపు దగ్గరవుంది బావివుంది	వారివి లేదు	
19	జ	20	150	కోయ మాదిగ 19 1	రెండుబావులు		
20	ఝ	32	280	కోయ, మాల 25 3 పద్మశాలి 1 రాజు2 తుర్క1			చెరువు
21	ట	120	700	ఒడ 80 మాదిగ 40	రెండు		చెరువు
22	ఠ	70	400	కోయ 60 నాతకాని 8 కాపు 1 మాదిగ 1	వాగు		చెరువు
23	డ	6	32	కోయ			
24	ఢ	75	600	కోయ 74 చాకలి 1	వాగు		
25	త	48	260	కోయ 42 ఒడ 5 కాపు1	బావి		
26	థ	73	450	కోయ 62 మాదిగ 8 తెలగ 1 నాలాబి			చెరువు
27	ద	27	200	కోయ			

9	10	11	12	13	14	15
4,5 రైతులకు రూ 1000to 2000 వరకు బ్యాంక్ అప్పు	వుంది కాని డాక్టర్ వుండడు దగ్గరి తా॥ సెంటర్‌లో వుంటాడు		వుంది 3వతరగతి ఒకపూట అన్నం పిల్లలకు		,, ,,	,, ,,
			2వ తరగతి		,,	,,
			5వ తరగతి		,,	,,
4 కుటుంబాలకు	లేదు లేదు	లేవు	1 టీచర్ కాని తాలూకాసంటర్లో వారంవుంటే స్కూల్‌కు వారం వస్తాడు.	వర్షాధారం	,,	,,
1 కుటుంబం 800/-					,,	,,
			వుంది ఒక పూట గోధుమ రవ్వ		,,	,,
			5వ తరగతి బడి వుంది		,,	,,
			వుంది 1 టీచర్ 60 పిల్లలు			
					,,	,,
			బడి వుంది పంతులు లేడు		,,	,,
					,,	,,
LMB సగదు+ ఇంజను			3వ తరగతి		,,	,,
			5వ తరగతి	2 ట్రాక్టర్లు మిగతా వారు నాగలి	,,	,,
					,,	,,

గ్రామం వారీగా ఆయా కులాల కుటుంబాలకు సంబంధించిన భూమి వివరాలు

1. అ గ్రామం మొత్తం మీద50 ఎకరాల కుష్కి, 8 ఎకరాలతరి - వర్షాధారపు భూమి.

2. ఆ భూమిలేదు- వెదురులో బుట్టలు, తట్టలుఅల్లి అమ్ముకుంటారు.

3. ఇ 10 కుటుంబాలకు 4 నుండి 5 ఎకరాలవరకు వుంది. 20 కుటుంబాలకు సెంటుకూడా భూమిలేదు.

4. ఈ కొన్ని కుటుంబాలకు 3 నుండి 4 ఎకరాలు
కొన్ని ,, 10 నుండి 15 ,,
కమ్మ ,, 15 నుండి 20 ,,
సర్పంచ్‌కు ఒక్కడికి 70 ఎకరాలు + ఒక ట్రాక్టర్

5. ఉ కొన్ని కులాలకు 5 నుండి 10
,, ,, 2 నుండి 3

6. ఊ 3, 4 కమ్మ కుటుంబాలకు 100 నుండి 500 ఎకరాలు
కోయ కుటుంబాలకు 10 నుండి 15 కొంతమందికి
,, ,, 1 నుండి 5 ,,
సెంటు భూమికూడా లేని కుటుంబాలు కూడా వున్నాయి.

7. ఎ కోయ కులస్థులకు 3 నుండి 4 ప్రతికుటుంబానికి
కమ్మ ,, 10 నుండి 15
ఓడ ,, 5 నుండి 10

8. ఏ 150 ఎకరాల (Govt భూమి) లంకగడ్డను పంచుకున్నారు- ఇంటికి 2 ఎకరాలు వచ్చింది. ఇదిగాక 10 కుటుంబాలవారికి అడివినిఆనుకొని ఒక్కొ ఎకరంవుంది.
ఓడ కులస్థులకు ఇంటికి 4-5 ఎకరాలు
బెస్త ,, ,, 7-8 ,,
కాపు ,, కుటుంబం (1) 40 ఎకరాలు

9. ఐ ½-1-2 ఎకరాలచొప్పున 20 కుటుంబాలకుకూడా భూమివుంది.

10. ఒ 2 కుటుంబాలకు 2,3 ఎకరాలు మొత్తం- 5 ఎకరాలు మాత్రమే వుంది.

11. ఓ మొత్తం దుబ్బచెలకలు 10, 12 కుటుంబాలకు 1 నుండి 2 ఎకరాలు

12. ఔ 2-3 ఎకరాలు కొన్ని కుటుంబాలు
5-8 ,, ,,

13. క 5 కుటుంబాలకు 5 నుండి 8 ఎకరాలు
12 ,, ఒక్కొక్కరికి 1 ఎకరం (ఏమీపండదు- అల్లకం తట్టలు, బుట్టలు ప్రధానం)

14. ఖ కోయ 6 కుటుంబాలకు 2 ఎకరాల చొప్పున
నాయకపు 10 ,, 2½ ,,
గౌడ 4 ,, 3 ,,

15. గ 5 కుటుంబాలకు 8 నుండి 12 ఎకరాలు
కొన్ని ,, 4 నుండి 7 ,,
,, ,, 2 నుండి 4 ,,
(అందరికీ భూమిఉంది)

16. ఘ 30 కుటుంబాలకు 3 నుండి 4 ఎకరాలు
20 ,, 5 నుండి 7 ,,
9 ,, 8 నుండి 12 ,,
(చాకలి (2)కు. మంగలి (1)కు. సెంటు భూమికూడాలేదు.)

17. చ 15 కుటుంబాలకు ఇంటికి 5 ఎకరాల చొప్పున (ప్రభుత్వం ఇచ్చింది)
17 ,, ,, 1 ఎకరం చొప్పునవుంది
(6 కుటుంబాలకు మాత్రమే వ్యవసాయంవుంది.)

[పైభూమినుండి ప్రాజెక్టుకొరకు మట్టితవ్వారు- అందువల్ల ప్రస్తుతం సేద్యయోగ్యంకాదు- ప్రత్యామ్నాయంగా భూమిఇవ్వకుండా ప్రభుత్వం రూ 50 నుండి 100 మాత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నారు.]

18. ఛ ఓడవారికి ఒక్కొకుటుంబానికి 3 నుండి 4 ఎక. చొప్పున
కోయ ,, ,, 2 నుండి 3 ,,
(మిగతా కులాలవారికి భూమిలేదు.)

19. జ 5 ఎకరాల చొప్పున 5 కుటుంబాలకు
2 ,, ,, 5 ,,
1 ,, ,, 6 ,,
(4 కుటుంబాలకు భూమి అసలే లేదు)

20. ఞ 10 ఎ. చొప్పున 5 కుటుంబాలు
3 నుండి 8 ఎ ,, 22 ,,
(భూమి అసలేలేని కుటుంబాలు 5)

21. ట 2 నుండి 5 ఎకరాల చొప్పున 65 ఓడ కులస్థులవారికి
1 నుండి 3 ,, ,, 30 మాదిగ ,,
(15 ఓడ 10 మాదిగ కుటుంబాలకు భూమి అసలేలేదు.)

22. ఠ 5 నుండి 8 ఎక. కోయ కులం 10 మందికి
2 నుండి 5 ఎక 40 మందికి
1 నుండి 2 ఎక 10 కుటుంబాలు
(10 యిండ్లవారికి భూమి అసలే లేదు)

23. డ 2 నుండి 3 ఎక 5 ఇండ్లవారికి
20 ఎక ఒక కుటుంబానికి

24. ఢ 10 ఎకరాల చొప్పున 5 గురికి
8 ,, ,, 15 ,,
2 నుండి 3 ,, 30 ,,
½ నుండి 1 ,, 20 ,,
(భూమి అసలే లేని కుటుంబాలు 5)

25. త 20 ఎకరాల చొప్పున 3 కుటుంబాల వారికి కోయ వారికి
2 నుండి 3 ,, 30 ,, ,,
10 ,, 5 ,, ఓడ కులస్థులు
(10 కుటుంబాలకు భూమి లేదు)

26. థ 100 ఎకరాలు ఒక కుటుంబానికి వుంది.
70 ,, చొప్పున రెండు కుటుంబాలకు వుంది
పైమూడు కుటుంబాలకు కలిపి 2 ట్రాక్టర్లు
5 నుండి 10 ఎకరాలు చొప్పున 20 కుటుంబాల వారికి
1 నుండి 2 ,, ,, మిగతా ,, ,,

27. ద 25 ఎకరాలు ఒకే కుటుంబానికి వుంది
12 ,, చొప్పున 4 ,, ,,
5 నుండి 8 ,, ,, 22 ,, ,,

[illegible]

'రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను పరోక్షంగా అంగీకరిస్తున్నది'

ఆదిలాబాద్ ఆదివాసులు

ఇంద్రవెల్లి కాల్పులపై విచారణ

పీపుల్స్ యూనియన్ ఫార్ డెమాక్రెటిక్ రైట్స్, ఢిల్లీ - నిజనిర్ధారణ కమిటీ రిపోర్టు

పి. యు. డి. ఆర్. తరఫున ఒక నిజనిర్ధారణ కమిటీ ఏప్రిల్ 20, 1981 న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల గురించి నిజాలు తెలుసుకోవడానికి ఆదిలాబాద్ వెళ్ళింది. కమిటీలో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రజాపాలనాశాఖ రీడర్ డా. వి. శివలింగ ప్రసాద్, కాకతీయ విశ్వవిద్యాలయంలో లెక్చరర్ డా. మురళీమనోహర్, అడ్వొకేట్ శ్రీ తోకల లక్ష్మారెడ్డి (ఆం. ప్ర. రాష్ట్ర పౌరహక్కుల సంఘం వరంగల్ యూనిట్ అధ్యక్షుడు), డాక్టర్ రామనాథం ఉన్నారు. వీరికి సహాయంగా శ్రీ కె.వి. రమణారెడ్డి [జవహర్ భారతి, కావలి] వెళ్ళారు. ఈ కమిటీ జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్, తాలూకా కేంద్రమైన ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇంకా దాని చుట్టుప్రక్కల గ్రామాలు 2, 3 మే 1981 న పర్యటించింది.

ఈ కమిటీ పోలీసు కాల్పులకు దారితీసిన సంఘటనల వాస్తవాలు, ఆప్రాంతంలో ఏర్పడ్డ ఉద్రిక్తతకు సాంఘిక ఆర్థిక కారణాలు నిర్ధారించడానికి ఏర్పడింది.

ఉట్నూరు తాలూకాలో గ్రామస్తులతో మాట్లాడాక, కాంగ్రెస్(ఐ)తో సహా అన్ని పార్టీల రాజకీయ కార్యకర్తలను కలిసాక, పోలీసు సూపరింటెండెంట్‌తో సహా వివిధ అధికారులను ఇంటర్వ్యూ చేసాక కమిటీ ఈ కింది ప్రాథమిక విషయాలను కనుగొన్నది.

1. గిరిజన రైతుకూలి సంఘం మహాసభ అకస్మాత్తుగా నిర్ణయించబడింది కాదు. 20 ఏప్రిల్ 1981న ర్యాలీ నిర్వహించడానికి తగినంత వ్యవధితోనే నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ ర్యాలీపై పోలీసులు కాల్పులు జరిపారు.

2. గిరిజన రైతుకూలి సంఘానికి వ్యతిరేకులయిన స్థానికుల తరఫున పోలీసులు ర్యాలీని జరగనివ్వకుండా చేయాలని నిశ్చయించుకున్నారనడానికి ఆధారాలున్నాయి.

3. పోలీసులు ఇంద్రవెల్లికి అరకిలోమీటరు దూరంలో మజిలీచేసి ముందు హెచ్చరిక లేకుండానే కాల్పులు జరిపారు.

4. మరణించిన వారి సంఖ్య పోలీసులు చెప్పినట్టు 13 కాక ఎక్కువే వుంటుంది- చనిపోయినవారి సంఖ్య 60, గాయపడ్డవారి సంఖ్య 100 దాకా వుంటుందని నమ్మకంగా తెలిసింది- నిజానికి పోలీసులు శవాలను దహనం చేయడంవల్ల సరియైన సంఖ్య తెలుసుకోవడం కష్టమవుతున్నది.

5. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతకు పేదగోండులను వాళ్ళ జీవనాధారాలైన భూమి, అడవి సంపదలనుంచి వేరుచేయడం కారణం- రాష్ట్రప్రభుత్వ అవకతవక పద్ధతులు, అధికారులు గిరిజనేతర వర్తకులతో, దళారీలతో కుమ్మక్కయి పనిచేయడం గిరిజనుల అసంతృప్తికి దోహదం చేశాయి- క్రమంగా ప్రభుత్వం గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య, గోండులకు లంబాడాలకు మధ్య కులతత్వాన్ని పెంపొందించింది- గిరిజనులు ఐక్యంగా సంఘటితం కావడానికి చేస్తున్న కృషి ప్రభుత్వ యంత్రాంగం నుంచి గట్టి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సివస్తున్నది.

గిరిజన రాజ్యమైన 'గోండ్వానా'లో భాగమైన ఆదిలాబాద్ ఆంధ్రప్రదేశ్ సరిహద్దునవున్న మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లాకు పశ్చిమానఉన్నది. విస్తారమైన అరణ్య ప్రాంతంగలిగి, ఖనిజ సంపదలుఉండి ఆంధ్రప్రదేశ్ వెనకబడిన జిల్లాగా రాష్ట్ర ప్రణాళికా శాఖాధికారులు పేర్కొన్నారు. 1940ల్లో బాబెఝరి తిరుగుబాటుగా పేరుబడ్డ కొమరం భీం నైజాం వ్యతిరేక పోరాటం, ఆస్ట్రియా దేశానికిచెందిన మానవీయ శాస్త్రజ్ఞుడు క్రిస్టోఫ్ వాన్‌హేమెన్‌డార్ఫ్ ప్రయత్నాలవల్ల, ఆదిలాబాద్‌జిల్లా వెలుగులోకి వచ్చింది. తర్వాత కొద్దికాలంలోనే నైజాం సంస్థానంతోపాటు ఈప్రాంతం ఇండియన్ యూనియన్‌లో భాగమైంది. అప్పటినుంచి గిరిజన అభివృద్ధి కార్యక్రమాలు మొదలయినయి. అయినా మూడు దశాబ్దాలనుంచి సుదూర అడవిప్రాంత గ్రామాలన్నీ ఈ అభివృద్ధి కార్యక్రమాలకి దూరంగానే ఉన్నాయి.

జిల్లాలోని 16 లక్షల జనాభాలో 14% గిరిజనులు, గోండులు (70%) కోలమ్, కోయ, పరధాన్‌లు గిరిజన జనాభాలో ఎక్కువ. వ్యవసాయమే ప్రధాన జీవనోపాధి. కాని ఉత్పత్తి తక్కువగావచ్చే భూములు, 5% భూమికిమాత్రమే నీటి వనరులు ఉన్నవి. భూమిపట్టాలు ఈ ప్రాంతంలో తీవ్రమైన అసమానతలున్నట్లు స్పష్టంచేస్తాయి.

ఈ జిల్లాలో (రాష్ట్రమంతటికన్నా) అక్షరాస్యత తక్కువ (14. 15%) వైద్య సదుపాయాలు తక్కువ (12 లక్షల జనాభాకి 111 డాక్టర్లు), విద్యుచ్ఛక్తిఉన్న

గ్రామాలు తక్కువ. (1609 గ్రామాలకు 728), రవాణాసౌకర్యాలు తక్కువ (16 వేల చ. కి. మీ వైశాల్యానికి 860 కిమీ పొడవైనరోడ్డు).

కాని దక్షిణ భారతదేశంలోనే పెద్దదైన సింగరేణి కాలరీస్‌లో భాగమైన బొగ్గు గనులు ఈజిల్లాలో అభివృద్ధిచెందడం చెప్పుకోదగ్గఅంశం. అటవీ పరిశ్రమల (టేకు, పేపర్)తోపాటు సిమెంట్, ఎరువుల పరిశ్రమలుకూడా అభివృద్ధి చెందాయి. రాష్ట్ర పారిశ్రామికాదాయంలో 10%కంటె ఎక్కువే ఈ జిల్లానుంచి వస్తుంది. కాని ఇది స్థానిక గిరిజనులకు చెందదు. 20 వేల గనికార్మికుల్లో 7% మాత్రమే గిరిజనులు.

ఉద్రిక్తతకు కారణమయిన రెండువిషయాలు (1) గిరిజలకు అడవికీమధ్యఉన్న సంబంధం (2) గిరిజనులకు భూమికీమధ్యనున్న సంబంధం - ప్రస్తుతఘర్షణ అర్థం కావడానికి పరీక్షించాలి.

<u>అడవి-గిరిజనులు</u> :- ఆదిలాబాద్ భౌగోళిక వైశాల్యంలో 44% అడవులు. వివిధ రకాలైన టేక్‌అడవులు ముఖ్యంగా 54% అడవి ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. మిగిలిన ప్రాంతంలో 27% వెదురువనాలు. ఈ ప్రాంతంలో ఎక్కువభాగం రాష్ట్ర ప్రభుత్వంచే అడవుల పెంపుదల కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా నిర్ణయించ బడ్డది.

అడవిని ప్రభుత్వం సాధారణంగా పరిశ్రమలకొరకు ప్రైవేట్ సంస్థలకు లేక కంట్రాక్టర్లకు కౌలుకిస్తుంది. సిర్‌పూర్‌లోని పేపరుమిల్లుకొరకు దశాబ్దంపైగా వేల ఎకరాల వెదురువనం బిర్లాల కంట్రాక్టులోఉంది చెట్లను పడగొట్టడానికిగాను ప్రైవేట్ సంస్థల, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ప్రైవేట్ లేబర్ కంట్రాక్టర్లను నియమించారు- కనీసవేతనం కోసం జరుగుతున్న కార్మిక ఉద్యమాలు పుంజుకోవడం వల్ల ప్రభుత్వం తన ఆధీనంలో ఉన్న అడవుల్లో ప్రైవేట్ కంట్రాక్టర్ల పద్ధతి రద్దు చేసినావాళ్ళు పారిశ్రామికవేత్తల ఆధీనంలో ఉన్న అడవుల్లో పెత్తనం చెలాయిస్తూనే ఉన్నారు- రాష్ట్రప్రభుత్వం ఏటా 200 మిలియన్ల రూ॥లు అడవినుంచి సంపాదిస్తున్నది.

ప్రైవేట్ భూస్వాముల ఆధీనంలో ఉన్న అడవుల్లో చాలా ప్రాంతం వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు- ముఖ్యంగా నిజాం హయాంలోని అడవి ప్రాంతాల జాతీయం తర్వాత ప్రభుత్వ ఆధీనంలోఉన్న ప్రాంతాల్లో అడవులను నరికివేసే కార్యక్రమాల్ని నివారించే చట్టాలు, నియమాలెన్ని ఉన్నా అడవుల్లో కొంతభాగం ఎప్పటికీ ప్రైవేట్ వ్యాపారానికి ఉపయోగపడే అవకాశాలు కల్పిస్తున్నది ప్రభుత్వం. ఈవిధంగా

గత 20 సంవత్సరాల్లో రాష్ట్రంలో నరికివేయబడిన 5 లక్షల ఎకరాల అడవిలో లక్షన్నర ఎకరాలకు పైగా అడవి ప్రాంతం ఆదిలాబాద్ జిల్లాలోనిది.

ఈ విధమైన అడవుల పెంపకం, అడవులు నరకడం లాంటి విరుద్ధ పద్ధతుల ఫలితంగా గిరిజనుల నుంచి అడవి వేరుపడి వాళ్ళు ప్రైవేట్ కంట్రాక్టర్ల, అటవీ శాఖాధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి రోజు వారీ కూలీలుగా మారిపోవాల్సి వచ్చింది. ఇంతే కాకుండా ఈ విధానం చాలాకాలానికి తీవ్రమైన వాతావరణమార్పులకు కారణమవుతుంది.

<u>భూమి, చట్టాలు - గిరిజనులు :-</u> ఈ ప్రాంతంలో మూడు రకాల వ్యవసాయ భూములున్నాయి/ అడవి మొదల్లోని భూమి. ఇది షాహుకార్ల ఆధీనంలోవుంది. మాజీ అటవీ సంస్థానాల్లోని భూమి రిజర్వ్ ఫారెస్టులోని ప్రాంతంలో గిరిజనులు 'చట్టవ్యతిరేకం'గా సాగులోకి తెచ్చిన భూమి. పరస్పర విరుద్ధమైన చాలా చట్టాలు, నిబంధనలు ఈ ప్రాంతంలో అమల్లోఉన్నాయి. రక్షణ నిబంధనలు 1609 గ్రామాలకు 409 గ్రామాల్లో మాత్రమే అమల్లో ఉన్నాయి. వీటితోపాటు ప్రభుత్వ రెండు శాఖలు అటవీశాఖ, రెవెన్యూశాఖ ఒకదాని పరిధినొకటి తరచు అతిక్రమిస్తుంటాయి.

షాహుకార్ల ఆధీనంలోఉన్న ఉన్న భూమి నిజానికి గిరిజనులది. ఆంధ్ర, మహారాష్ట్ర మైదాన ప్రాంతాలనుంచి వడ్డీవ్యాపారులుగా వచ్చి షాహుకార్లు ఈ భూమిని ఆక్రమించుకొని సంపన్నులైన భూస్వాములుగా స్థిరపడ్డారు. గిరిజన భూమి రక్షణ నిబంధనలు అమలులేనిచోట చాలా ప్రాంతాల్లో వీరి అధికారం ఎదురులేనిది.

1952లో మొత్తం అడవి ప్రాంతం ఇదివరకటి నిజాం హయాంలోని అటవీ సంస్థానాలతో కలిసి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో 'ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ ఏరియా రైతువారి సెటిల్మెంట్ నిబంధన, వర్తిస్తుంది. దానిప్రకారం ఎవ్వరైనా (గిరిజనుడే కావాలని లేదు) 1945 నుంచి తాను భూమిని సాగుచేస్తున్నట్లు నిరూపించగలిగితే అతను పట్టాపొందగలుగుతాడు. సరియైన ఆధారాలు చూపలేక పోవడంవల్ల, రెవెన్యూ అధికారులను ఒప్పించలేక పోవడంవల్ల, నిరక్షరాస్యతవల్ల గిరిజనులు గిరిజనేతరులకన్న అననుకూల పరిస్థితిలో ఉండి ఫలితంగా వాళ్ళ భూమిని పోగొట్టుకుంటున్నారు.

1949లో ప్రభుత్వం తన మొదటి చట్టాన్ని షెడ్యూల్ ఏరియాలో గిరిజన భూములకు రక్షణకలిగేట్లుగా ప్రవేశపెట్టడం ద్వారా గిరిజన భూముల నుంచి గిరిజ

నేతరులను వెళ్ళగొట్టడానికి హక్కును పొందింది. కాని ఈ హక్కును ఉపయోగించడం జరుగలేదు. 1963లో ప్రభుత్వం ఒక సవరణను ప్రవేశపెట్టింది. దానిద్వారా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ఏరియా భూమి క్రమబద్ధంచేసే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అమల్లోఉన్న చట్టం (1959), తెలంగాణాకు, అందువల్ల ఆదిలాబాద్‌కు వర్తిస్తుంది. ఈ చట్టం గిరిజనులు భూమిని గిరిజనేతరులకు బదిలీచేయడాన్ని, స్థిరాస్తిని కుదువపెట్టడాన్ని, అమ్మడాన్ని, కౌలుకివ్వడాన్ని నిషేధిస్తుంది. 1971లో ప్రభుత్వం శ్రీకాకుళ గిరిజన తిరుగుబాటుతో మేలుకొని 1959 చట్టాన్ని సవరిస్తూ మరొక నిబంధనను చేసింది. ఈ నిబంధన ప్రకారం షెడ్యూల్ ఏరియాలోని భూమి మీద స్వామ్యాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత గిరిజనేతర భూస్వాములది. 1978లో ఈ చట్టపరిధిని ఇంకా విస్తరించి దాని ద్వారా స్థిరాస్తిలో భాగంగా భూమే కాకుండా పంటను, చెట్లను కూడా చేర్చారు.

కాని గిరిజనుల భూమి నుంచి షెడ్యూల్ ప్రాంతాల్లోగాని, షెడ్యూల్ ప్రాంతాలు కానిచోటగానీ గిరిజనులను వేరుచేయడం గత మూడు దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా సాగింది. 1960 మధ్యలో ఇంకొక పద్ధతి గమనించకుండానే జరిగిపోయింది. వేలమంది రైతులు వాళ్ళు గిరిజనులు కావచ్చు, మహారాష్ట్ర రైతులు కావచ్చు లేదా లంబాడాలు కావచ్చు అడవి ప్రాంతాన్ని దున్ని సాగులోకి తెచ్చారు. ఈ భూమిని ప్రభుత్వం వ్యవసాయ భూమిగా గుర్తించదు. ఎందుకంటే సాగులోకి తెచ్చిన భూమి రిజర్వు ఫారెస్టు ప్రాంతంలోనిది. గతపదేళ్ళలో ఈ రైతులు తమ వద్దనున్న కొద్ది మొత్తాలు వెచ్చించి పట్టాలు చేయించుకోవడం కోసం, ఫారెస్టు, రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చినా కొన్నిసార్లు రాజకీయ నాయకులకు కూడా లంచాలు ఇచ్చినా పట్టాలు వారిపేర చేయించుకోలేకపోయారు. ఈ విధంగా పేదరైతులు తమ నెత్తురు నీరుచేసి సాగులోకి తెచ్చిన భూమి (రెవెన్యూశాఖ అంచనా ప్రకారం) 15 వేల ఎకరాలు (అటవీశాఖ అంచనా ప్రకారం) 30 వేల ఎకరాలు, (గిరిజన సంఘం అంచనా ప్రకారం) 80 వేల ఎకరాలు.

రెవెన్యూ అటవీశాఖలు అధికారంతోనూ, లంచగొండి తనంతోనూ గిరిజనుల పరిస్థితి అధ్వాన్నంగా చేసారు. భూమి తగాదాలు పరిష్కరించడానికి అధికారం ఉన్న రెవెన్యూశాఖ జిల్లాకు బయట నిజామాబాద్‌లో ఉండి గిరిజనులకు అందుబాటులేదు. 1971 నూతన భూమి చట్టాల ప్రకారం గిరిజనులు పెట్టుకొన్న 11,386 దరఖాస్తులలో 3792 మాత్రమే వాళ్ళకు అనుకూలంగా పరిష్కరింపబడ్డాయి. కొంత మంది గిరిజ

నేతరులు కోర్టులనుంచి స్టే తెచ్చి పరిష్కారంలో జాప్యం జరిగేట్టు చేయగలిగారు. ఇంకొకవైపు అటవీశాఖవారు, రెవెన్యూశాఖ కార్యక్రమాలను పట్టించుకోకుండా గిరిజనులను అడవి భూముల నుంచి వెళ్ళగొట్టే ప్రయత్నంలో నిమగ్నులైనారు. అటవీ శాఖవాళ్ళకు వేరేస్వంత రికార్డులున్నాయి. సాధారణంగా ఇవి రెవెన్యూశాఖ రికార్డులకు విరుద్ధంగా ఉంటాయి. అటవీశాఖ రికార్డుల కొకరు చెప్పిన ఉదాహరణేమిటంటే 'పట్టణం మధ్యలో ఉన్న బజారును అడవిగాను, నిజమైన అడవిని బీడు భూమిగా చూపించడం। రాష్ట్రప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా అటవీశాఖ రికార్డులను పునః పరిశీలించవలసిందిగా 1975 లో చేసిన ప్రకటన ఇంకా ప్రకటనగానే ఉన్నది. ఈ రెండు అధికారశాఖలు సృష్టించిన గందరగోళం ఏవిధంగా ఉందంటే అటవీశాఖ లెక్కల ప్రకారం, జనాభా లెక్కల రిపోర్టు ప్రకారం అడవి ప్రాంతం 43.57% వుండగా రెవెన్యూశాఖ 25% మాత్రమే చూపిస్తున్నది.

ఏళ్ళుగా సాగుతున్న రాష్ట్రప్రభుత్వ గందరగోళ విధానాలవల్ల కొత్తశక్తులు ఆర్థికంగా, రాజకీయంగా అధికారం చెలాయించడం మొదలయ్యింది. పాతుకపోయిన రాజకీయ పార్టీలమీద గిరిజనేతర వర్తకుల ప్రాబల్యం బలపడింది. ఈ ప్రాంతంలో కాలిడిన లంబాడా తెగ మెల్లమెల్లగా వ్యవసాయదారులుగా స్థిరపడ్డారు. వ్యవసాయ, గిరిజన అభివృద్ధి పథకాలవల్ల తరువాత ఎక్కువగా లాభం పొందింది వీళ్ళే. చివరకు పంచాయతీ అసెంబ్లీ రాజకీయాల్లో, ఉద్యోగాల్లో చొచ్చుకొనిపోయారు. ఇవ్వాళ పెద్ద మెజారిటీగా ఉన్న గోండులకు చిన్నతెగ అయిన లంబాడాలకు మధ్య తీవ్రమైన బేధాలున్నట్టు కనపడుతున్నది. 1977లో లంబాడాలను గిరిజనులలో చేర్చడంతో పరిస్థితి ఆందోళనకరంగా అయింది. గోండులు ఇది తమ భూమికీ, ఉనికికే ప్రమాద మని భావించారు. ఈ పరిస్థితిలో 'సంఘం' లాంటి సంస్థల్లో సంఘటితం కావడానికి ప్రయత్నిస్తున్న గిరిజనులను ఎదుర్కోవడానికి కొంతమంది గిరిజనేతరుల హక్కుల రక్షణ కమిటీబోర్డు తగిలించుకున్నారు.

ఈ విధంగా క్రమంగా బడాపారిశ్రామికవేత్తల ప్రవేశంతో, ప్రభుత్వ బొగ్గు గనుల పెరుగుదలతో, అడవిని జాతీయం చేయడంతో వడ్డీవ్యాపారులుగావస్తూ భూస్వాములుగా స్థిరపడుతున్న మైదానప్రాంతం మనుషుల నిరంతర ప్రవాహంతో ఈ జిల్లా గిరిజనప్రకృతి మార్పులకు గురయింది. రాష్ట్రప్రభుత్వం తన విధానాల ద్వారా విస్తృతున్న గిరిజన - గిరిజనేతర విభేదాలు, గిరిజనులు సాగుచేస్తున్న భూములపై గిరిజనులకు చట్టబద్ధమైన హక్కులు లేకపోవడం, గిరిజనులకు చెందవలసిన భూమి

వాళ్ళకు చెందకుండానే పోవడం అనే చేదు వాస్తవాలతో కలసి ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది- ఈ మార్పులన్నీ గిరిజన ప్రజల్ని తమ భూముల్నించి శీఘ్రగతితో పరాయివాళ్ళను చేసాయి- గిరిజన సమాజ సామాజిక జీవితంలో దుర్భరమైన వైరుధ్యాలను ప్రవేశపెట్టాయి- ఇవన్నీ ఈనాడు హింసాయుత సామాజిక ఘర్షణగా వ్యక్తమయ్యే స్థితికి పరిపక్వమవుతున్నాయి.

ఇటీవలి ఉద్యమం - అణచివేత :- ఇటీవలి ఉద్యమం పొరుగుజిల్లా అయిన కరీంనగర్ నుంచి 1978లో ఆదిలాబాద్‌కు పాకింది. ఒక సిపిఐ (ఎం. ఎల్) గ్రూప్* ఆధ్వర్యంలో గిరిజనులు రైతుకూలి సంఘాలుగా ఏర్పడి వడ్డీవ్యాపారులకు, అటవీ శాఖాధికార్లకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు- ఆసిఫాబాద్, లక్సెట్టిపేట తాలుకాల్లో మొదలయిన ఈ ఉద్యమం క్రమంగా సిర్పూర్, ఉట్నూరు, ఖానాపూరు, చెన్నూరు, ఆదిలాబాద్ తాలుకాల్లోకి పాకింది- అక్రమంగా భూస్వాములు ఆక్రమించు కొన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడం, బీడీఆకు కార్మికుల వేతనాల పెరుగుదల, అడవిమీద పెత్తనం చేస్తున్న అటవీశాఖాధికారులను అదుపులో పెట్టడం అడవి ఉత్పత్తులను అక్రమంగా అమ్ముకుంటూ, ఫారెస్టు కంట్రాక్టర్లు నియమించిన గిరిజన కార్మికులకు వేతనాలు మొదలయిన సమస్యలమీద పోరాటం ద్వారా సంఘం పేర్కొనదగిన ప్రజాపునాదిని సంపాదించుకుంది- అడవి సంపదల కొరకు తీవ్రమైన పోరాటాలు ప్రత్యేకించి గత సంవత్సరం మధ్యలో ఉట్నూరు, ఆసిఫాబాద్, సిర్పూర్ తాలుకాల్లో జరిగినట్లు రిపోర్టులున్నాయి- రాష్ట్రప్రభుత్వం అణచివేత కార్యక్రమాలు విస్తృతపరిచింది- ఇదివరకే పెద్దసంఖ్యలో కేంద్రీకృతమైన పోలీసు బలగాలతో, ఇద్దరు ఎస్.పిలు, ఆరుగురు డి.ఎస్.పిలు ఉన్న ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లాతో పాటు కొత్త డి.ఐ.జి రేంజిలోకి తేబడింది- 600 మందిపైగా గిరిజనులను వివిధ కేసుల్లో ఇరికించారు- 12పైన పోలీస్‌స్టేషన్లకు అదనపు సాయుధ పోలీసు బలగాలను తరలించారు- దాదాపు 12 గ్రామాల్లో పోలీసు క్యాంపులు పెట్టారు- ఈ ఉద్యమం పొరుగుననున్న మహారాష్ట్రలోని చంద్రాజిల్లా సిరోంచ తాలుకాకు కూడా పాకింది. జనం అండదండలున్నాయన్న ధైర్యంతో సంఘం ఉట్నూరు తాలుకా ఇంద్రవెల్లి గ్రామంలో 20 ఏప్రిల్ మొదటి జిల్లాస్థాయి సభను ఏర్పాటుచేసింది- ఇప్పుడు పోలీసులు కాల్పులు జరిపిందక్కడే.

ఇంద్రవెల్లి సంఘటన :- కమిటీ ఆదిలాబాద్ జిల్లా ఆసుపత్రిలో బుల్లెట్ గాయాలకు చికిత్సపొందుతున్న 18 మంది పురుషులను, ఇద్దరు స్త్రీలను సందర్శించింది-

* సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్

గాయపడ్డ వాళ్ళలో మిగతావాళ్ళు హైదరాబాద్, నిజామాబాద్, మంచిర్యాల ఇంకా ఇతర స్థలాల్లో చికిత్సపొందుతున్నారు. వాళ్ళలో వేలికి గాయంతగిలిన పురుషుడు, తొడకు గాయం తగిలిన స్త్రీ తప్ప మిగతా అందరికీ కడుపు మీద భాగాలకే బుల్లెట్ గాయాలు అయ్యాయి. తరువాత మేం ఎస్. పి. ని వాళ్ళ తుపాకుల నిబంధనల ప్రకారం శరీరం కింది భాగాలకే ఎందుకు గురిపెట్టబడలేదు అని అడిగినప్పుడు 'బుల్లెట్లు నిబంధనలకు కట్టుబడి ఉండవు' అని నీళ్ళు నములుడు లేకుండా సమాధానం ఇచ్చాడు. పోలీసులు కక్షసాధింపు చర్యగానే కాల్పులు జరపడంవల్ల ఎక్కువ సంఖ్యతో అమాయక గిరిజనులు చావడం, గాయపడడం జరిగింది పోలీసుల నిష్కారణ కవ్వింపు చర్యల ఫలితంగా ఉద్రిక్తులైన జనానికి పోలీసులకు మధ్య జరిగిన దొమ్మీలో ఒక పేదకానిస్టేబులు ప్రాణాలు పోగొట్టుకోవడం దురదృష్టకరం.

ఆసుపత్రిలోని గాయపడ్డవారు, పిట్టబొంగరం గ్రామ ప్రజలు సంఘటనను విశదీకరిస్తూ కాల్పులు ఎందుకు జరిగాయో తమకు తెలియదని ఆశ్చర్యం ప్రకటించారు. కొంతమంది ఆరోజు సంత ఉంటుందని అక్కడికి పోయామని అన్నారు. పిట్టబొంగరం ప్రజలు దాదాపు అందరూ ర్యాలిలో చేరి ఊరేగింపుగా మీటింగుకు, ఇతర ప్రాంతాల నుంచి మాట్లాడడానికి వస్తున్న వాళ్ళను వినడానికి బయలుదేరామని చెప్పారు (అక్కడి పోస్టరులో కోబాడ్ గాంధీ సి.పి డి.ఆర్. బొంబాయి, రంగనాథం ఆం. ప్ర. పౌ.హ.సం, హిమజ్వాల విరసం, లింగమూర్తి ఆర్.ఎస్.యు మాట్లాడుతారని ఉంది) గొడ్డళ్ళు, బరిసెలు లాంటి ఆయుధాలు వాళ్ళు పట్టుకొచ్చారా అని అడిగినప్పుడు లేదు మేము సంఘం జెండాలు, ఎప్పుడూవాడే వెదురుకర్రలు మాత్రమే తీసుకొచ్చామని నొక్కిచెప్పారు. కాల్పులు జరిగిన స్థలంలో దొరికిన ఇటువంటి కర్రను కమిటీ తీసుక వచ్చింది ఈ చిన్నకర్ర రైఫిల్ ధరించిన పోలీసును ఏరకంగా భయపెడుతుందో ఎంతటి ఊహకైనా అందని విషయం. గ్రామస్థులు పోలీసులు బాష్పవాయువు గోళాలు విసిరిన తరువాతనే రాళ్ళురువ్వామని ఒప్పుకున్నారు.

ఇంద్రవెల్లి సంతలో జరుగుతుందని తాము ఊహించిన మూకఉమ్మడి లూటీని ఆపడం కోసమే తాము ముందు జాగ్రత్తలు తీసుకున్నామని పోలీసులు చెప్పారు. ఒక కాంగ్రెస్ (ఐ) నాయకుడు కూడా ఇట్లాంటి ధోరణినే వెలిబుచ్చి అతనిని, మరికొంత మందిని చంపుతామని బెదిరించారని చెప్పాడు. రైతుకూలి సంఘం వలంటీర్లు ఆ ప్రాంతం అంతటా మీటింగు పోస్టర్లు వేసి 17 ఏప్రిల్ నుంచే చందాలు వసూలు చేస్తున్నారని అతడు చెప్పాడు. ఎస్.పి. ఆరోజు ఎంతమంది సాయుధ పోలీసు బలగాలను నియమించారో చెప్పడానికి నిరాకరించాడు. కాని అక్కడ ఇబ్బందులు ఎదురవుతాయని ముందే ఊహించి తాను స్వయంగా క్యాంపువేసానని చెప్పాడు.

ఈ విషయాలన్నీ గుదిగుచ్చి పరిశీలించిన తరువాత గిరిజనుల స్థైర్యాన్ని చెదరగొట్టి వాళ్ళను భయోత్పాతులను చేయడానికే కృతనిశ్చయులై పోలీసులు కాల్పులు జరిపారని కమిటీ విశ్వసించక తప్పడంలేదు- ఈ సంఘటన జరుగుతున్నప్పుడు చనిపోయిన వారిని, గాయపడ్డవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నవారిని కూడా పోలీసుల బుల్లెట్లు వదిలిపెట్టలేదు- కొంతమంది గాయపడ్డవారు సురక్షిత ప్రాంతాలకు తీసుకపోబడుతున్న దారిలోనే చనిపోతే మరికొందరు తరువాత దాహం తీర్చుకుంటున్నప్పుడు చనిపోయారు- పోలీసుల కథనం ప్రకారం 13 మంది మాత్రమే చనిపోయారు- అందులో 9 మంది మాత్రమే గుర్తింపబడ్డారు- చట్టప్రకారం శవాలను వాళ్ళ ఆత్మీయులకు ఇవ్వవలసి వుండగా పోలీసులందుకు ఏ శ్రద్ధా తీసుకోలేదని కమిటీ ఎంతో ఆందోళనతో చెప్పాల్సివస్తున్నది- చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలను గుర్తించడానికి పోలీసులు తగినంత కృషిచేయలేదు.

ఈ సంఘటన గురించి ప్రభుత్వం ముందుకు తెస్తున్న వాదనలకు పూర్తిగా భిన్నంగా వున్నాయి వెలికివచ్చిన ఈ వాస్తవాలు- ప్రభుత్వం ఈ ర్యాలీ అకస్మాత్తుగా నిర్ణయించబడ్డది అంటున్నది- కాని ఒక నెలరోజుల ముందే ఈ ర్యాలీ జరుగుతుందని హైదరాబాదులో ప్రకటించబడింది- ఆ ప్రాంతంలో మీటింగు గురించి ఉన్న పోస్టర్లు కనీసం 5 రోజుల ముందే వేయడం జరిగింది.

గిరిజనేతరులు కూడా సభ పెట్టదల్చుకున్నారు కనుక ఈ మీటింగుకు అనుమతి ఇవ్వలేదన్న వాదన కేవలం సాకుగా కనిపిస్తున్నది ఈ 20వ తేదీ ర్యాలీకి కొద్దిరోజుల ముందే గిరిజనేతర సంఘం పుట్టుకొచ్చింది- గిరిజనుల ర్యాలీకి సంబంధించినంతవరకు ఇంద్రవెల్లిలో సభకోసం సంతకోసం చుట్టుపక్కల అడవుల్లోని ఎన్నో గ్రామాల గిరిజనులు వేలాది సంఖ్యలో తరలివస్తున్నప్పుడు 144వ సెక్షను అమలులో ఉన్నదన్న విషయం వాళ్ళకు చెప్పడం అసంభవం- అనుకున్న ప్రకారం ర్యాలీ, మీటింగ్ జరగనిచ్చేటట్టయితే శాంతి భద్రతలకు ఏ మాత్రం భంగం కలిగేదికాదు- నిజానికి శాంతిభద్రతలకు భంగం కలగకూడదనే అత్రంతో పోలీసులు భగ్గుమండే ఇంత తీవ్రమైన ఉద్రిక్తతను తామే సృష్టించారు.

గిరిజనులు సాయుధులై వున్నారన్న ప్రభుత్వవాదన మోసపూరితమైంది- వాళ్ళ చేతుల్లో ఉన్న "ఆయుధాలు" వాళ్ళ చేతుల్లో ఎప్పుడూ వుండే కర్రలే.

అధికారికంగా ప్రకటించిన మృతుల సంఖ్య 13, కాని చాలా మంది ప్రజలతో మాట్లాడినప్పుడు, అధికారులతో ప్రైవేట్‌గా మాట్లాడినప్పుడు బయటపడిందేమిటంటే చనిపోయినవారి సంఖ్య చాలా ఎక్కువేనని, కొంతమంది 60 అనిచెప్పారు- పోలీసులు శవాలు వాళ్ళ కుటుంబాలకు ఇవ్వలేదు- గోండులకు శవాలను పూడ్చివేసే ఆచారం వున్నప్పటికీ పోలీసులు చంపబడినవారిని దహనం చేసారు- ఈ కారణాలవల్ల చనిపోయినవారి సంఖ్య ఎంతో ఖచ్చితంగా చెప్పడం కష్టం అవుతున్నది.




బుల్లెట్లకు
నియమాలు
లేవా ?

ఇంద్రవెల్లి
గోండులపై
ఇందిరా
గాంధి
ప్రేమా
బిమానాలు



తొడలో
బుల్లెట్
గాయంతో
గోండు స్త్రీ

ఈ దేశపు పాఠశాల



ఇంద్రవెల్లి స్కూలు- 20 వ తేదీ ఇంద్రవెల్లి పోలీసు క్యాంపు- ఇక్కడ మేధావులూ విద్యార్థులూ ఏప్రిల్ 20 న ప్రజాస్వామ్య పాఠాలు లాఠీలతో చదువుకున్నారు.

రాష్ట్రప్రభుత్వ విధానాలు, అధికారుల లంచగొండితనం ప్రస్తుత ఘర్షణకు ప్రధాన కారణమన్నది చాలాస్పష్టం. రాష్ట్రప్రభుత్వం వెంటనే పట్టించుకోవడం, ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులు ఆ ప్రాంతాలకు కదిలివెళ్ళడం, గుర్తింపబడిన మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం, గిరిజనాభివృద్ధికి కోటి రూపాయలు కేటాయించడం మొదలయిన చర్యలు ఆహ్వానించ దగినవే. ఈ పరిస్థితులు సృష్టింపబడడానికి రాష్ట్రప్రభుత్వం తన బాధ్యతను పరోక్షంగా అంగీకరిస్తున్నదనడానికి ఈ చర్యలన్నీ నిదర్శనమే.

నిర్ధారణలు :- పైనకనుగొన్న వాస్తవాల ఆధారంగా కమిటీ ఈ క్రింది సిఫారసులు చేస్తున్నది.

1. పోలీసుల కాల్పులకు దారితీసిన సంఘటనపై వెంటనే న్యాయవిచారణ జరిపించి, ఈ అత్యాచారాలకు బాధ్యులైన అధికారులెవరో నిర్ధారణచేసి వాళ్ళను శిక్షించాలి.

2. బహిరంగసభలు పెట్టుకోవడానికి చట్టబద్ధమైన హక్కులు ఇవ్వాలి. గిరిజనులు తమ హక్కులను కాపాడుకోవడానికి, సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి ఆ సంస్థలద్వారా కృషిచేయడానికి వాళ్ళకు ఉన్నహక్కును గ్యారంటీచేయాలి. భవిష్యత్తులో ఇటువంటి హక్కులను అధికారులు అనవసర జులుం ద్వారా అణచివేయకుండా ప్రభుత్వం నిర్దిష్టమైన రక్షణలను కల్పించాలి.

3. పోలీసు క్యాంపులు ఎత్తివేసి ఈ ప్రాంతంలో పోలీసు భీభత్సానికి స్వస్తి చెప్పాలి.

4. గిరిజన ప్రాంతాల్లో వ్యవస్థాపరమైన కార్యక్రమం రూపొందించి అమలు చేయడానికి, గిరిజనుల హక్కులు కాపాడడానికి ప్రభుత్వం ముందు గిరిజనులనే సంప్రదించాలి. ఈ పరిస్థితి ఇంకా దిగజారకుండా వుండాలంటే ఈ ఉద్రిక్తతలకు మూలకారణమేదో దాన్ని పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలి.

5. గిరిజనులు సాగుచేస్తున్న భూములన్నిటిపై వాళ్ళకు చట్టబద్ధమైన హక్కులు ఇవ్వాలి.

ఈ సంచిక వెలువడేనాటికే ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం పంపించిన నిజనిరూపణ కమిటీ నివేదిక క్రాంతి, విమోచన మే - 15 సంచికల్లో దాదాపు పూర్తిపాఠంగా వచ్చినందున, ప్రజా వైద్యుల సంఘం నివేదిక సంక్షిప్త రూపం కూడ క్రాంతి మే - 15 సంచికలో వచ్చినందున ఈ నివేదిక మాత్రమే ఈ సంచికలో ప్రచురించాం.

— 'సాహితీ మిత్రులు'

ఇంద్రవెల్లి

అల్లం వీరయ్య

1

ఇంద్రవెల్లిలో ఇంద్రవెల్లిలో
ఇంద్రవెల్లిలో కథచూడుతల్లీ
ఇంద్రవెల్లిలో
అమ్మ ఏలేటి దేశాములోనా ,,
కాయకష్టాము చేసేటివారు ,,
మాయ మర్మము తెలియనివారు ,,
ఆకులలములుతిని బతికెటోళ్ళు ,,
ఆట పాటలే సూత్తమనుకోని ,,
బతుకుమాటలే వినవచ్చునాని ,,
కూడి మీటింగు పెట్టుకుంటేను ,,

2

అమ్మగారీ నమ్మినబంట్లు ,,
సిన్నపెద్దాని వాళ్ళు చూడలేదు ,,
ముసలిముతకాని వాళ్ళు చూడలేదు ,,
చెయ్యిదెబ్బ వాళ్ళు కొట్టలేదు ,,
చెంపదెబ్బ వాళ్ళు కొట్టలేదు ,,
చెట్లమీద మాటులుగాసి ,,
రాళ్ళవానాలు కురిసీనతీరు ,,
గుళ్ళవాన కురిపేనె తల్లి ,,

3

కూలినాయి గుట్టాలు కావు ,,
కూలినారి నాయన్నలమ్మా ,,
రాలినాది రాలాకు కాదు ,,
రాయిలాంటి నాయన్నలమ్మా ,,
పగిలినాయి బండాలు కావు ,,
గోండు అన్నాల గుండెలోయమ్మ ,,
పారినాది నీరు కాదమ్మా ,,
పేద అన్నాల నెత్తూరె తల్లీ ఇంద్రవెల్లిలో
ఆరుకాలాలు బతికేటి వాళ్ళు ,,
అరువదికి ఎక్కువే తల్లి ,,
మొదలునరికిన చెట్లోలెనమ్మా ,,
కూలినారు కుప్పలయ్యి ,,

4

అయ్యోకూసున్న నాయన్నలాను ,,
వాళ్ళ గుండెల్ల కొట్టినారమ్మా ,,
అయ్యో లేచేటి నాయన్నలాను ,,
వాళ్ళ రెక్కల్ల కొట్టినారమ్మా ,,
అయ్యో ఉరికేటి నాయన్నగాడు ,,
మళ్ళీ ఊపిరే తీయాడెతల్లి ,,

5

టక్కరయ్యి వచ్చీనరాని ,,
ఒక్కమాటతో నే చెప్పుకోనా ,,
వరదలొచ్చి ముంచీనయాని ,,
ఏడ్చే తల్లులనోదార్చుదూనా ,,
పాము తేళ్ళు కరిచీనయాని ,,
అడిగెవారికీ నేచెప్పుదూనా ,,

6

అమ్మ ఏలేటి దేశాములోనా దేశమూలోనా
ఆడిదేలేటి దేశాములోనా ,,
ఆడివారికి రక్షణా లేదు ,,
పేదవారికి రక్షణా లేదు ,,
ఢిల్లీలో ఆ ఢిల్లీలో........
రైతుసభలానిచేస్తాది అమ్మా ఆఢిల్లీలో
దున్నిదోకాని రైతులోయమ్మా ,,

ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే రగల్ జెండాలోన రగిలెనని చెప్పాలి

శ్రీకాకుళం, కోరాపుట్, గంజామ్ ప్రాంతాల్లో నివసించే ఆదివాసుల సవర భాషకు లిపి, వ్యాకరణం సమకూర్చే ప్రయత్నం చేసాడు గిడుగు రామమూర్తి పంతులు. ఆదిలాబాద్ జిల్లాలో నివసించే ఆదివాసులు గోండులతో జీవించి వాళ్ళ భాష నేర్చుకొన్నాడు హేమన్‌డార్ఫ్. గోండుల భాష నేర్చుకోవడమే కాదు, వాళ్ళ ఆచార వ్యవహారాలు, సంస్కృతి అలవరచుకోవడమే కాదు గోండు కోలామ్ భాషల్లో పాటలుకట్టి కరీంనగర్ రైతాంగం కొనసాగిస్తున్న నక్సల్బరీ పోరాటం ఉప్పు ఆదివాసులకందించారు రాడికల్స్. 'ప్రజల నుంచి ప్రజలకు' అనే మావో ఆలోచనను ఆచరించే క్రమంలో వున్నారు. గోండులను, కోలామ్‌లను అర్థంచేసుకోవడానికి వాళ్ళ ఆచారవ్యవహారాలు, భాష నేర్చుకుంటే చాలదు, వాళ్ళ సంస్కృతిని అలవరచుకొంటే చాలదు, వాళ్ళతో కలగలిసి జీవించాలి. వాళ్ళ కష్టసుఖాలు పంచుకోవాలి. అదికూడా చాలదు. వాళ్ళ జీవన్మరణ పోరాటాల్లో పాల్గొనాలి. అగ్రభాగాన నిలచి పాల్గొనాలి వాళ్ళ నికృష్టమైన జీవితాలు నిప్పయి వెలగాలంటే వాళ్ళలో వర్గచైతన్యాన్ని రగిలించాలి కొమురం భీము పోరాట సంప్రదాయం పొరకలపార్టీ నక్సల్బరీ పోరాటంలో సంలీనం కావాలి. ఆ క్రమంలో బాబేఝరీలు, ఇంద్రవెల్లులు అనివార్యం. ఒక్క మాటలో రగల్‌జెండా మీది చంద్రవంక సుత్తె-కొడవలి రాజకీయ నాయకత్వాన్ని స్వీకరించాలి.

రాకాసి నా కొడుకులంతా ఆ ఢిల్లీలో
పేదసాదాల మూల్గులు పీల్చి ,,
పెరిగిపోయిన వాళ్ళంతగలిసి ,,
రైతుదే రాజ్యమన్నారు ,,

7

ఇంద్రవెల్లిలో కథజూడు తల్లీ
తామరాకున నీటి బొట్టోలె ,,
నామనసంత తల్లడిల్లు ,,
కుమ్మరాము తీరూన తల్లీ ,,

నామనసంత కుములుతాది ఇంద్రవెల్లిలో
గుండె కుంపట్లు రాజేసికోని ,,
సుత్తి కొడవల్లు నూరుకోని ,,
నెత్తురింకని ఆ నేలమీద ,,
చేతులెత్తి బాసలుచేసి ,,
తప్పుడు ఈ కొడుకులాను ,,
ఉప్పుపాతర పేద్దామురండి ,,
రేపు తొలిపొద్దు ఎలుగుల్ల తల్లీ ,,
ఎర్రజెండలే ఎగురాలి మళ్ళీ ,,

రైలుగాడీలో.... రైలుగాడీలో.... రైలు గాడీలో మైదాకుసుక్క.... రైలుగాడీలో అన్న బాణీలో ఈ పాట పాడుకోవాలి.

ఈ కృషిలో భాగమే 'రగల్‌జెండా' గోండు, కోలామ్ పాటల సంకలనం. దేవనాగరి తెలుగు లిపులలో గోండు, కోలామ్ భాషల్లో ఈ పాటలున్నాయి.

ఇటువంటి కృషి ఒక్క చైనా కమ్యూనిస్టు పార్టీ తప్ప, ఆసియా ఖండంలోనే మరేపార్టీ చేయలేదని, జవహర్‌లాల్‌నెహ్రూ యునివర్సిటీ, ఢిల్లీలో ఒక సామాజిక శాస్త్రజ్ఞుడన్నాడు. ఏప్రిల్ 20న ఇంద్రవెల్లికి వెళ్ళి అరెస్టయిన రాడికల్ విద్యార్థుల చేతుల్లో ఈ పుస్తకాన్ని చూసి రాడికల్స్ గోండు భాష నేర్చుకొని పాటలు కట్టారు. తెలుగు పాటలు గోండు భాషలోకి, గోండు పాటలు తెలుగు భాషలోకి మార్చారు. రాడికల్స్ గోండులయ్యారు. గోండులు రాడికల్స్ అయ్యారు. ఇంక వీళ్ళనుంచి వాళ్ళను వేరుచేయడం కష్టం అనే అర్థంతో పోలీసు అధికారులు మాట్లాడారు. ఈ వ్యాఖ్యలే ఈ పుస్తకానికి యోగ్యతాపత్రాలు.

ఈ సంకలనంలో మూడు గోండు పాటలున్నాయి. మొదటి పాట పీడితులంతా ఒకటై పోరాటం సాగించాలని సందేశం ఇస్తుంది. రెండవది, మృతవీరులకు జోహార్లు చెప్పేపాట. గోండువాళ్ళు చనిపోయినవారికి, బతికివున్న వాళ్ళకు కూడ 'వందనాలు' అంటారు. గోండు భాషలో రాం, రాం అంటే వందనాలు అని అర్థం. రగల్‌జెండాకు అంకితమయ్యే పాట మూడవది.[1] గోండుల జీవితము, సమస్యలపై 'కొంగునడుమునకు చుట్టవే'[2] బాణీలో ఒక పాటవున్నది.[3] ఇవేకాకుండా బహుళ జనాదరణ పొందిన జననాట్య మండలి పాటలు జజ్జనకరి జనారే,[4] నడవరో యెంకన్న నడవరా,[5] పాలబుగ్గల జీతగాడా[6] పాటలు గోండు, కోలామ్ భాషల్లోకి అవే బాణీల్లో అనువాదమయ్యాయి. ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రాహి 'కష్టజీవులం మేం కమ్యూనిస్టులం'[7] జననాట్య మండలి పాటలు 'పొదల పొదల గట్లనడుమ'[8] 'శక్తి మనది – యుక్తి మనది భూమి మనదిరా'[9] గోండు భాషలోకి అవే బాణీల్లో అనువదించబడ్డాయి. వీటిల్లో ఈనాడు జననాట్య మండలి, 'మాభూమి' సినిమా ద్వారా మళ్ళీ ప్రచారంలోకి వచ్చినప్పటికీ 'పాలబుగ్గల జీతగాడా!' పాట తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో ప్రజా కవి సుద్దాల హనుమంతు రాసింది. ఈ పాటకు మూడు దశాబ్దాలుగా ప్రజాదరణ వున్నది. అట్లాగే పాణిగ్రాహి పాట శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట కాలంనుంచి కూడ కష్టజీవులకు – కమ్యూనిస్టులకు వున్న అనుబంధం గురించి, సిద్ధాంతానికీ, ఆచరణకువున్న అవినాభావ సంబంధం గురించి సులభమైన భాషల్లో, బాణీలో వివరిస్తూ విరివిగా ప్రచారంలో వున్నది.

'కొండ గొట్టి – చెట్టునరికి
సాగుచేసినావురా

రక్తమంత - చెమట చేసి
పొలముతడిపినావురా
నీదు చెమట సారముతో బంజరైనా పండురా
అట్టినీకు తిండి కరువు ఎందుకొచ్చినట్టురా-

అని ప్రశ్నించే 'భూమిమనదెరా' అనే పాట సహజంగానే గోండుల జీవితాలకు కూడ దర్పణంపడుతుంది. అది తమ పాటగానే వాళ్ళు మలచుకుంటారు- పిలుచుకుంటారు.

"కొండలు ఎక్కిన కోదోడా
కట్టెలు గొట్టిన పేదోడా....
కొయితాల్లో దాపిరి భూములు
కాల్చర నువ్వా కాగడాలతో"

అని జజ్జనకరి జనారే / ఝణకు ఝణా జనారే- అని దరువు పాట అందుకుంటే అది శ్రీకాకుళ గిరిజనుల జీవితాలకే కాదు ఆదిలాబాదు ఆదివాసుల జీవితాల బరువుకు, బతుకుతెరువుకు కూడ దరువవుతుంది.

అన్నిట్లోకి తలమానికమైన పాట 'తాకరో కోయ దాదా తాకరో' - నడువరో ఎంకన్న నడువర........

ముళ్ళవనం నరికీ నరికి
పళ్ళవనం జేసినోడ
భూమిని తలకిందుజేసి
బువ్వపంచి ఇచ్చినోడ

ఉదయించే సూర్యునోలె
చిగురించే కొమ్మవోలె
పదునెక్కిన కత్తివోలె
తిరుగబడ్డ తుపాకోలె-

నడువరో ఎంకన్నా నడువరా - రాడికల్ యువజనసంఘం రమ్మనిపిలుస్తోంది. ఆపిలుపును అందుకుని ఆదిలాబాదు అన్నయ్యలు, కరీంనగర్ కూలన్నలు ప్రాణాలే పోయినా పోరునాపమంటున్నారు- నువుకూడ నడువమని ప్రబోధించేపాట.

ఈ సంకలనానికి ఒకేఒక్క పేజీ ముందుమాట (మున్నెగోష్టి) ఎన్నోచరిత్ర పుటల్నిదులిపి, కదిలించి, విదిలించి, చేదునిజాల్ని మన ముందుంచుతున్నది. అయితే

చేదునిజాల్ని చెప్పడంతోనే చేతులు ముడుచుకోలేదు, చేతులు దులుపుకోలేదు- కర్తవ్యాన్ని ప్రబోధించి, చైతన్యాన్ని రగిలించే ప్రయత్నంకూడా చేసింది. ఆ ముందుమాటనే ఈ సమీక్షకు తగిన ముగింపుగా ఎంచుకున్నాను.

ముఖచిత్రం చంద్రవంక రగల్‌జెండా పిడి(కిలి)బిగించిన రక్తపతాకగా సజాత్మకంగా మారిన తీరును చిత్రిస్తే ఇంకా బాగుండును- తెలుగు, దేవనాగరి లిపిలో రగల్ జెండా అక్షరాలు, అలగా గాలిలో రెపరెపలాడే ఎర్రజెండా- పడతలెద్ద కడుపుపొరలో పొదవుకున్న సుత్తె- కొడవలి- ఇప్పటికీ ఈ ముఖచిత్రం గుండెలకు హత్తుకునేలా వున్నది- గోండు, కోలాం భాషలు రానివాళ్ళు కూడ 75 పైసలు పెట్టి కొనుక్కొని గోండుల పోరాటానికి గుండెబలాన్ని కండబలాన్ని అందించడానికీ మనకీ అందమైన పాటల పుస్తకాన్ని అందించింది 'క్రాంతి ప్రచురణలు'-

"నక్సల్‌బరి నవ్వుతుందిరా అన్నయ్యా నలుదిక్కుల జూస్తుందిరా. నక్సల్‌బరిలో రగిలిన అగ్నికణం శ్రీకాకుళాన్ని మండించింది. ఆ శ్రీకాకుళం ఇవ్వాళ కరీంనగర్, ఆదిలాబాద్‌ను కదిలించింది. నిదురబోయిన సీమ కదలబారింది. కదలబారిన దండు గుండెమంటల్నిజూచి సర్కారోళ్ళ కళ్ళల్లో కల్లోలం నిప్పులు పోసుకున్నారు. కల్లోలాలు, నిర్బంధాలు, హింసలు, జైళ్ళు అన్నీ విప్లవకెరటాలముందు గాలిబుడగలే. ఇదిసత్యం.

ఎదల్లోబాధలున్న గిరిజనులు తేనెటీగల్లాంటివారు. వీళ్ళ మనసులు మల్లెపువ్వులు, స్వచ్ఛమైనవి, కపటంలేనివి, జీవితంలో కష్టపడడం ఒక్కటేతెలుసు. సుఖమెరగని వాళ్ళు. వీళ్ళకుజీవితాన్ని అలా, ఇతరుల నుండి నేర్పాలి. నాగరికులుగా చేయాలి. ఇది ఏలికలు చేయలేరు. వాళ్ళబాధల్ని పాపలేరు.

దుక్కిదున్ని, పంటదీసి, అడవితిరిగి, బంకనేరి, బొంగుకొట్టి బిర్లాకు పైసలు పెంచి, తడికలల్లుకొని, విప్పపువ్వులుతిని, పురుగుబుసితిని, అరవసాకిరి చేసిన దరిద్రపు స్థానంలో చిట్టచివరి వాళ్ళు- గంప మోతలతో వచ్చిన షావుకార్లు దేహంలోని సగం రక్తం త్రాగగా; మిగిలింది జంగ్లాత్ వాళ్ళు త్రాగితే ఇక మిగిలింది వల్లకాటి కాడిశవం- తేనె త్రాగేవారు- ఉత్తగూడే మిగిలింది- ఆ గుండెల్లో మంట మిగిలింది ఆ మంటను నీ, నా, మన ఊపిరితిత్తులతో ఊది ఊది మండించాలి- ఇప్పుడిప్పుడే ఊపిర్లు పోసుకున్న మంట దౌర్జన్యంగా సాగు భూముల్ని ప్లాంటేషన్స్ చేసిన జంగ్లాత్ (ఫారెస్టు అధికారులను) వాళ్ళను ఎదిరిస్తున్నది- ఆ మంటే వడ్డీవ్యాపార్ల నడ్డి విరుస్తున్నది- రక్తపు బాకిని వడ్డీతో తీసుకుంటున్నది- ఆ మంటే సంఘమై ఒక చేత్తోదండ ఎత్తి ఈ దోపిడి గుండెల్లో విప్లవ నగారా మోగిస్తున్నది- సుధలు, సుఖం కలిగిన నవసమాజం కోసం, రొదలు వ్యథలులేని బ్రతుకు కోసం గిరిజనులు ఎర్రగీతాల్ని ఆలపిస్తున్నారు.

నిన్నటిదాక మరి మొన్నటిదాక తరతరాల ఈ హత్యాచారాల చరిత్ర పుటల్లో ఎన్నో అసంతృప్తి గాయాల గేయాలు. ఇవ్వాల్టి పాటలు రక్తసిక్తమైన పాటలు. ఈ పాటలే ప్రజల బ్రతుకుబాటలో క్రొత్త చిగుళ్ళకోసం ఆలపిస్తున్న అరుణరాగాలు.

కష్టజీవి వినిపించే శ్రమ సంగీతం దిగంతాల వరకు వ్యాపిస్తున్నది వినిపిస్తున్నది.

ఇక్కడి అడవిలోని చెట్టు, పుట్ట, పిట్ట, గుట్ట అన్ని విప్లవ రాగాన్ని ఆలాపిస్తున్నాయి. ఆ ఆలాపనలే ఈ గీతాలు."

— అనుగామి

---

1. రగల్‌జెండా కేయాంతం అనే ఈ పాటకు పూర్తి తెలుగు అనువాదం జూన్ 81 'అరుణతార'లో వచ్చింది.

2. రగల్‌జెండా – సట్టేద్ కయిదే పీయవే– పే. 20– జననాట్య మండలి పాటలు – తృతీయ ముద్రణ– కొంగునడుముకు చుట్టవే పే. 36.

3. కొమురం భీము పోరాటాన్ని కీర్తిస్తూ గోండు ప్రజలు తమ భాషలో పాడుకునే పాటను ఈ సంకలనంలో చేర్చవలసింది. కరీంనగర్ ఆదిలాబాదు రైతాంగ పోరాట పాటలు (సృజన ప్రచురణ– ఏప్రిల్ 81)లో ఈ పాట తెలుగు అనువాదంతో పాటు ప్రచురితమైంది.

4. ర.జెం. దండరి పాట.. పే. 13 (గోండు) పే. 22 (కోలామ్) జ. నా. మం. పాటలు– దరువు పాట– పే. 48.

5. ర.జెం. తాకరో కోయ దాదా– పే. 5 (గోండు) పే. 24 (కోలామ్) జ. నా.మం. పాటలు– నడువరో ఎంకన్న నడువర– పే. 54.

6. ర. జెం. నాట్నోసి పెదాసి– పే. 17 (గోండు) పాలబుగ్గల జీతగాడుని– పే. 26 (కోలాం) జ. నా. మం. పా. పల్లెటూరిపిల్లగాడా– పే. 104.

7. ర.జెం. కష్టం టాగ్వలీర్ (పే. 3) జ. నా. మం. పా– మేము కమ్యూనిస్టులం– పే. 2.

8. ర. జెం. పొడిశె పొడిశే (పే. 10) జ. నా. మం. పా,

9. ర. జెం. భూమి మావాయిరా (పే. 15) జ. నా. మం. పా. భూమి మనదిరా (పే. 93)

రగల్‌జెండా– దొరుకుచోటు : పీస్ బుక్ సెంటర్, సుల్తాన్ బజార్ (విశాలాంధ్ర బుక్ హౌస్ ఎదురుగా), హైదరాబాదు 500 001.

పేజీలు : 28+IV వెల. రు. 0–75 పై

"జీవితంలో తీపి, లిపిలేని గిరిజనులు జిగురు బంకలా ఎర్రజెండానుపట్టుకొని అడవితేనెలా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. వాళ్ళ రగల్‌జెండామీది చంద్రవంక ఆదిలాబాద్‌అడవుల్లో ప్రవేశించిన సుత్తెకొడవలికి అల్లిబిల్లి పాటలను మసకవెన్నెల్లో వివరించే పాటగా మారిపోయింది- పాటపోరాటంలో ,చంద్రవంక సుత్తెకొడవలిలో హత్తుకొనిపోయినవి".

సృజన ప్రచురణగా

కరీంనగర్ ఆదిలాబాద్ పోరాట సాహిత్య ప్రతిస్పందన

పుడమితల్లి పురిటినొప్పుల చప్పుడు

రైతాంగ పోరాట పాటలు

వెలువడింది.

అమరవీరుల ఫోటోలతో 72+ VIII పేజీలు రెండు రూపాయలు

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 001

ఇప్పటివరకు అందిన విరాళాలు

ఆంధ్రప్రదేశ్ రాడికల్ యువజనసంఘం		
రాష్ట్ర మహాసభలు వరంగల్‌లో ఒక బంగారు ఉంగరం +	రూ	1610-61
పెందులూరు, ఏలూరు, గుంటూరు, తేలప్రోలు, జూపూడి	రూ	830.0
ఘాస్మండీ, సికింద్రాబాదు	రూ	550-0
హైదరాబాదు	రూ	140-5
పులివెందుల సభలలో	రూ	75-0
పి. సిద్ధప్ప, తంబళ్ళపల్లి ఎమ్. ఓ. ద్వారా	రూ	25-5
	మొత్తం	3231-6
		ఒక బంగారు ఉంగర

(2వ కవర్ పేజీ తరువాయి)

అనుమానాలు పోగొట్టుకొని ధైర్యం, విశ్వాసం పుంజుకోవడానికి తోటి మానవులుగా మనమెంత సహాయ సహకారాలు స్వచ్ఛందంగా అందించగలమనేది గీటురాయి.

అడవి తేనెవంటి స్వచ్ఛమైన, అడవిపూలవంటి హృద్యమైన స్వభావంగల అమాయక గిరిజనులకు యీ కష్టసమయంలో చేయూతనిచ్చి ఆదుకోవడమూ "మీకు అండగా మేంవున్నాం" అని ఆదివాసులకు ఆసరాగా నిలవడమూ తోటి మానవులుగా మన కనీస ధర్మం.

బాధిత గిరిజనులకు తక్షణ వైద్య సదుపాయం అందించడానికీ, దెబ్బతిన్న కుటుంబాలకు వీలయిన మేరకు పునరావాస సహాయం కల్పించడానికీ "ఆదిలాబాదు గిరిజన సహాయనిధి" సేకరించాలని సంకల్పించాం.

ప్రజాస్వామిక వాదులూ, మేధావులూ, ఉదారులయిన ప్రజలూ విరివిగా విరాళాలు ఇచ్చి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

విరాళాలు పంపించవలసిన చిరునామా :

వరవరరావు, కన్వీనర్

ఆదిలాబాదు గిరిజన సహాయనిధి C/o సృజన,

హనుమకొండ, వరంగల్ 506 001 (ఆంధ్రప్రదేశ్)

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

SRJANA Telugu Monthly May/June 81 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.



తుడుం (నగారా), ఎర్రజెండా
ఎర్రజెండా నాయకత్వంలో పోరాటానికి పిలుపు

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 3-00
Yearly Subscription Rs 20-00